**అధ్యక్షా ! మిత్రులారా !!**

ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ తెలంగాణ రాష్ట్రం 31వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశానికి అధ్యక్షత వహిస్తున్న పాలమూరు ముద్దుబిడ్డ జంగమాయపల్లె అనే గ్రామములో జన్మించి, పాఠశాల విద్యార్జన సమయంలో గ్రామీణ క్రీడ అయిన కబడ్డీ క్రీడాకారునిగా మహబూబ్‌నగర్ జిల్లా జట్టులో సభ్యునిగా ఎన్నో టోర్నమెంట్లలో జిల్లాను విజయపథంలో నడిపి, రాష్ట్ర జట్టుకు ఎంపికై ఉత్తమ కబడ్డీ క్రీడాకారునిగా పేరొంది ఉపాధ్యాయ వృత్తిని చేపట్టి, ఉపాధ్యాయురాలైన సహధర్మచారిణి శ్రీమతి సంయుక్త గారి వృత్తిపరమైన సమస్య సాధనకు ఆనాడు సమితి స్థాయి PRTU సంఘ నేత తీరుకు విస్తుపోయి, కబడ్డీ క్రీడలో అందరు ఇష్టపడే రైడర్ అయిన మీరు PRTU సంఘంలో రైడర్ పాత్రను పోషించాలనే నిర్ణయంతో మండలశాఖలో ప్రధాన బాధ్యునిగా పనిచేసి మీ ముక్కుసూటి తనము, ఉపాధ్యాయ సమస్యల సాధనలో మీ శైలి నచ్చి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలను పాలమూరు ఉపాధ్యాయులు అందించగా, జిల్లా ఔన్నత్యాన్ని ఆనాటి ఆంధ్ర రాష్ట్ర 23 జిల్లాల్లో పెంచి, అత్యధిక సభ్యత్వమున్న జిల్లాగా గత 20 సంవత్సరాలుగా అగ్రభాగాన ఉంచి, 2006 సంవత్సరంలో రాష్ట్ర సంఘ బాధ్యులు ఇరువురు పదవీ విరమణ పొందిన సందర్భంలో శ్రీ బి. మోహన్ రెడ్డి గారి చూపులు మీపై పడేలా చేసి రాష్ట్ర సంఘ అధ్యక్షునిగా నీవే అర్హుడివి అనేలా చేసి ఉత్కంఠ భరితంగా జరిగిన రాష్ట్ర సంఘ ఎన్నికల్లో అఖండ మెజార్టీతో విజయం సాధించి 2015 వరకు రాష్ట్ర సంఘ అధ్యక్షునిగా నాలుగు టర్మ్‌లు ఎన్నికై ఏకధాటిగా 9 సంవత్సరాలు రాష్ట్ర సంఘ అధ్యక్షునిగా పనిచేసి గతంలో అధ్యక్షులుగా పనిచేసిన వారి రికార్డును తిరగరాసి నభూతో, నభవిష్యత్ అనేవిధంగా మీ రికార్డును రాబోవు కాలంలో ఎవరూ అధిగమించరని చెబుతూ, రాష్ట్ర సంఘ అధ్యక్షునిగా ఎన్నో సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకోవడానికి వెనుకాడకుండా, ఎన్నో ఉద్యమ కార్యక్రమాలను రూపొందించి విజయవంతం చేసి, మీ నేతృత్వంలో అప్రెంటీస్ టీచర్లకు 2 నోషనల్ ఇంక్రిమెంట్లు జి.వో.2ను సాధించడం, 9వ, 10వ PRCల సాధనలో కీలకంగా వ్యవహరించి ఉమ్మడి రాష్ట్రంలోని 3.5 లక్షలమంది, ఈనాటి తెలంగాణ రాష్ట్రంలో 1.5 లక్షల మంది ఉపాధ్యాయుల హృదయాల్లో నిలిచిన, ఆత్మ విశ్వాసాన్నే ఆయుధంగా చేసుకున్న ధైర్యశాలి, ఈరోజున 31 సంవత్సరాల ఉపాధ్యాయ వృత్తికి విరమణ చేస్తున్న, ఉపాధ్యాయ ఉద్యమనేత మన PRTU రాష్ట్ర సంఘ అధ్యక్షులు **శ్రీ పేరి వెంకట్ రెడ్డి** గారికి,

తెలంగాణ రాష్ట్ర సాధనలో, తెలంగాణ ఉద్యమ రథసారధి, ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు గారితో కలిసి కదనరంగంలో ముందుకురికి ఉద్యమానికి ఈటెవై, మాటవై, బాటవై ఈటెలాంటి మాటలతో జనాన్ని ఉద్యమ బాట పట్టించిన గౌరవనీయులు, ఉద్యోగ ఉపాధ్యాయులకు 43% ఫిట్‌మెంట్‌తో 10వ PRCలో ప్రధాన భూమికను పోషించిన ఆర్థికశాఖామాత్యులు, జనహృదయాలతో పాటు, ప్రభుత్వ బడుల్లో చదివే పసి హృదయాలను కూడా కొల్లగొట్టడానికి అద్భుత సంక్షేమ పథక ప్రయోగం "సంటోళ్ళకు సన్నబియ్యం" కార్యక్రమాన్ని ప్రారంభించిన పౌర సరఫరాల శాఖామాత్యులు, బంగారు తెలంగాణకు బాటలు వేస్తున్న నిత్య కృషీవలుడు, శ్రామికుడు, రక్షకుడు మన ముఖ్య అతిథి **శ్రీ ఈటెల రాజేందర్** ఆర్థిక/పౌర సరఫరాల శాఖామాత్యులు గారికి,

2011 సంవత్సరంలో ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికల్లో పోటీచేసి విశ్లేషకుల అంచనాలను తలక్రిందులు చేసి సంఘం సాధించినవన్నీ అగ్ర నాయకత్వ విజయాలు కావు. ద్వితీయశ్రేణి నాయకత్వం

పాత్ర కూడా ఉంటుందని మీ విజయం తేల్చి చెప్పింది "వ్యక్తి కన్న సంఘం మిన్న" అనే నానుడిని నిజం చేసింది మీ విజయం. ఎమ్మెల్సీని అనే భావన మచ్చుకు కూడా కనిపించకుండా ఉపాధ్యాయులలో కలిసిపోయే మనస్తత్వము కల్గి అందరివాడిగా పేరుపొంది శాసనమండలిలో ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై గళమెత్తుతున్న PRTU ఫ్లోర్ లీడర్ శాసనమండలి సభ్యులు **శ్రీ కాటేపల్లి జనార్థన్ రెడ్డి** గారికి,

జిల్లా ప్రధాన కార్యదర్శిగా, జిల్లా అధ్యక్షునిగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఒకే టర్మ్ పనిచేసి TTJAC ఛైర్మన్‌గా తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఉపాధ్యాయులను సకల జనుల సమ్మెలోకి దించి, శాసనమండలి ఎన్నికల్లో PRTU అభ్యర్థిత్వానికి నీవే అర్హునివి అనేవిధంగా సంఘ పెద్దల మనస్సు గెలిచి, తెలంగాణ సెంటిమెంట్ పేటెంట్ హక్కుదారులం మేమే అనుకునే వారి అంచనాలను తప్పు అని, ఎమ్మెల్సీగా మీ విజయం సకలజనుల సమ్మెలో ముందు భాగాన నిలిచిన PRTU ఉపాధ్యాయులకు దక్కేలా చేసింది. సేవాభావాన్ని నమ్ముకొన్న శ్రమజీవి PRTU శాసనమండలి సభ్యులు **శ్రీ పూల రవీందర్** గారికి,

మీతో కలిసి పనిచేసిన వారికే మీ ఆత్మీయత, అనురాగాలు అర్థమవుతాయనే నిజాన్ని మీలో చూడగలిగి, మీ గంభీరత్వము పాలకులను నిలదీసి ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి తోడ్పడిందని, మీరు 26 సంవత్సరాలు రాష్ట్ర సంఘ బాధ్యునిగా, 6 సంవత్సరాలు ఎమ్మెల్సీగా, పనిచేసినకాలంలో సమస్యలతో కాంప్రమైజ్ కాకుండా, 'నో కాంప్రమైజ్' అనే సిద్ధాంతంతో సమస్యలతో పోటీపడి సాధించిన తీరు ఏ స్థాయిలోని నాయకునికైనా ఆదర్శమని, స్ఫూర్తిదాయకమని, మీరు సాధించిన ఎన్నెన్నో ప్రభుత్వ ఉత్తర్వులు ఉపాధ్యాయులను ఉన్నత స్థానంలో నిలిపి, మళ్ళీ జన్మంటూ ఉంటే ఉపాధ్యాయ వృత్తిలో చేరి PRTU సంఘ నాయకత్వాన్ని స్వీకరిస్తాననే మీ వాక్కు మమ్మల్ని సంఘసేవ చేయుటకు పురికొల్పుతున్నాయని తెలుపుతూ, ఉపాధ్యాయులందరూ అభిమానించే నాయకులు, PRTU మాజీ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ, AITO ఛైర్మన్ **శ్రీ బి. మోహన్ రెడ్డి** గారికి,

"పంచాయతీ రాజ్ ఉపాధ్యాయ" మాసపత్రికకు తన సుదీర్ఘ అనుభవాన్ని రంగరిస్తూ నెలనెలా చక్కని కూర్పుతో రూపొందిస్తున్న పత్రిక ప్రధాన సంపాదకులు శ్రీ నరహరి లక్ష్మారెడ్డి గారికి, పత్రిక సంపాదక వర్గ సభ్యులకు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులకు, నూతన తెలంగాణ రాష్ట్రంలో 10 జిల్లాల సారథ్య బాధ్యతలను స్వీకరించిన జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు, జిల్లా బాధ్యులకు, సంఘ సీనియర్ కార్యకర్తలకు, ఈ కౌన్సిల్ సమావేశానికి ఆతిథ్యం ఇస్తున్న కరీంనగర్ జిల్లా అధ్యక్షులు శ్రీ జాలి మహేందర్ రెడ్డి గారికి, జిల్లా బాధ్యులకు, జిల్లాలోని మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు, సంఘ కార్యకర్తలందరికీ స్వాగతం... సుస్వాగతం...

## తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావము ఈ కార్యవర్గ కాలంలోనే

13, 14 అక్టోబర్ 2012లో ఆనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని PRTU AP కి జరిగిన 30వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఈ కార్యవర్గం ఎన్నుకోబడింది. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం ఊపందుకొని తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తప్పనిసరి అని కేంద్ర ప్రభుత్వం సిద్ధము కావడం, తెలంగాణ 10 జిల్లాలలో 1971వ సంవత్సరంలో స్థాపించబడ్డ సంఘంగా, ఆంధ్ర 13 జిల్లాలో సంఘం పటిష్టంగా నడుస్తున్నప్పటికీ, తెలంగాణ ప్రాంత సభ్యులైన ఉపాధ్యాయులు, మన జిల్లాశాఖల ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమంలో పాల్గొనడం,

రాష్ట్ర సంఘ ప్రధాన కార్యదర్శి శ్రీ పూల రవీందర్ గారు అన్ని ఉపాధ్యాయ సంఘాలను ఏకం చేసి తెలంగాణ బిడ్డలుగా మనం ఉద్యమంలో పాల్గొనాలని TTJAC ఏర్పాటు చేసి తెలంగాణ ఉపాధ్యాయలోకము తమ కర్తవ్యంగా తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పాల్గొనడం, ఆంధ్ర ప్రాంత ఉపాధ్యాయులు, సంఘ బాధ్యులు, ఎమ్మెల్సీలు ఏనాడు తెలంగాణ ప్రాంత సభ్యుల ఆత్మగౌరవాన్ని కాదనకపోవడం, సంఘ ఆవిర్భావం నుండి ప్రతిసారీ తెలంగాణ ప్రాంతం వారే రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎన్నుకోబడుతున్న సంప్రదాయాన్ని సమర్థించి మరోమారు రాష్ట్ర సంఘ అధ్యక్షులుగా శ్రీ పి. వెంకట్ రెడ్డి గారిని, వరంగల్ జిల్లా TTJAC ఛైర్మన్‌గా పనిచేసిన నన్ను (పి. సరోత్తం రెడ్డి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం, సమైక్య ఆంధ్రను కోరుకునే ఆంధ్ర బాధ్యులు, ప్రత్యేక తెలంగాణ కావాలనే తెలంగాణ ఉపాధ్యాయుల భిన్న (ఆలోచనల్లోంచి) త్వంలో ఏకత్వం రావడం విశేషంగా భావిస్తున్నాము.

ఇలా 23 జిల్లాల PRTU AP ప్రధాన బాధ్యులుగా ఎన్నికైన మా టర్మ్‌లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ఫలవంతమై తెలంగాణ రాష్ట్ర ప్రకటన రావడం, పార్లమెంట్ ఉభయ సభల్లో తీర్మానము, ఆమోదము ఈ కాలంలో జరగడం ఈ కార్యవర్గం సువర్ణాక్షరాలతో లిఖించుకోదగ్గది.

జూన్ 2, 2014న రెండు తెలుగు రాష్ట్రాలు ఏర్పడడము తెలంగాణ రాష్ట్రానికి మేము ఇరువురము ప్రధాన బాధ్యులుగా కొనసాగి, PRTU AP కి, PRTU TS కి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా పనిచేసిన గొప్ప అవకాశము రావడముతో PRTU సంఘ చరిత్రలో ఈ కార్యవర్గం ప్రత్యేకంగా నిలిచింది. PRTU AP రాష్ట్ర అధ్యక్షులుగా శ్రీ ఎం. కమలాకర్ రావు, ప్రధాన కార్యదర్శిగా శ్రీ బి. అప్పారావు గారు ఏకగ్రీవంగా ఈ కార్యవర్గ కాలంలో ఎంపిక కావడం జరిగింది. ఉమ్మడి రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో రాష్ట్ర సంఘ భవనము ఉండడం వలన కొన్ని ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు, కొందరు వ్యక్తులు వీరిలో మనస్పర్థలు వస్తాయని ఊహించినా, రాకుండా ఉండడంతో వారి అంచనాలను తలక్రిందులు చేసినట్లయింది.

ఉమ్మడి రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో రాష్ట్ర సంఘ భవనం ఉండడం, ఆంధ్రలో రాజధానికి నిర్మాణం అగువరకు, వారు సంఘ కార్యకలాపాలు నిర్వహించుకొనడానికి మొదటి అంతస్తులో 3 గదులు వారికి ఇవ్వడము జరిగింది. లావాదేవీల విషయంలో ఎలాంటి వాదనలు లేకుండా సంఘ సభ్యత్వ నిధి నుండి రూ. 15 లక్షలను, మాస పత్రిక నిధి నుండి 10 లక్షలను ఇచ్చుటకు, PR ఉపాధ్యాయ సంక్షేమ సంస్థ నిధులను ఆర్థిక లావాదేవీలను తెలంగాణ రాష్ట్రశాఖ నిర్వహించునట్లు, పదవీ విరమణ చెందిన వారికి చెల్లింపులు PRTU TS జరుపునట్లు అంగీకారము కుదుర్చుకోవడం జరిగింది. పై ఒప్పంద అంగీకార సందర్భంలో సహకరించిన ఆంధ్ర ఎమ్మెల్సీలు శ్రీ గాదె శ్రీనివాసులు నాయుడు గారికి, శ్రీ బచ్చల పుల్లయ్య గారికి PRTU AP అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీ ఎం. కమలాకర్ రావు, శ్రీ బి. అప్పారావు గారలకు, 13 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు, సంఘ సీనియర్ కార్యకర్తలకు, సభ్యులకు, తెలంగాణ ఎమ్మెల్సీలు శ్రీ కె. జనార్ధన్ రెడ్డి గారికి, శ్రీ పూల రవీందర్ గారికి, మరీ ముఖ్యంగా PRTU ను 23 జిల్లాలకు విస్తరింపజేసిన పితామహుడు శ్రీ బి. మోహన్ రెడ్డి మాజీ ఎమ్మెల్సీ, AITO ఛైర్మన్ గారికి కృతజ్ఞతాభినందనములు.

## భారత రత్న ఎ.పి.జె. అబ్దుల్ కలామ్ గారి ఆశయ సాధన మన కర్తవ్యం

భారత దేశ శాస్త్ర సాంకేతిక విజ్ఞానగని, మన దేశపు కీర్తి పతాకాన్ని ప్రపంచ నలుదిక్కులా అగ్రభాగాన నిలిపిన మరో 'మహాత్ముడు' కలాంగారు. వారి అస్తమయంతో యావత్ ప్రపంచం తీవ్ర దిగ్భ్రాంతికి లోనైంది. వారి ఆశయాలను, ఆలోచనలను ముందుకు తీసుకువెళ్ళడం మన కర్తవ్యం. వారు గడిపిన నిరాడంబర జీవితం,

నిస్వార్థ సేవా నిరతి భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత మనందరిది. చిన్నారి విద్యార్థుల పట్ల ఆ మహనీయుని ప్రభావం ప్రపంచ దేశాల్లో మారుమ్రోగుతున్నది. ముఖ్యంగా వారి విజన్ 2020 భారతదేశం ప్రపంచ దేశాల్లో సూపర్ పవర్‌గా నిలవాలనే వారి కలను 128 కోట్ల భారతీయులు నిజం చేసే దిశలో ముందుకు నడవాలి.

నేను రాష్ట్రపతిని అయినా నాకు విద్యాబోధనే ఇష్టం అని 27 జూలై 2015న విద్యార్థుల మధ్యనే వారు నేలకొరిగిపోవడం జరిగింది. "నేను చనిపోయిన రోజున సెలవుదినంగా ప్రకటించవద్దు. ఒకరోజు అదనంగా పనిచేయండి" అదే తనకు నిజమైన నివాళి అని చెప్పిన భారతరత్నానికి PRTU శ్రద్ధాంజలి ఘటిస్తోంది.

## PRTU దిగ్గజం శ్రీ బీరవెల్లి ధర్మారెడ్డి

శ్రీ ధర్మారెడ్డి గారు 1977-1984 మధ్యకాలంలో PRTU రాష్ట్ర సంఘ అధ్యక్షులుగా పనిచేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఉన్న సౌకర్యాలను పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు వర్తింపచేసిన ఘనత వీరిదే. 1984లో జరిగిన శాసనమండలి ఎన్నికల్లో PRTU పక్షాన ఎమ్మెల్సీగా అఖండ విజయం సాధించారు. వారు 12-9-2014న తుదిశ్వాస విడిచారు. PRTU పక్షాన ఉపాధ్యాయుల సమస్యలపై రాజీలేని పోరాటం చేసిన ధర్మన్నకు ఈ సమావేశ పక్షాన శ్రద్ధాంజలి ఘటిస్తున్నాం.

ధన్యజీవి PRTU ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షులు శ్రీ రాఘవులు గారికి శ్రద్ధాంజలి ఘటిస్తూ, 7-10-2015న నల్గొండలో జరిగిన బస్సు ప్రమాదంలో మరణించిన 11 మందికి, ఉపాధ్యాయుడు శ్రీనివాస్ గారికి, ఈ కార్యవర్గ పదవీకాలంలో అకాల మరణానికి గురైన ఉపాధ్యాయులందరికీ ఈ సమావేశ పక్షాన సంతాపాన్ని ప్రకటిస్తున్నాం.

## ముందుమాట

గడచిన మూడు సంవత్సరాల కాలంలో జరిగిన సంఘటనలను సంక్షిప్తంగా పరిశీలిద్దాం..

పాకిస్థాన్‌లో సైనిక పాఠశాలపై దాడి చేసి చిన్నారుల ప్రాణాలను హరించడం, ఛార్లీ 'హెబ్డో' పత్రిక కార్యాలయంపై దాడి, సిబ్బంది హత్య, సరిహద్దుల్లో పాక్ కవ్వింపు, ఈజిప్టులో మహ్మద్ మోర్సీపై తిరుగుబాటు, నల్లజాతి సూరీడు నెల్సన్ మండేలా అస్తమయం. నేపాల్‌లో భూకంపం సంభవించి వేలాది మంది ప్రాణాలు కోల్పోవడం, ఫిలిపీన్స్‌లో 'హైమాస్' తుఫానుకు 10వేల మంది ప్రాణాలు విడువడం,

గత UPA ప్రభుత్వం FDI బిల్లును తేవడం, 2జి స్పెక్ట్రమ్ కుంభకోణం, DLF, అగస్టా వెస్ట్‌లాండ్, బొగ్గు కుంభకోణం లాంటి అవినీతి ఆరోపణలు ఎదుర్కొనడం, దేశ రాజధానిలో "నిర్భయ" సామూహిక అత్యాచారము, ఉగ్రవాదులు కసబ్, అఫ్జల్ గురుల ఉరితీతలు, దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుళ్ళు, వివిధ రాష్ట్రాల శాసనసభల ఎన్నికల్లో మిశ్రమ ఫలితాలు, వేతన జీవులైన ఉద్యోగుల ఆదాయపు పన్ను పరిమితిని పెంచకపోవడం, కేదార్‌నాథ్, బద్రీనాథ్ ప్రాంతాల్లో జలవిలయం, సహాయ చర్యల్లో 19 జవాన్ల మృతి, వేలాదిమంది ప్రాణాలు కోల్పోవడం, ఉపాధ్యాయ, ఉద్యోగ వర్గాలు 1/2రోజు వేతనాన్ని ఉత్తరాఖండ్ ప్రభుత్వానికి విరాళంగా ఇవ్వడం, డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ రూ. 67/-కు తగ్గడం, UPA 2 'ఆహార భద్రత బిల్లు' తీసుకురావడం, క్రికెట్ రారాజు

సచిన్ ఆటకు విశ్రాంతి తీసుకోవడం, భారతరత్న అవార్డులు సచిన్, ప్రముఖ రసాయన శాస్త్రవేత్త శ్రీ చింతామణి నాగేశ్ రామచంద్రరావు (సి.ఎస్.ఆర్. రావు) అందుకోవడం, ఉత్తరప్రదేశ్ ముజఫర్‌నగర్ అల్లర్లలో 60మంది ప్రాణాలు కోల్పోవడం, 'నిర్భయ' నిందితులకు మరణ శిక్ష, సార్వత్రిక ఎన్నికల ముందు సెమీఫైనల్స్‌లా జరిగిన 5 రాష్ట్రాల ఎన్నికలు, తిరస్కరణ ఓటు 'నోటా' ప్రవేశపెట్టడం, తెలంగాణ రాష్ట్ర బిల్లు పార్లమెంట్ ఆమోదము, కేంద్రంలో అఖండ మెజార్టీ సాధించి మోడీ గారు ప్రధాన మంత్రి కావడం, అతి పిన్న వయస్సులో పూర్ణ, ఆనంద్‌లు ఎవరెస్ట్‌ను అధిరోహించడం, మోడీ అంతర్జాతీయ సంబంధాల పెంపులో భాగంగా తన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి సార్క్ దేశాల అధినేతలను పిలవడం, నేపాల్, భూటాన్, జపాన్, చైనా, బ్రెజిల్, అమెరికా పర్యటనలు, 100 స్మార్ట్ సిటీలుగా నగరాలను రూపొందించే పథకం, జన్‌ధన్ పథకంలో అందరికీ బ్యాంకు ఖాతాలు, గురుపూజోత్సవం 5వ సెప్టెంబర్‌న విద్యార్థులతో ముఖాముఖి, నెలలో ఒకసారి ఆదివారం రోజున "మన్‌కీ బాత్" రేడియో కార్యక్రమం, అక్టోబర్ 2న గాంధీజీ జయంతి నాడు ప్రారంభించిన "స్వచ్ఛ భారత్", మాస్ ఆర్బిటర్ మిషన్ ఉపగ్రహాన్ని పంపడం, కైలాష్ సత్యార్థి, యూసఫ్ మలాలా నోబెల్ బహుమతి అందుకోవడం, కర్ణాటక కోర్టు తీర్పు మేరకు తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత అరెస్ట్, బరాక్ ఒబామా అమెరికా అధ్యక్షునిగా రెండవసారి భారత్ రావడం, సార్వత్రిక ఎన్నికలు తరువాత జరిగిన రాష్ట్రాల ఎన్నికల్లో మహారాష్ట్ర, హర్యానా, జార్ఖండ్, జమ్ముకాశ్మీర్ లలో బి.జె.పి ప్రభుత్వాలు ఏర్పడడం, కానీ ఢిల్లీలో 'ఆప్' విజయం, కీ.శే. మదన్ మోహన్ మాలవ్యకు, శ్రీ అటల్ బిహారీ వాజ్‌పేయి గారలకు భారత రత్న పురస్కారాలు, జూన్ 21ని "అంతర్జాతీయ యోగా దినోత్సవం"గా ఐక్యరాజ్య సమితి ప్రకటించడం, కోట్లాదిమంది పాల్గొనడం, భూసేకరణ బిల్లు తేవడానికి ప్రయత్నం, పనికిరాని చట్టాలను రద్దు చేయడం, 'అటల్ పెన్షన్ యోజన', 'ప్రధానమంత్రి భీమా సురక్ష యోజన' లాంటి పథకాలతో ప్రజలకు భీమా సౌకర్యం కల్పించడం.

జనాకర్షణ గల నాయకుడు వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి మరణానంతరం వారి పాలనలో అక్రమాలకు పాల్పడ్డ అనేకమంది మంత్రులు, అధికారులు, నాయకులు జైలు పాలుకావడం, అనూహ్యంగా ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన కిరణ్‌కుమార్ రెడ్డి పాలన, మన రాష్ట్ర ప్రభుత్వం "ఎస్సీ/ఎస్టీ సబ్‌ప్లాన్", బంగారుతల్లి పథకాలను ప్రవేశపెట్టడం, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, కరెంటు కోతలు, గోదావరిపై మహారాష్ట్ర బాబ్లీ ప్రాజెక్టు నిర్మాణాన్ని పట్టించుకోకపోవడం జరిగింది. మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఓల్వో బస్సు దుర్ఘటనలో 45 మంది దుర్మరణం, విజయనగరంలో రైలు నుండి దూకి ఎదురుగా వస్తున్న రైలు క్రిందపడి 10 మంది మరణం, హైదరాబాద్‌లో అంతర్జాతీయ వ్యవసాయ సదస్సు జరగడం, నూతన స్వతంత్ర తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా శ్రీ కె.సి.ఆర్. గారు బాధ్యతలు చేపట్టడం, బియాస్ నదిలో విజ్ఞాన్‌జ్యోతి కళాశాలకు చెందిన 24 మంది ఇంజనీరింగ్ విద్యార్థులు గల్లంతు, సికింద్రాబాద్‌లో హోటల్ కూలిన ఘటనలో 17మంది మృత్యువాత పడడం, "ఫైలిన్, హెలెన్" తుఫానులకు ప్రాణ, పంట నష్టం, హైదరాబాద్‌లో 'అభయ'పై అత్యాచారము, మెదక్ జిల్లా మాసాయిపేటలో బస్సు, రైలును ఢీకొన్న ఘటనలో చిన్నారి విద్యార్థుల దుర్మరణం,నూతన తెలంగాణ రాష్ట్రంలో "బతుకమ్మ" పండుగను అధికారికంగా జరపడం, మన ఊరు-మన ప్రణాళిక కార్యక్రమము, సకల జనుల సర్వే ఒకేరోజు అన్ని కుటుంబాల సర్వే నిర్వహించడం, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, దళితులకు 3 ఎకరాల భూమి, కె.జి. నుండి పి.జి. ఉచిత విద్య లాంటి నిర్ణయాలు, వాటర్‌గ్రిడ్ పథకం, రైతు రుణమాఫీ, 10వ PRC లో 43% ఫిట్‌మెంట్ ప్రకటించడం, మన రాష్ట్రంలో మధ్యాహ్న భోజన పథకంలో 'సన్నబియ్యం' పంపిణీ, 'మిషన్

కాకతీయ' పేరిట చెరువుల పునరుద్ధరణ, స్వైన్‌ఫ్లూ విజృంభించడం, రాష్ట్రంలో 'హరితహారం', 'జలహారం' వాటర్ గ్రిడ్ పథకాల ప్రారంభం 'ఓటుకు నోటు' కేసులో ప్రతిపక్షాల నేతలు జైలుకు వెళ్ళడం.

ముందుమాటలో చివరి మాటలుగా ఇటీవల జరిగిన సంఘటనలను మీముందుంచుతున్నాము.

గ్రీస్ సంక్షోభం, చైనా ఆర్థిక విధానాలు పెను సంక్షోభాలుగా మారినప్పటికి, సుస్థిర ఆర్థిక విధానాలు అనుసరిస్తున్న మనదేశంలో వాటి ప్రభావం ఏమీలేకపోవడం హర్షదాయకం. ఇటీవల మనదేశానికి ఉత్తరాదిన భూకంపం సంభవించి దీని ప్రభావం ఆఫ్ఘనిస్థాన్‌పై ఎక్కువగా ఉండి ప్రాణనష్టం జరిగింది.

జాతీయ స్థాయిలో గమనిస్తే మోదీ గారి వివిధ దేశాల పర్యటనలు ఆఫ్ఘనిస్థాన్, యు.ఎ.ఇ, అమెరికా పర్యటనల్లో పాల్గొంటూ భారత కీర్తిని పెంచే ప్రయత్నాలు చేస్తున్నారు. ఐక్యరాజ్యసమితి సమావేశాల్లో భారత్‌కు శాశ్వత సభ్యత్వం ఇవ్వాలనే ప్రతిపాదన, ఐక్యరాజ్య సమితి ప్రాధానత్య అంశాల్లో "వాతావరణ మార్పులు" "ఉగ్రవాద" సమస్యలపై సత్వర చర్చ జరిగి ప్రధాన అంశాలుగా చేర్చాలని కోరడం, పాక్ సైన్యం సరిహద్దు రేఖ దగ్గర కాల్పులకు పాల్పడటం, ఉగ్ర ముష్కరుల దాడులు కాశ్మీర్‌లో కొనసాగుతున్నాయి. వర్షాకాల పార్లమెంట్ సమావేశాలను స్థంభింప చేయడం, మధ్యప్రదేశ్, రాజస్థాన్ ముఖ్యమంత్రులపై, విదేశాంగ మంత్రి సుష్మ స్వరాజ్‌పై వచ్చిన ఆరోపణలపై చర్చకు పట్టుపట్టడం, భూసేకరణ బిల్లును, జి.ఎస్.టి. బిల్లును పార్లమెంట్ ముందుకు తేలేకపోవడం, చివరకు భూసేకరణ బిల్లును ఉప సంహరించుకుంటున్నామని కేంద్ర ప్రభుత్వ నిర్ణయము, భారత్, బంగ్లా సరిహద్దు వివాదాలను పరిష్కరించుకొని భూభాగాన్ని, ప్రజలను బదలాయించుకొని 67 సంవత్సరాల సమస్య పరిష్కారం కావడం, నాగా ఒప్పందం, జి.ఎస్.ఎల్.వి. –డి 6 ఉపగ్రహాన్ని విజయవంతంగా పంపడం, గోమాంసంపై నిషేధాన్ని కొన్ని రాష్ట్రాలు విధించడం, ఉత్తర ప్రదేశ్ దాద్రి గ్రామంలో గోమాంసం తిన్నాడని ఒక వ్యక్తిని కొట్టి చంపడం, బీహార్‌లో జరుగుతున్న ఎన్నికల్లో "బీఫ్" ఒక ఎన్నికల అంశంగా మారడం, NDA మహాకూటమి పోరాటంలో విజయం ఎవరివైపో నవంబర్ 8న తేలనున్నది, ఉల్లి, కందిపప్పు ధరలు పెరగడం, న్యాయమూర్తుల నియామకాలను చేపట్టే కొలీజియం వ్యవస్థ, సుప్రీం కోర్టు కొట్టివేసిన న్యాయ నియామకాల కమీషన్‌పై రగడ.

శ్రీశ్రీ గారు స్వార్థం, అవినీతితో దేశం ఎటు పోతుంది అన్నట్లుగా, అందెశ్రీ గారు "మాయమైపోతున్నడమ్మా మనిషన్నవాడు" అన్నది ఈ రోజుల్లో అక్షర సత్యంగా మారింది. ఈ దేశం నుండి అవినీతి పారద్రోలాలనే సంకల్పంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నప్పటికీ అవినీతి అంతానికి అతి త్వరగా చర్యలు ప్రారంభించాలని కోరుతున్నాం. కేంద్రం ప్రారంభించిన చర్యల్లో భాగంగా స్విస్ బ్యాంకుల్లో దాచిన బ్లాక్‌మనీని దేశానికి 100 రోజుల్లో రప్పిస్తామన్న విషయంలో వెనుకబడ్డప్పటికి, సెప్టెంబర్ 30 లోగా నల్లధనం కలిగినవారు ప్రభుత్వానికి సరెండర్ చేయాలనే గడువులోగా సుమారు 4వేల కోట్ల మొత్తాలను ప్రభుత్వానికి సరెండర్ చేయడం జరిగింది. ఈ గడువు తరువాత నల్లధనం స్విస్ బ్యాంకు నుండి రప్పించి కఠిన చర్యలు తీసుకుంటామనే కేంద్ర నిర్ణయం ఏవిధంగా అమలు జరుగుతుందో వేచి చూడాలి. గాలి, నీరు. కాంతి, తినే పదార్థాలు కాలుష్యానికి గురౌతున్నట్లే, మనం చెలామణి చేసే కరెన్సీనోట్లు నకిలీవే అనే వార్త సగటు జీవిని విస్మయానికి గురిచేసేవే. ఎ.టి.ఎం./ బ్యాంక్ నుండి డ్రా చేసిన డబ్బులో దొంగనోట్లు వస్తున్నాయి అంటే అవి జేబులో ఉంచుకొన్న వ్యక్తి పరిస్థితి ఏమిటి? దీన్ని నివారించడంలో భాగంగా కేంద్రప్రభుత్వం 2005కు పూర్వం ముద్రించబడ్డ రూ. 500 నోట్లను

సరెండర్ చేయించింది. 'డిజిటల్ ఇండియా' కార్యక్రమం అమలులో భాగంగా "జన్‌ధన్ యోజన"లో ప్రతి వ్యక్తి బ్యాంక్ అకౌంట్‌ను కలిగి ఉండాలని 'జీరో' అకౌంట్‌తో బ్యాంక్ ఖాతాలను తెరిపించే కార్యక్రమంలో భాగంగా 20 కోట్ల ఖాతాలు తెరిపించడం జరిగింది. రాబోవు రోజుల్లో అవినీతిని అరికట్టడంలో భాగంగా నగదు కొనుగోళ్ళకు బదులుగా ఆన్‌లైన్ మార్కెటింగ్‌ను అమలులోనికి తెస్తూ కరెన్సీ ఉపయోగాన్ని తగ్గించాలని కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నది. ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్లలందరికీ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఒక అంశాన్ని గుర్తు చేస్తున్నాను. మనం పొందే వేతనం నుండి ఖర్చు చేసే మొత్తాలను ఆన్‌లైన్‌లో చెల్లింపు చేస్తే మనం చెల్లించే ఆదాయపు పన్నులో మినహాయింపు ఇవ్వడానికి నిర్ణయం జరిగింది. ఈ సౌకర్యాన్ని అందరం ఉపయోగించుకొని లాభం పొందుదామని కోరుతున్నాము.

సాంకేతిక, వైద్య రంగం బాగా అభివృద్ధి చెంది 21వ శతాబ్దంలో ఎన్నో అద్భుతాలు జరుగుతున్నవి. ఈ విజ్ఞానాన్ని ప్రపంచంలోని సమస్త జీవరాశులకు ఉపయోగపడేదిగా ఉండాలని కానీ, వినాశనానికి ఉపయోగపడుతున్న సందర్భానికి కారకుడవుతున్న మానవుడు ప్రపంచాన్ని శాంతి మార్గంలో నడిపేదిశగా కృషి చేయాలి. యువత మతవిద్వేషాలకు బానిస కాకుండా ఉండాలి. యువత ఈ రోజుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని పనికిరాని విషయాలను ఇంటర్నెట్‌లో చూస్తుండడం దురదృష్టకరం. అది గ్రామమైన, పట్టణమైన ఒక కూడళ్లలో పరిశీలిస్తే పదుల సంఖ్యలో యువత గుమిగూడడం టచ్ స్క్రీన్ సెల్‌లలో ఆటలు ఆడుకోవడం ఒక వ్యసనంగా మారింది. రాబోవు సంవత్సరము వైద్యరంగంలో జరుగుతున్న ఒక అద్భుతాన్ని మీముందుంచుతున్నాను. పురాణాల్లో వినాయకునికి తల మార్పిడి చేసి ఏనుగు తలను అమర్చిన విషయాన్ని ఏదో కథలే అనుకునే రోజులు పోయి అది నిజంగా జరిగింది అనేది తేటతెల్లం కానుంది. ఇప్పటికే ఎలుకలకు తలలు మార్పిడి చేసిన వైద్యులు మనిషి తలను మార్చడానికి చేస్తున్న ప్రయత్నం విజయవంతం కావాలని కోరుకుందాం. టెలిఫోన్ అంటే మాటలను ఒక చోట నుండి మరొక చోటుకి పంపడం, ట్రాన్స్‌పోర్టేషన్ అంటే వస్తువులను ఒకచోటు నుంచి మరొక చోటుకి పంపడము. కానీ ఈ రెండింటిని జోడించి టెలిపోర్టేషన్ చేయడానికి శాస్త్రవేత్తలు సిద్ధం అయినారు. ఇప్పటికే పదార్థాలను ఒకచోటు నుండి మరొక చోటుకి ఈవిధానంలో పంపుతున్నారు. మనిషిని కూడా టెలిపోర్టేషన్ ద్వారా ఒక చోటు నుండి మరొకచోటుకి క్షణాల్లో పంపే ప్రక్రియకు ప్రయోగాలు జరుగుతున్నవి. పూర్వకాలంలో నారదుడు ఎక్కడ అనుకుంటే అక్కడ క్షణాల్లో ప్రత్యక్షమయ్యేవాడు అన్నది కూడా నిజం అవుతుందో!

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం జరిగి ఏడాదిన్నర కావస్తున్న సందర్భంగా మన రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పలు సంక్షేమ, అభివృద్ధి పథకాలు ఫలించాలని కోరుకుంటూ, గత పథకాలకు తోడుగా ' పల్లెసీమలే పట్టుకొమ్మలు' అనే నానుడికి వాస్తవిక రూపం కల్పించేందుకు 'గ్రామజ్యోతి' కార్యక్రమంలో ప్రణాళికలు తయారు చేయడం, అందరి చేతులు కలిస్తే గ్రామాల్లో పారిశుధ్య సమస్యలుండవనీ, స్వయం సమృద్ధి సాధించేందుకు కలిసికట్టుగా శ్రమించాలనే ముఖ్యమంత్రిగారి ప్రయత్నం విజయవంతం కావాలని కోరుకుంటున్నాము. TSPSC ఉద్యోగాల నోటిఫికేషన్‌లు నిరుద్యోగ యువతకు ఊరటనిచ్చింది. గోదావరి పుష్కరాలను జులై 14 నుండి 25 వరకు 12 రోజుల వరకు విజయవంతంగా నిర్వహించడం జరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో రాజమండ్రిలో గోదావరి పుష్కరాల్లో జరిగిన తొక్కిసలాటలో 30మంది మరణించడం, వర్షాభావ పరిస్థితులు రాష్ట్రంలో ఏర్పడటం, ప్రతిరోజూ పదుల సంఖ్యలో రైతు ఆత్మహత్యలు జరగడం విచారించదగ్గ విషయం. అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో

రైతు ఆత్మహత్యలను ప్రధాన ఎజెండాగా ప్రతిపక్షాలు చేసుకోవడం, ప్రభుత్వం రైతు సంక్షేమానికి చేపడుతున్న చర్యలు చాలవని నిరసనలతో సమావేశాల నుండి బహిష్కరణకు గురికావడం జరిగింది. ప్రభుత్వ పాలనకు వరంగల్ పార్లమెంట్, నారాయణ్‌ఖేడ్ అసెంబ్లీ ఉప ఎన్నికలు లిట్మస్ పరీక్షగా మారనున్నాయి.

ఆనాటి 21-06-2015 సమావేశంలో ప్రధాన కార్యదర్శి నివేదికలో అభ్యంతరకరమైన వాక్యాన్ని గుర్తు చేస్తున్నాను. "విద్య పట్ల మక్కువ గల ఆర్థికంగా ఉన్నవారి పిల్లలు కార్పొరేట్, ప్రైవేట్ కాన్వెంట్లోకి, ఆర్థికంగా వెనుకబడ్డ పిల్లలు ఆదర్శ, సంక్షేమ పాఠశాలల్లో చేరగా విద్యనందించడం తమ బాధ్యత కాదని భావించే తల్లిదండ్రుల, పిల్లలందరికీ విద్య నందించాలనే బాధ్యతను ప్రభుత్వ బడులు చూసుకొంటున్నాయి. ఈ వాక్యాన్ని వారు తప్పు పడుతూ ఏ తల్లి తండ్రయినా తన పిల్లవాన్ని చదివించుకోవాలనుకోడా అని ప్రశ్నించారు. దీనికి సమాధానంగా ప్రభుత్వ బడులలోని పిల్లల విషయంలో జరుగుతున్న కొన్ని వాస్తవాలను చర్చించదలుచుకొన్నాం. చదువును మధ్యంతరంగా ఆపివేసి డ్రాపౌట్స్‌గా పిల్లలు మారడానికి బాధ్యులు తల్లిదండ్రులు కాదా? దేశ జనాభాలో 80% గ్రామీణులు, వ్యవసాయాధారిత కుటుంబాల్లోంచి వచ్చినవారే! ప్రతియేటా నవంబర్ నుండి ఫిబ్రవరి వరకు రైతులు పంటలు పండించే రోజులు. ఆరోజుల్లో పత్తి, మిర్చి లాంటి పంటలను ఏరడానికి విద్యార్థులైన పిల్లలను తమ పంట పొలాల్లోకి తీసుకుని వెళ్ళడం, లేదా ఇతరులకు కూలీగా పంపడం ఆనవాయితీగా గ్రామాల్లో జరుగుతున్నది. ఏమైనా తుఫాన్ హెచ్చరికలు జారీ అయి వర్షం పడే వాతావరణం ఉంటే ఆ రోజుల్లో బడిలో విద్యార్థులు సంఖ్య సగానికి తగ్గడం జరుగుతుంది. ఇచ్చట తల్లిదండ్రులు తక్షణం జరిగే నష్టాన్ని, అప్పుడు కలిగే లాభాన్ని చూస్తున్నారు తప్ప విద్యార్థి బంగారు భవిష్యత్తు నాశనం అవుతుందని చూడడం లేదు. పైన తెలిపిన పరిస్థితుల వల్ల హాజరు శాతం తగ్గడంతో పాటు మిగతా రోజుల్లో కూడా 20 నుండి 25 శాతం హాజరు తక్కువగానే ఉంటుంది. అందరు పిల్లలను ఎప్పుడు చూస్తామంటే నెల, నెలా యూనిట్ పరీక్షల్లో, త్రైమాసిక పరీక్షల్లో, అర్థ సంవత్సర, వార్షిక పరీక్షల్లోనే పూర్తిశాతం హాజరు ఉంటుంది. చదువు, బడి విలువ తెలువని కొన్ని వర్గాలవారు పాఠశాల విడిచిన తరువాత పాఠశాల ఆవరణలో సాయంత్రం 5 గం॥ల నుండి రాత్రిళ్ళు మద్యం సేవించడం లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ, ఒకటో రెండు గదుల తలుపులు తెరిచి ఉంచితే సరి, లేకపోతే తాళాలు పగులుతాయి, తలుపులు విరుగుతాయి. ఈ పరిస్థితులను ప్రతి ప్రభుత్వ పాఠశాల ఎదుర్కొంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో 3 భాగాలుగా విభజించబడ్డ మన సమాజంలో మొదటి భాగం వారు ఆర్థికంగా ఉన్నవారు, ప్రైవేట్‌కు, రెండవ భాగం వారు ఆర్థికంగా అంతంత మాత్రంగా ఉండి విద్య తప్పనిసరి అనేవారు ప్రభుత్వ రంగంలోని సంక్షేమ పాఠశాలలకు వెళ్ళుతున్నారు. మూడవ వర్గం వారు తమకు చదువు కంటే తమ పనులు, తక్షణ ఆదాయం సంపాదించే పనులకు ప్రాధాన్యత ఇచ్చి చదువును ఏదో కాకతాళీయంగా నేర్చుకుంటే సరిపోతుందనే వారు. వీరికి చదువు ఇష్టం ఉందని అనాలా? చదువు ఇష్టం లేనివారు అంటే తప్పు అని అనుకోవాలా! అని ఒక్కసారి ఆలోచించండి అని కోరుతున్నాము.

## వాతావరణ మార్పులు - పర్యావరణ ముప్పు

అంతర్జాతీయ జీవ వైవిధ్య సదస్సు హైదరాబాద్‌లో జరిగిన సందర్భాన్ని గుర్తుచేస్తూ, మారుతున్న పరిస్థితులలో జీవులన్నింటిలో తెలివైన జీవి మనిషి కాబట్టి జీవులను కాపాడాల్సింది మానవుడే. అందులో ఉపాధ్యాయుల బాధ్యత మరీ ఎక్కువ కాబట్టి ఈ స్పృహతో ఎన్నో విషయాలను చర్చించడం జరిగింది.

భూగర్భంలోకి మలినాలు చేరి నీటిని కాలుష్యం చేయడంతో స్వచ్ఛమైన నీరు లభించే పరిస్థితి లేక ఫిల్టర్ వాటర్ తప్పనిసరి కావడం, పీల్చే గాలి కాలుష్యం, కాంతి కాలుష్యంతో పట్టణ ప్రజల్లో డి విటమిన్ లోపం ఏర్పడడం, ఆహార పదార్థాలలో కాలుష్యం, విషతుల్యమైన బి.టి. విత్తనంతో పండించిన పంటలు, కూరగాయలు త్వరగా పెరగడానికి యాంటీ బయోటిక్స్ ఇంజెక్ట్ చేయడం జరుగుతున్నది. ఇక్కడ ఒక విషయాన్ని ప్రస్తావిస్తూ ఒకప్పుడు 1/4కేజీ బీరకాయలు కావాలంటే 3 లేదా 4 కాయలు తూకం వేసేవాళ్ళం. ఈనాడు 1/4కేజీ కావాలంటే బీరకాయను కత్తిరించి తూకం వేయాల్సిన పరిస్థితి. కూరగాయలు, పండ్లు తాజాగా ఉండడానికి రసాయనాలను చల్లడం, పండ్లు పక్వానికి రాకముందే కార్బైడ్ విష పదార్థాల ప్రయోగము, సంపూర్ణ ఆహారమైన పాలలో నీళ్ళతో కల్తీకి బదులు అధిక పాల ఉత్పత్తికి ఆక్సిటోసిన్ ఇంజెక్షన్లు వాడకం, పాలు చిక్కగా ఉండటానికి సోడియం బైకార్బొనేట్, యూరియా వాడడం జరుగుతున్నది. వంటనూనెలో పత్తి గింజల నూనె, పామాయిల్ కల్తీకి బదులు పశువుల క్రొవ్వు, పశు, జంతు, కళేబరాలను ఉడికించి తయారు చేసిన నూనెలతో కల్తీ చేయడం జరుగుతున్నది. వీటన్నింటి మీద హైకోర్టు ప్రభుత్వాన్ని పై అంశాలన్నింటిని నియంత్రించాలని తీవ్ర హెచ్చరికలు చేయడం విదితమే.

వాతావరణంలో పెనుమార్పులు వస్తున్నాయి. ఈ సంవత్సరం ఆగష్టు 15న పతాకావిష్కరణ సమయం ఉదయం 9:00 గం॥ల పరిస్థితిని తలుచుకుంటే, 10 నిమిషాలు విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు ఎండలో నిలబడలేని పరిస్థితి. పతాకావిష్కరణ అనంతరం సమావేశాన్ని అసెంబ్లీ నుండి చెట్ల క్రింద జరుపుకునే పరిస్థితి. గతంలో 15వ ఆగష్టు పతాకావిష్కరణ వర్షంలో నిర్వహించగలమా అని అందరము తలుచుకుంటూ వెళ్ళే రోజులు ఏమైపోతున్నవి. ఈ అక్టోబర్ నెలలో విపరీతమైన పరిస్థితులు ఎదుర్కొంటున్నాం. $38^0$ నుండి $39^0$C ఉష్ణోగ్రత రికార్డు అవుతుండడం, మధ్యాహ్నం వీధుల్లో సంచరించలేని పరిస్థితి. గతంలో ఈ సీజన్‌లో భూగర్భ జలాలు బాగా ఉండి, ప్రత్యేకంగా తెలంగాణ రాష్ట్రంలో బావులు, బోరుబావుల నుండి మోటార్లను ఉపయోగించి నీటిని వ్యవసాయానికి వాడేవారు. కానీ ఇప్పుడు ఉష్ణోగ్రతలు పెరిగి ఫ్యాన్లు, ఎ.సిల వాడకం పెరిగి రికార్డుస్థాయిలో విద్యుత్ వినియోగం జరుగుతుంటే పరిస్థితి రాబోవు రోజుల్లో ఊహించడానికి వీలు లేకుండా మారనున్నది. రాత్రివేళల్లో చలి ప్రభావంతో ఉష్ణోగ్రత $20^0$Cకు సమీపించడం విచిత్రంగా మారింది. గత సంవత్సరం వేసవిలో మార్చి, ఏప్రిల్ నెలల్లో ఉష్ణోగ్రత $45^0$ దాటి $50^0$కు సమీపించడం వేడిని తట్టుకోలేక ప్రజలు వేల సంఖ్యలో మృత్యువాత పడటం జరిగింది.

మన రాష్ట్రంలో అనావృష్టి తాండవిస్తున్నది. ఉన్న ప్రాజెక్టుల్లో నీరు నిండకపోవడం, భూగర్భ జలాలు అడుగంటడం ఇప్పుడే వేసవిని తలపిస్తుంటే అసలు వేసవికాలంలో ఎలాంటి పరిస్థితులుంటాయో! మన రాష్ట్ర ప్రభుత్వం దూరదృష్టితో "కాకతీయ మిషన్" పేరిట చెరువులలో పూడికతీత కార్యక్రమం చేపట్టి నీటి నిలువలు పెంచుకునే ప్రణాళికతో ముందుకు వెళ్తున్నప్పటికీ ఈ సంవత్సరం చాలా చెరువుల్లో 10% నీరు కూడా చేరకపోవడం దురదృష్టం. ఇంటింటికి నీరు అందించాలని "వాటర్ గ్రిడ్" పథకాన్ని శరవేగంతో పూర్తయ్యేలా కె.సి.ఆర్.గారి ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. 1, 2 సంవత్సరాల్లో నల్లాల ద్వారా నీరు అందిస్తామని హామీ ఇస్తున్న మన కె.సి.ఆర్, కె.టి.ఆర్. గారల సంకల్పం నిజం కావాలని కోరుకుందాం. కేంద్ర ప్రభుత్వం రూపకల్పన చేస్తున్న నదుల అనుసంధానం కార్యక్రమం రాబోవు 5 సంవత్సరాల్లో పూర్తయ్యి ఉత్తరాదిన అతివృష్టి సంభవించి పొంగుతున్న

గంగా, యమున, బ్రహ్మపుత్ర మొదలైన నదులను, అనావృష్టి ప్రాంతాలైన దక్షిణాదిలో ప్రవహిస్తున్న గోదావరి, కృష్ణా, కావేరి, తుంగభద్ర, పెన్నా నదుల అనుసంధానం జరిగితేనే నీటి అవసరాలు తీరి మన స్వప్నాలు నిజం అవుతాయి. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గోదావరి, కృష్ణా నదులను అనుసంధానించి దేశానికి ఆదర్శంగా నిలిచింది. ఈ విషయంలో టి.ఆర్.ఎస్. ప్రభుత్వం కూడా కేంద్ర ప్రభుత్వంతో కలిసి నదుల అనుసంధాన కార్యక్రమాన్ని త్వరగా జరిగేలా చూడాలని కోరుకుందాం. కొత్త ప్రాజెక్టుల నిర్మాణం చేసి వ్యవసాయంలో 'సాయం' చేయడం నాధర్మము అన్న వ్యవసాయదారుడైన 'రైతు' స్థితి, గతిని మార్చాలి. మనరాష్ట్రంలో రైతు ఆత్మహత్యలు అధికమైనవి. 6 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇచ్చి రైతు కుటుంబాలను ఆదుకోవడం తాత్కాలిక ఉపశమనమే. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి రైతుకు భరోసాగా ప్రతి ఒక్కరు నిలవాలని ఈ సమావేశ పక్షాన కోరుతున్నాం.

భూ ఉష్ణోగ్రత సాధారణం కంటే $0.75^0$ అధికం కావడం, నాసావారు హెచ్చరిస్తున్నట్టు సూర్యునిపై ఏర్పడ్డ సౌరంగం ఎల్‌నినో ప్రభావంతో అమెరికా తదితర దేశాలలలో వర్షాలు, మంచుతుఫానులు పెరిగి, ఆసియా ప్రాంతంలో తీవ్రమైన కరువు ఏర్పడనుంది. పరిస్థితులు ఇలానే కొనసాగితే ఉష్ణోగ్రతలు మరీ పెరిగి మరణాల సంఖ్య అధికం కావచ్చుననే హెచ్చరికలు గమనించాలని కోరుతున్నాం. ఋతుచక్రం మారింది. ఈశాన్య, నైరుతి ఋతువుల ప్రభావంతో వర్షాలు కురిసేవి. వాటి ప్రభావం బాగా క్షీణించింది. బంగాళాఖాతం, అరేబియా సముద్రాల్లో పెనుతుఫానులు ఏర్పడితేనే వర్షాలు పడుతున్నాయి. రాబోవు 20 సంవత్సరాల్లో పడితే కుంభవృష్టి వర్షాలే అని, వాటిలో అనుకోనివిధంగా వరదలు సంభవించడం జరుగుతుందనే శాస్త్రవేత్తలు హెచ్చరికలు వింటున్నాం. మన తాత ముత్తాతలు ఉరుములు, మెరపులతో వర్షం పడితే పిడుగు పడుతుందని "అర్జునా" అని గట్టిగా అరవాలని అరిపిస్తుండేవాళ్ళు. పిడుగు పడితే మనుషులు, పశువులు మాడి మసి అవుతారని చెప్పేవారు. కానీ అంతగా ప్రాణ నష్టం జరిగిన దాఖలాలు లేవు. గత రెండు నెలల కాలంలో ఒకేసారి ఇద్దరు, ముగ్గురు చొప్పున పదుల సంఖ్యలో వ్యవసాయదారులు మరణించిన వార్తలు విన్నాం, చూశాం. హిమాలయ పర్వతాలు కరగడం వేగంగా జరుగుతున్నది. సముద్రమట్టం పెరగడం, సముద్రం భూభాగంపైకి చొచ్చుకుని రావడం జరుగుతున్నది. దీనికి కారణం మానవుడే. సాంప్రదాయ ఇంధనాల వాడకం తగ్గి అణు ఇంధనం, బొగ్గు ఆధారిత ఇంధనాల వాడకం అధికం కావడం. అందుకే సాంప్రదాయ ఇంధనాల వాడకాన్ని పెంపొందించుకోవడానికి భారత ప్రధాని మొన్న ఐక్యరాజ్య సమితి (UN) సమావేశంలో 2030 సంవత్సరం నాటికి ప్రపంచమంతా కృత్రిమ ఇంధన వాడకాన్ని తగ్గించి, సాంప్రదాయ ఇంధనంపై ఆధారపడే చర్యలు తీసుకునేలా సిద్ధం కావాలని ప్రపంచ దేశాలకు పిలుపునిస్తూ తీర్మానించాలని కోరడం జరిగింది. మన భారతదేశంలో కూడా 2022 నాటికి దేశమంతా సౌర విద్యుత్‌పై ఆధారపడేలా కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తున్నది.

గతంలో ప్రజలు నదీతీరాల వెంబడి, సముద్రతీరాల వెంబడి నివసించేవారు కానీ ప్రస్తుతం మారిన జీవన విధానంలో జాతీయ రహదారుల వెంబడి ఉండటానికి ప్రాధాన్యమిస్తూ, గ్రామాల్లో ప్రజలందరూ పట్టణం వైపు వస్తున్నట్లు, రెండు దశాబ్దాల క్రితం గ్రామాల్లోనే కోతులు కనబడేవి కావు కానీ, నేడు అన్ని పట్టణాల్లో కోతుల సంచారం అధికమైంది. అడవుల్లో ఉండే వానరాలు పట్టణాలవైపు పరుగులు తీయడానికి గల కారణాలు ఏమిటి అని ఆలోచించాలి. వానర జనాభా పెరిగిందా? లేక అడవుల విస్తీర్ణం తగ్గి, తినడానికి ఏమీ దొరకక వలస వస్తున్నాయా! ఈ పర్యావరణ మార్పుకు కారణం వానరాలు తినే పండ్ల మొక్కలు తగ్గిపోవడమే.

జంతువులు కానీ, పశువులు కానీ తినడానికి ఉపయోగపడని ఏ చీడ పీడలు ఆశించకుండా, ఏ ఎరువులు లేకుండా ఏపుగా ఎక్కడ ఖాళీ స్థలం ఉంటే అక్కడ విపరీతంగా పెరిగి వ్యాప్తి చెందుతున్న సర్కారు తుమ్మ ఉపయోగం ఏమిటి? కొందరు నిరుపేదలు వంట చెరకుగా వాడుకుంటున్నారు. దీనితో వంట చేయడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయన్న విషయాన్ని మరవద్దు. ఆ చెట్టు ముళ్ళు గుచ్చుకుంటే నొప్పి వర్ణణాతీతం. ఈ బాధ రైతు మిత్రులకు, వంట చెరకుగా వాడే వారికే తెలుస్తుంది. ఈ సంవత్సరం మనరాష్ట్రంలో అనావృష్టి పరిస్థితుల్లో ఈ సర్కారు తుమ్మ పెరుగుదల శరవేగంతో విస్తరిస్తున్నది. రోడ్లమీద ప్రయాణం చేస్తున్నప్పుడు పరిసరాలను పరిశీలిస్తే ఈ చెట్లు కనబడని ప్రాంతం ఉందా? వాగుల్లో, వర్షాలు లేక నీటి ప్రవాహం తగ్గింది, వాగంతా సర్కారు తుమ్మ చెట్లు పెరిగి వాగు జాడ కనబడకుండా మారిన పరిస్థితులను గమనించండి. ఒకవేళ అనుకోని వర్షాలు సంభవిస్తే ఈ చెట్లు వరదను అడ్డుకొని పెను ప్రమాదాలకు కారణం కానున్నవి సర్కారు తుమ్మలు. వీటిని తొలగించే కార్యక్రమం ప్రభుత్వాలే చేపట్టి పండ్ల మొక్కలు పెంచాలి.

పర్యావరణానికి ముప్పు కలిగిస్తున్న పార్థీనియం (వయ్యారిభామ). దీని పెరుగుదలను గమనిస్తే వర్షాలు ఉండనప్పుడు, వర్షాభావ పరిస్థితుల్లో ఈ మొక్కలు ఏపుగా పెరుగుతాయి. వీటిని పరిశీలిస్తే ఎలాంటి చీడ పీడలు హాని చేయవు. ఎలాంటి ఎరువులు అవసరంలేదు. దీని ఉపయోగమేంటి ? ఏ జంతువు, క్రిమి కీటకాలు దీన్ని ఆహారంగా తీసుకోవు. దీని ప్రభావం మనుషులు, జంతువులపై తీవ్రంగా ఉండి ఎలర్జీ, శ్వాసకోస వ్యాధులకు గురి అవుతున్నారు. వీటి నిర్మూలన అత్యావశ్యకం. ఈ మొక్క పంట చేనుల్లో విపరీతంగా పెరిగి కలుపు సమస్యగా మారి, పంటల పెరుగుదల జరగకుండా చేస్తూ రైతు ఆరోగ్యాన్ని కూడా దెబ్బతీస్తుంది. ఈ మొక్కల పెరుగుదల ఆపడానికి ఖాళీ ప్రదేశాలలో తులసి సంబంధిత రకాలను పెంచడం శ్రేయస్కరం. ఈ మొక్కలు కూడా ఎలాంటి చీడ, పీడల వల్ల హాని లేకుండా, ఎరువుల అవసరం లేకుండా పెరుగుతాయి. ఈ మొక్కల వల్ల నష్టం లేదు. వ్యాధుల బారిన పడిన మనుషులకు కొన్ని రకాల వ్యాధుల నిర్మూలనకు తులసిని దివ్య ఔషధంగా వాడవచ్చు. మార్నింగ్ వాక్ చేసే మిత్రులందరికీ మన చుట్టుపక్కల పరిసరాల్లో ఇలాంటి పిచ్చి మొక్కలు లేకుండా చూసి, మానవాళికి ఉపయోగపడే మొక్కలను పెంచి, మన ఆరోగ్యాన్ని మనమే కాపాడుకునే విధంగా చూడాలని, పర్యావరణ ప్రేమికులు, శాస్త్రవేత్తలు వీటి నిర్మూలన విషయంలో చొరవ చూపాలని కోరుతున్నాం.

## విద్యారంగం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగంలో మార్పులు తీసుకొని రావాలనే ఉద్దేశ్యంతో ముందుకు వెళు తున్నాయి. ఈ సందర్భంలో మన కౌన్సిల్ సమావేశ పక్షాన పలు విషయాలు చర్చించవలసిన సందర్భమని భావిస్తున్నాను. రాష్ట్ర విభజనకు పూర్వము, రాష్ట్ర విభజన తరువాత అమలు అవుతున్న విద్యాపరమైన కార్యక్రమాలను వాటి ఫలితాలను ఒకసారి పరిశీలిస్తే మొత్తం మీద ప్రభుత్వ విద్యారంగమే పెను ప్రమాదాన్ని ఎదుర్కొంటుందని చెప్పాలి. మనరాష్ట్రంలో అమలవుతున్న కార్యక్రమాలన్నీ 'ప్రైవేట్ విద్య'ను ప్రోత్సహించే విధంగా ఉంటున్నాయి. విద్యార్థులు వేగంగా ప్రైవేట్ వైపుకు వెళ్ళి ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ తగ్గి ప్రభుత్వ పాఠశాలల మూసివేతకు కారణమవుతున్నది. దీనికి నిదర్శనం జూన్ 2015లో జరిగిన రేషనలైజేషన్, ఈ రేషనలైజేషన్ జి.వోలో పలు మార్పులు తెచ్చినప్పటికీ విద్యార్థుల సంఖ్య తగ్గిన కారణంగా రాష్ట్రంలో 25 వేల ఉపాధ్యాయుల

ఖాళీలు ఉంటే 10 వేల ఖాళీలకు పరిమితమై, 15 వేల ఉపాధ్యాయ పోస్టులు తగ్గించబడ్డాయి. విద్యార్థుల సంఖ్య విషయానికి వస్తే మన తెలంగాణ రాష్ట్రంలో బడిఈడు పిల్లలు 5 సం॥ల వయస్సు నుండి 15 సం॥ వయస్సు కలవారు సుమారు 63 లక్షల మంది కలరు. 2014-15 DISE గణాంకాల ప్రకారం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చెరో 50%తో 30 లక్షల మంది చొప్పున విద్యను అభ్యసిస్తున్నారు. ఈ విద్యా సంవత్సరం DISE గణాంకాల ప్రకారం సెప్టెంబర్ నెల ఆధారంగా సిద్ధం చేయడం జరిగింది. అధికారికంగా గణాంకాలు విడుదల కానప్పటికీ ప్రభుత్వ పాఠశాలలో నమోదు తగ్గి 25 లక్షలకు పరిమితమై 40% ప్రభుత్వ, 60% ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులు చేరడం జరిగింది.

కేంద్ర ప్రభుత్వం జాతీయ నూతన విద్యావిధానము 2015 పేరిట పలు సమావేశాలు, గోష్టులు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నది. వచ్చే విద్యాసంవత్సరం నుండి దేశంలో 1986 సంవత్సరంలో రూపొందించిన విద్యా విధానాన్ని మార్పుచేయ తలపెట్టింది. దీని విషయంలో 13 అంశాలపై తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ సమాజంలోని విభిన్న వర్గాలనుండి అభిప్రాయ సేకరణ చేయడం జరిగింది. గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో విద్యావేత్తలు, విద్యాభిమానులు, రాజకీయ పక్షాలు, ఉపాధ్యాయ సంఘాలతో సెమినార్లు నిర్వహించి ప్రతిపాదనలను కేంద్రానికి పంపనున్నది. కేంద్ర మానవ వనరుల శాఖామంత్రి శ్రీమతి స్మృతి ఇరానీ గారు ఆగష్టు 19న అన్ని రాష్ట్రాల విద్యాశాఖ మంత్రులతో నిర్వహించిన సమావేశములో హర్యానా రాష్ట్ర మాజీ విద్యాశాఖ మంత్రి శ్రీమతి గీతా బక్కల్ గారి కమిటీ సిఫారసులను చర్చించడం జరిగింది. నూతన విద్యావిధాన ఆవశ్యకతను, ఇప్పుడు అమలు అవుతున్న నాన్ డిటెన్షన్ విధానంతో విద్యా ప్రమాణాల సాధన విషయంలో వెనుకబాటుతనాన్ని మరియు నాన్ డిటెన్షనా! డిటెన్షనా! అనే విషయంపై చర్చించడం జరిగింది. సమావేశంలో 18 రాష్ట్రాల నుండి విద్యాశాఖ మంత్రులు, రాష్ట్రాల విద్యాశాఖ కార్యదర్శులు పాల్గొనడం జరిగింది.

జాతీయ విద్యా విధానం రూపొందించుకొంటున్న సందర్భంలో మన సంఘ పక్షాన సెమినార్‌లో పాల్గొన్ని పలు సూచనలు చేశాము. ఈ విషయాలన్నింటిని మన సంఘ వాణి "పంచాయతీరాజ్ ఉపాధ్యాయ" ద్వారా మీ అందరి దృష్టికి తీసుకొని వచ్చినప్పటికీ, కొన్ని విషయాలు మీముందుంచుతున్నాము. విద్యా విధానంలో ఏ మార్పు అయినా విద్యాహక్కు చట్టం 2009కి అనుగుణంగా జరగాల్సి ఉంది. విద్యాహక్కు చట్టంలోని పలు అంశాలు ఒక్క ప్రభుత్వ పాఠశాలల్లోనే అమలు అవుతున్నాయి. కానీ ప్రైవేట్ రంగంలో వాటిని పట్టించుకోవడం లేదు. ఈ విద్యాహక్కు చట్టం ప్రకారం 6 సం॥ నుండి 14 సం॥ల పిల్లలకు ఉచిత నిర్బంధ విద్యను 8వ తరగతి వరకు అందించాలి. ప్రధానంగా కొన్ని అంశాలను పరిశీలిస్తే 1. విద్యార్థి బడిఈడు వయస్సు 5 సం॥లు, 2. ప్రతి ఆవాస గ్రామంలో 1 కి.మీ. పరిధిలో ప్రాథమిక పాఠశాల, 3 కి.మీ. పరిధిలో ప్రాథమికోన్నత పాఠశాల, 5 కి.మీ. పరిధిలో ఉన్నత పాఠశాల నెలకొల్పాలి. 3. 10 సం॥ల వరకు అంటే 5వ తరగతి వరకు మాతృభాషలోనే విద్యనందించడం, 4. వయస్సును బట్టి తరగతిలో నమోదు చేసుకోవడం, 5. ఒకే తరగతిలో నిలుపుదల చేయకుండా ఉండడం, 6. నూతన మూల్యాంకన (CCE) విధానము అమలులోకి తేవడం, 7. ఎలాంటి అడ్మిషన్ పరీక్షలు, పోటీ పరీక్షలు నిర్వహించరాదు, 8. ప్రైవేట్ పాఠశాలల్లో 25% సీట్ల రిజర్వేషన్ ప్రధానమైనవి.

**1వ అంశము:-** గత 5 సం॥లుగా విద్యాహక్కు చట్టం అమలు అవుతున్న సందర్భంలో ఫలితాలను పరిశీలిస్తే అడ్మిషన్ వయస్సు 5+ అయినప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థిని అంతకు ముందు చేర్చుకోవడానికి వీలు

లేదు. కానీ ఇప్పటితరం పిల్లల తల్లిదండ్రులు తీరు దీనికి భిన్నంగా ఉంది. బాలల హక్కులు చెప్పేది ఏమంటే 5 సం॥ల వరకు పిల్లవానిపై ఎలాంటి ఒత్తిడి పడకూడదని, మానసిక ఎదుగుదల జరగాలని భావన. కానీ 2,3 దశాబ్దాల క్రిందటి పిల్లల, ఈనాటి పిల్లల మానసిక స్థితిలో చాలా మార్పు రావడం జరిగింది. గర్భస్థ శిశువు దశ నుండి తల్లిదండ్రులు (దంపతులు) జాగ్రత్తలు, ప్రభుత్వం కూడా అంగన్‌వాడీల ద్వారా పోషకాలను అందించడం పిల్లవాని మానసిక స్థితి ఎదుగుదలకు కారణమైంది. ముఖ్యంగా పాతతరంలో పిల్లలు, పెద్దలు దొడ్డు ఉప్పు వాడేవారు. కానీ ఈనాడు అందరు శుద్ధి చేసిన అయోడైజ్డ్ ఉప్పును వాడుతున్నారు. అయోడైజ్డ్ ఉప్పు వాడకం వలన మెదడు పరిణతి చెంది పిల్లవాని ఐ.క్యూ.లో మార్పు వలన తల్లిదండ్రులు 3+ సంవత్సరాలకు పిల్లలను పాఠశాలలో చేర్చుతున్నారు. వీటినన్నింటిని మరిచి మన పాతతరం ఆలోచనలతో 5+ సంవత్సరాలకు అడ్మిషన్ అంటే కుదురుతుందా! దీనికి విరుద్ధంగా పిల్లల తల్లిదండ్రుల ఇష్ట ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో 3+ సం॥లకే ఎల్.కే.జీ, యు.కె.జీ అడ్మిషన్లు జరుగుతుంటే దీన్ని అడ్డుకొనగలమా? ఇలానే జరిగితే ఇప్పటికే ప్రాథమిక తరగతుల్లో నమోదు బాగా తగ్గింది. ఇంకా తగ్గి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల అవసరమే లేకుండా కానున్నది.

**2వ అంశము:-** పలు దేశాల్లో అమలులో ఉన్నట్లు మనదేశంలో కూడా 1 నుండి 5వ తరగతికి వరకు ప్రతి ఆవాసములో పిల్లవాడు నడచి వెళ్ళే విధంగా 1 కి.మీ. లోపు ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేయాలి. పిల్లల్లో కొంత ఎదుగుదల వస్తుంది కాబట్టి ప్రాథమికోన్నత పాఠశాలను 3 కి.మీ. పరిధిలో పిల్లలకు అందుబాటులో తేవాలి. ఇక ఉన్నత విద్య ఇచ్చుట 8,9,10 తరగతులు వరకు చదివే పిల్లలకు 5 కి.మీ. పరిధిలో తప్పనిసరిగా పాఠశాల నెలకొల్పాలి. 8వ తరగతి వరకు (SSA) 9,10 తరగతులకు తోడుగా 11,12 తరగతులను కూడా రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్ (RMSA) నిర్వహణ బాధ్యత చూసుకొంటున్నాయి.

**3వ అంశము:-** మాతృభాషలో విద్య అందించడం. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన గణాంకాలను పరిశీలిస్తే ఉత్తర భారతదేశంలో వారి మాతృభాష హిందీలో 70% చదువుతున్నట్లు, దక్షిణ భారతదేశంలో, మన తెలంగాణ రాష్ట్రంలో మాతృభాషలో 40% చదువుతున్నట్లు నివేదికలు వెలువడ్డాయి. ఇవాళ మాతృభాష కంటే ఆంగ్లభాష మీద పిల్లల తల్లిదండ్రులకు క్రేజ్ ఎక్కువ అయ్యింది. బీద వర్గాల పిల్లలు ఆంగ్ల మాధ్యమంలోనే చేరుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమానికి అవకాశము లేదు. ఈ పరిస్థితుల్లో పిల్లలు ప్రైవేట్ పాఠశాలల్లో చేరడానికి అవకాశము ఏర్పడుతున్నది.

**4వ అంశము:-** వయస్సును బట్టి తరగతి కొందరు పిల్లలు ప్రాథమిక స్థాయిలో పాఠశాల, చదువు అంటే ఇష్టము లేకుండా పాఠశాలకు వెళ్ళకపోవడం జరుగుతుంది. బడి ఈడు పిల్లలు (6-14) బడి బయట ఉంటే ఆ పిల్లవాని వయస్సు 8 సంవత్సరాలు ఉంటే అతన్ని 3వ తరగతిలో నమోదు చేసుకోవాలి. అతడు అందరి పిల్లల్లో వెనుకబడి ఉంటే ప్రత్యేక క్లాసులు తీసుకొని అతని స్థాయిని పెంచాలి.

**5వ అంశము:-** ఒక 7పిల్లవాడు ఒకే తరగతిలో రెండు సంవత్సరాలు చదువుతూ ఉంటే నాన్ డిటెన్షన్ విధానము అమలు అవుతున్నందున అతడు పై తరగతికి వెళ్ళాల్సిందే.

**6వ అంశము:-** నూతన మూల్యాంకన విధానము నిరంతర సమగ్ర మూల్యాంకనం (CCE) ఈ పద్ధతిలో పిల్లవానిలో 7 రకాల సామర్థ్యాలను పరిశీలించి అతనికి గ్రేడింగ్ ఇవ్వాలి.

**7వ అంశము:-** విద్యార్థి తరగతిలో చేర్చుకునే సందర్భంలో అడ్మిషన్ పరీక్షలు నిర్వహించరాదు. ఒకవేళ సీట్లసంఖ్యలో పోటీ ఏర్పడితే లాటరీ పద్ధతిలో అడ్మిషన్ ఇవ్వాలి.

**8వ అంశము:-** ప్రైవేట్ పాఠశాలల్లో బీద వర్గాల పిల్లలకు అడ్మిషన్లు కల్పించాలనే ఉద్దేశ్యంతో 25% సీట్లను వారికి కేటాయించాలి. ఆ పిల్లల ఫీజుల బాధ్యత ప్రభుత్వానిదే. ఆ ప్రైవేట్ పాఠశాలకు ప్రభుత్వం ఫీజు రీయంబర్స్‌మెంట్ చేస్తుంది.

పై అంశాల్లో పలు విషయాలను ప్రైవేట్ పాఠశాలలు పట్టించుకోవడం లేదు. ఇవన్నీ ప్రభుత్వ పాఠశాలల్లో అమలు కావడం వల్ల విద్యార్థుల నమోదు తగ్గి పాఠశాలలు మూత పడుతున్నాయి. పాఠశాలలు మూత పడడానికి ప్రభుత్వం ఉపాధ్యాయుడే కారణమంటుంది. సమాజం పట్టించుకోకుంటే నష్టపోయేది బీద వర్గాల వారే అనే విషయాన్ని మరువరాదు. కేంద్రం తీసుకొని వచ్చే NEP-2015లో అడ్మిషన్ వయస్సును 3+ సం॥లకు తగ్గించడం, మాతృభాషలో విద్యాబోధన విషయంలో ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల్లో ఒకేవిధానాన్ని అమలు చేయడం, నిబంధనలకు విరుద్ధంగా ఆవాసాల్లో ప్రైవేట్ పాఠశాలలకు అనుమతులు ఇవ్వకపోవడం, ప్రైవేట్ పాఠశాలలను మూసివేయడం, వయస్సును బట్టి అడ్మిషన్‌లు కాకుండా విద్యార్థి స్థాయిని బట్టి తరగతి నిర్ణయించడం, 10వ తరగతి వరకు ఎలాంటి పరీక్షలు లేకుండా కొనసాగడము కాకుండా, 5వ, 7వ తరగతి (2 లెవెల్స్)లో డిటెన్షన్ విధానం ప్రవేశ పెట్టడం, నూతన మూల్యాంకన విధానంలో విద్యార్థి పాత్ర తగ్గి నిర్లక్ష్యం చేయడం జరుగుతున్నందున CCE విధానంలో మార్పు తేవడం జరగాలి.

విజ్ఞాన వేటలో పడి సంస్కృతిని, సాంప్రదాయాలకు నిలయమైన భారతదేశ వారసత్వ సంపదైన చరిత్ర (సోషల్) బోధించడం లేదు. సమాజంలో విలువలు పతనమై వ్యవస్థ అస్తవ్యస్థమవుతున్నప్పుడు పెద్దలు మాట్లాడుతూ ఉంటారు సమాజంలో విలువలు సన్నగిల్లుతున్నాయి. పాఠశాల స్థాయిలో విద్యార్థులకు విలువలతో కూడిన విద్యాబోధన జరగడం లేదు అని, అవసరమైనప్పుడు విలువల గురించి మాట్లాడడం కాదు అది ఒక దీర్ఘకాలిక ప్రణాళికగా ఉంటూ చరిత్ర యొక్క అవసరాన్ని గ్రహించి సిలబస్‌లో ప్రాధాన్యత కల్పించాలి. యువత క్రీడల అవసరాన్ని కూడా మర్చిపోయి పుట్‌బాల్ ఆట అంటే టి.విలో చూసేది, సెల్‌ఫోన్‌లో ఆడేదిగా మారింది, ఇది ఆట స్థలానికి వెళ్ళి ఆడే ఆట అంటే పిల్లలు ఆశ్చర్యపోతున్నారు. భారత జాతీయ క్రీడ గ్రామీణ క్రీడైన కబడ్డీకి ఇప్పుడు ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రత్యక్ష ప్రసారం చేసి ప్రోత్సహించడం సగటు భారతీయుని హృదయాలను పులకింపజేసిందని తెలియజేస్తూ, పాశ్చాత్య క్రీడ క్రికెట్‌ను ఆదరించినట్లే మన కబడ్డీ, హాకీ, కోకో మొదలగు క్రీడలను విద్యావిధానములోకి తీసుకొనిరావాలి. ఆసియా గేమ్స్ అప్పుడో, ఒలింపిక్స్ జరుగుతున్నప్పుడో మన పతకాల పట్టిక స్థానాల్లో చివర్లో వెతుక్కునే కంటే, నైపుణ్యం గల పిల్లలను ప్రాథమిక (5వ తరగతిలోని) స్థాయిలోనే గుర్తించి ప్రత్యేకంగా విద్యతో పాటు క్రీడల్లో శిక్షణ ఇచ్చే విధానాన్ని NEP – 2015లో వీలుకల్పించాలి. దేశమంతా ఒకేవిధమైన విద్యావిధానము అమలు అగునట్లు కేంద్ర విద్యాకమీషన్ ఏర్పాటు చేయాలి. సెంట్రల్ సిలబస్, స్టేట్ సిలబస్ అని అనకుండా దేశమంతటా ఒకే విధమైన సిలబస్ అమలు కావాలి.

1832 సంవత్సరంలో శ్రీ చదలవాడ సీతారామశాస్త్రి అనే మేధావి రచించిన పెద్దబాలశిక్ష గ్రంథం మనకు ఆదర్శగ్రంథం. నూతన విద్యావిధానాన్ని రూపొందిస్తున్న మేధావులందరూ 'పెద్దబాలశిక్ష'ను సిలబస్‌లో ప్రతిబింబించే విధంగా చూడాలని కోరుతున్నాం.

పరీక్షల ఫలితాల ఆధారంగానే పై తరగతులకు పంపడం జరుగుతున్న విషయాన్ని గమనించండి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో నాన్ డిటెన్షన్ విధానమే అమలు కావాలని, మనం పట్టుబడితే

ప్రమాణాలతో కూడిన విద్య కావాలనే పిల్లల తల్లిదండ్రులు ఎటువెళతారో ఆలోచించండి. మనం ఉపాధ్యాయులుగా ఎంపికైన విధానాన్ని ఒకసారి గుర్తుచేసుకుంటే ఇంటర్/డిగ్రీ చదువుతో ఉపాధ్యాయ విద్య ప్రవేశ పరీక్షలో నెగ్గి, 2 సం॥ల TTC/B.Ed శిక్షణలో ఉత్తీర్ణత పొంది, టెట్ అర్హత పొంది, DSC పరీక్షల్లో కాంపిటీషన్‌కు నిలిచి ఈ ఉద్యోగాన్ని సంపాదించుకున్నాము. ఉద్యోగం రాకనో, ఎలాంటి శిక్షణ లేకుండా 10వ, 12వ తరగతి చదివినవారు ప్రైవేట్ పాఠశాలల్లో విద్యాబోధన చేసి డిటెన్షన్ విధానాన్ని అమలు చేస్తుంటే, అర్హత కలిగిన ఉపాధ్యాయులము మన దగ్గరకు వచ్చే పిల్లవాన్ని తీర్చిదిద్ది డిటెన్షన్ విధానంలో ఉత్తీర్ణత సాధించే లాగ తీర్చిదిద్ది పై తరగతికి పంపలేమా! ఈ ఛాలెంజ్‌ను స్వీకరించడానికి వెనుకాడి చేతులెత్తేద్దామా ఆలోచించండి.

ఈనాటి పరిస్థితుల్లో “కలాం”గారి దూరదృష్టిని ఒకసారి గుర్తుచేసుకొని, వారి ఆశయాన్ని సాధించాలంటే ఈ దేశానికి ఎలాంటి విద్యావిధానాలు కావాలి, అలాంటి విద్యావిధానాన్ని ఎందుకు రూపొందించు కోలేకపోతున్నాం? మన దేశ జనాభా 2011 జనాభా లెక్కల ప్రకారం 121 కోట్లు. ఈ నాలుగేండ్లలో మరింత పెరిగి 128 కోట్లు సమీపించింది. మన దేశ పౌరుని సరాసరి వయస్సు 65 సం॥లుగా నిర్ణయించడం జరిగింది. ఈ లెక్కన ఒక్కొక్క సంవత్సరం తేడాతో 2 కోట్లు మంది ఉంటారు. అంటే 35 సం॥ల లోపు వయస్సు గల యువత 70 కోట్ల పైనే ఉంది. ఈ యువతకు అందించే విద్య వారికి ఉపాధి కల్పిస్తున్నదా? అని ఆలోచించాలి. రోజంతా చెమట చుక్క కారకుండా శ్రమలేని జీవితాలను గడిపి, ఉదయాన్నే మార్నింగ్ వాక్‌లు చేస్తున్న మేధావులు విద్యావిధానాన్ని రూపొందిస్తున్నారు. రోజంతా శ్రమ చేసే వ్యవసాయ ఆధారిత కుటుంబాలు ఈ దేశంలో 80% కి పైగా కలవు. వ్యవసాయం చేసే రైతు తన కొడుకు/కూతురును బడికి పంపి, తాను పొలం పనికి వెళ్ళి రోజంతా కష్టపడి కాళ్ళు పీకుతూవుంటే ఒడ్డుపై కూర్చొని నా కొడుకు బడి నుంచి వచ్చి గేదె (బర్రె)కు సేకరించిన గడ్డిమోపో, పొద్దంతా తల్లి ఏరిన పత్తి బస్తానో తన సైకిల్‌పై తీసుకొని వెళ్ళడానికి ఎదురుచూస్తూ పొలం గట్టుపై కూర్చొనే ఆ బీద రైతు కొడుకుకు ఉపయోగపడే విద్యావిధానము రూపొందించలేకపోవడం ఈ దేశంలో మేధావి వర్గం చేస్తున్న ద్రోహం అని తెలియజేస్తున్నాం. 10వ తరగతి తరువాత పిల్లల స్థాయిని నిర్ణయించడానికి అర్హతా పరీక్షలు నిర్వహించి నీ పిల్లవాడు IIT అర్హుడే అనే ముద్ర ఒక విద్యావేత్త వేస్తే 1/2కోటికి చైనా (చైతన్య, నారాయణ) విద్యాసంస్థలు ఖరీదు చేసి విద్యావ్యాపారం చేసుకోవడానికి ఉపయోగపడుతుంది మన విద్యావిధానం. ఇవాళ మనం రూపొందించుకున్న సిలబస్ దేశవ్యాప్తంగా ఉన్న 20 వేల ప్రతిష్టాత్మక IIT/BITSల్లోనో, లేదా 20వేల మెడిసిన్ సీట్లు పొందే పిల్లలను దృష్టిలో పెట్టుకొని రూపొందించబడుతున్నది. ఏటా 2 కోట్ల మంది పిల్లలు విద్యను పూర్తి చేస్తుంటే 40 వేల మందికి మాత్రమే ఈ విద్య ఉపయోగపడితే మిగతా 1 కోటీ 99 లక్షల 60 వేల మందికి ఉపయోగపడే విద్య గురించి ఎందుకు ఆలోచించకూడదు! కేంద్ర ప్రభుత్వం అంటున్నట్లు, చైనా అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని వృత్తివిద్యను ప్రోత్సహించేదిగా మన విద్యావిధానం ఉండాలి కానీ మేధోవలస (బ్రెయిన్ డ్రైన్)కు ఉపయోగపడే భారతదేశ యువశక్తిని నిర్వీర్యం చేసే విద్యనే అందిద్దామా!

ఒకసారి ‘బ్రెయిన్ డ్రెయిన్’ గురించి మాట్లాడుకుంటే ఇటీవల పలు సర్వేలు అందించిన విషయాలను పరిశీలిస్తే అమెరికాలో ఉన్న శాస్త్రవేత్తలు, మేధావుల్లో భారతీయులే అత్యధికులు అన్న వాస్తవాలను తలుచుకుంటేనే పైన చర్చలో తెలిపినట్లు ఈ దేశంలో మీకొరకు తయారు చేసిన విద్యా విధానాలను, మీతో పాటు మేము చదువుకొని మేమందరం పనికిరానివారమౌతూ మిమ్మల్ని మేధావులుగా మార్చితే మీరెళ్ళి వేరే దేశాలకు సేవ

చేయడం సరైందేనా? మీరు ఈ దేశంలో ఉండి అక్కడి అద్భుతాలు ఇక్కడ సృష్టించలేరా? ఎన్నో ప్రధాన వ్యాపార సంస్థలకు దిగ్గజాలుగా పనిచేస్తున్నవారు మనవారే అంటే గర్వపడదాం గానీ, 2020లో సూపర్ పవర్ కావాలనే 'కలాం' గారి దూరదృష్టి నిజం కావాలంటే మేథో వలసలు కాదు మేధస్సులను కలుపుదాం అన్న మన ప్రధాని మోదీ గారి మాటలను నిజం చేయడానికి కృషి చేస్తే సామాన్యుడు సంతోషంగా ఉంటాడు.

ఈ రోజుల్లో విద్యా విధానం గణితం, సైన్స్, ఆంగ్లం మోజులో పడింది. 10వ తరగతి వరకు బోధించే ఈ సబ్జెక్టులు పిల్లలకు వారి భవిష్యత్తును తీర్చిదిద్దడానికి తోడ్పతున్నవా! ఆ సబ్జెక్టులపై భయం పెరిగి విద్యకు దూరం చేయడము లేదా అని పరిశీలించుకోవాలి. 1984 సం॥ పూర్వంలాగా 8వ తరగతి వరకు సాధారణ గణితం, ఆ తరువాత పిల్లల ఇష్టాన్ని బట్టి కాంపోజిట్ గణితం వైపు వెళ్ళేటట్లు గణితం, సైన్స్ సిలబస్‌ను రూపొందించాలి. ఇక ఆంగ్ల మాధ్యమం గురించి మాట్లాడుకోవడం తప్పనిసరి ఎందుకంటే ఇంత బ్రతుకు బ్రతికి నా పిల్లవాన్ని (మాతృభాష) తెలుగు మీడియంలో చదివిస్తానా అనే క్రేజ్‌లో లోకంపోకడ ఉంది. ప్రపంచమంతా వసుధైక కుటుంబం అంటూ, ప్రపంచ భాష తప్పనిసరి అనే విషయాలను జాగ్రత్తగా పరిశీలించాలి. ఈ సంవత్సరం 5 సెప్టెంబర్‌న ఒక టి.వి. ఛానల్ వారు ప్రవాస భారతీయుల కొరకు లైవ్‌షో నిర్వహిస్తే ఒక యు.ఎస్. స్కాలర్ స్పందన మీ ముందుంచుతున్నాం. అతడి ప్రశ్న ఏమిటంటే ప్రపంచంలో ఏ దేశానికి వెళ్ళాలన్నా ఇంగ్లీషు తప్పని సరి, మనం మాతృభాషను పట్టుకుని వేళ్లాడ్డం ఎందుకు, అన్ని పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టాలి అన్న ప్రశ్నకు సమాధానము. ఈ దేశ జనాభా గురించి పైన చర్చించుకున్నాము. యు.ఎస్.లో ఉన్న భారతీయుల సంఖ్య 15 లక్షలు. 128 కోట్ల జనాభాలో 15 లక్షలమంది పోగా ఈ దేశంలో ఉండేవారి సంఖ్య 127 కోట్ల 85 లక్షల మందికి ఇంగ్లీషు నేర్పించాల్సిన అవసరముందా? మాతృభాషలో చదువుకొని వారివారి తెలివితేటలను బట్టి, ఆంగ్లాన్ని నేర్చుకొని విదేశాలకు వెళ్ళలేరా! విదేశాలకు వెళ్ళడానికి ఆంగ్ల మాధ్యమం అంటే కోట్లాదిమంది పోవడానికి ఇతర దేశాలు అంగీకరిస్తాయా! అని కోరుతూ ఏ భ్రమలో పోతున్నామో ఆలోచించాలి.

## రాష్ట్ర విద్యారంగం - కె.జి. నుండి పి.జి. విద్య

గౌరవ మన ముఖ్యమంత్రివర్యులు కె.సి.ఆర్. గారు ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన కె.జి. నుండి పి.జి. విద్య అందరినీ బాగా ఆకర్షించింది. కానీ దీని అమలు విషయంలో మాత్రం అధికారంలోకి వచ్చిన జూన్ 02, 2014 నుండి చర్చ చేస్తూనే, ఈ విద్యా సంవత్సరం, కాదు వచ్చే విద్యా సంవత్సరం అని, ఈసారికి సాధ్యపడదు 2016-17లో ప్రారంభిస్తామని, ప్రస్తుతం అయితే ప్రభుత్వ రంగంలో కె.జి. లేదు ఉన్న పాఠశాల విద్యను పి.జి. విద్యను ఈ ప్రభుత్వం పనికిరాదని, పాఠశాల విద్యలో ఉపాధ్యాయుల నియామకం చేయకుండా, యూనివర్సిటీలకు వైస్ ఛాన్సలర్లను నియమించకుండా, కె.జి. నుండి పి.జి. విద్యా విధానం వచ్చేవరకు పట్టించుకోం అని నిర్లక్ష్యం చేయడం వల్ల ఈ రెండు సంవత్సరాల్లో మానవ వనరులకు తీరని నష్టం జరుగుతున్న విషయాన్ని అందరూ అంగీకరించాలి. కె.సి.ఆర్.గారు, విద్యామంత్రి, అధికారులతో మాట్లాడి కె.జి. నుండి పి.జి.ని మూడు దశల్లో 4వ తరగతి వరకు ఒకదశ, 5 నుండి 12వ తరగతి వరకు 2వ దశ, ఆపైన 3వ దశగా ఏర్పాటు చేస్తామని, 4వ తరగతి వరకు మాతృభాష అయితేనే మంచిదని, 5 నుండి 12 వరకు నియోజక వర్గానికి 10 చొప్పున 1190 గురుకులాలను పాతవి 668 కలుపుకొని 1190 ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ గురుకులాల ఏర్పాటు

విషయంలో ఇప్పుడు ఉన్న సంక్షేమ శాఖ ఆధీనములో నడుస్తున్న బీసి, ఎస్సీ, ఎస్టీ ఆశ్రమ పాఠశాలలు, వెలుగు పాఠశాలలు, సర్వశిక్షా అభియాన్ (SSA) నడుపుతున్న కస్తూరి బా బాలికల విద్యాలయాలు (KGBV), రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్ (RMSA) నడుపుతున్న ఆదర్శ పాఠశాలలను కలిపి 668 పాఠశాలలకు తోడుగా మరో 552 పాఠశాలలను నూతనంగా ప్రారంభించి మొత్తం 1190 గురుకుల ఆశ్రమ పాఠశాలలను ఏర్పాటు చేయనున్నారు. ఈ సంఖ్య నిర్ధారణ మన రాష్ట్ర శాసనసభా స్థానాల సంఖ్య 119 ఆధారంగా ఒక నియోజకవర్గానికి 10 చొప్పున అంటూ నిర్ణయించడం జరిగింది. ప్రతి నియోజక వర్గానికి ఒక బాలికల పాఠశాల అనేమాట కూడా వచ్చినది. ఇది అదనమా! లేక 1190 నుండి 119 ఏర్పడతాయా చూడాలి. ఈ గురుకులాలను ఉన్నవాటిని, కొత్తవాటిని ఒకే గొడుగు క్రిందకు తీసుకువచ్చి ఒకే కమీషనరేటును ఏర్పాటు చేసి దాని ఆధీనములో నడుప తలపెట్టినారు. విధి విధానాలను రూపొందిస్తున్నారు.

ఈ గురుకులాలలో 5వ తరగతి నుండి ఇంటర్ వరకు ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన జరుగుతుంది. ఒక్కొక్క తరగతికి రెండు సెక్షన్ల చొప్పున ఒక సెక్షన్‌లో 40 మంది విద్యార్థులకు అవకాశము కల్పిస్తూ, ఒక గురుకులంలో తరగతికి 80మంది, 8 తరగతుల్లో 640 మంది విద్యార్థులను చేర్చుకుంటారు. ఈ లెక్కన మొత్తం 7,61,600 మంది విద్యార్థులు విద్యాభ్యాసము చేస్తారు. 12వ తరగతి తరువాత విద్యార్థులు వారి ఇష్టానుసారం డిగ్రీ, పి.జి. చదువుకోవడం జరుగుతుంది. ఈవిధంగా పి.జి. విద్య అందించాలనే సంకల్పం బాగానే ఉంది. కానీ ఇక్కడ కె.జి. విద్య గురించి మాట్లాడుకోవలసిన సందర్భం. ఈ రోజుల్లో పిల్లల తల్లిదండ్రులు 3 సంవత్సరాల వయస్సుకే పాఠశాలలో చేర్పించి 5 సంవత్సరాల వయస్సు వరకు కె.జి. విద్యను పూర్తి చేయిస్తున్నారు. దీనిని బట్టి గురుకులాలల్లో 5వ తరగతిలో చేరేముందు 6 సం॥లు (3–9) ప్రాథమిక విద్య అభ్యసన సంగతి ఏమిటి? అన్న ప్రశ్న ఉత్పన్నమవుతుంది. అంటే గురుకుల పాఠశాలకు 5వ తరగతి ప్రవేశాలు ఇప్పుడు ప్రభుత్వ మరియు ప్రైవేట్ పాఠశాలల్లో విద్య నభ్యసిస్తున్న విద్యార్థుల నుండి ఎంపిక చేసుకొంటారని భావిద్దాం. ఎంపిక అనే పదం యొక్క అర్థాన్ని ఇక్కడ వివరించాల్సి ఉంది. విద్యాహక్కు చట్టం ప్రకారము 8వ తరగతి వరకు విద్యార్థుల ప్రవేశాలకు అర్హత పరీక్షలు నిషేదము. ఒకవేళ పోటీ ఉంటే లాటరీ పద్ధతిన అడ్మిషన్లు ఇవ్వాలి. పోటీ ఉంటుందా అనే విషయానికి వస్తే మన రాష్ట్రంలో 3 నుండి 9 సం॥ల వయస్సు గల పిల్లలు ఎందరు అనే లెక్కలు వేయాలి. ఇప్పుడు ఉన్న గణాంకాల ప్రకారం ప్రతి 1 సంవత్సరంలో పిల్లల జననం సుమారుగా 5.5 నుండి 6 లక్షల వరకు ఉంటుంది. ఈ లెక్కన 3 నుండి 9 సం॥ల వయస్సు గల పిల్లల సంఖ్య 36 లక్షలు అవుతుంది. 4వ తరగతి పూర్తిచేసిన పిల్లలు 6 లక్షల మందిలో 1190 గురుకులాల్లోకి 95,200 (1190×2సెక్షన్లు ×40) మంది పిల్లలకు అడ్మిషన్లు ఇవ్వాలి. ఈ లెక్కన గురుకులాల్లో ప్రతి సీటుకు పోటీ 1:6 ఉంటుందన్నమాట. ఇప్పటికే ఉన్న గురుకులాల్లో అడ్మిషన్లు గత విద్యా సంవత్సరం సంక్షేమ పాఠశాలల్లో టెస్టుల ద్వారా జరగడం, ఈ విద్యా సంవత్సరంలో G.O.10 తేది.9-6-2015 ద్వారా మోడల్ స్కూళ్ళలో టెస్టుల ద్వారా అడ్మిషన్లు ఇవ్వడం జరిగింది. ప్రైవేట్ పాఠశాలలు అడ్మిషన్లు టెస్ట్‌ల ద్వారానే కాకుండా, విద్యార్థి తల్లిదండ్రులు గ్రాడ్యుయేట్స్ కావాలనే నిబంధన పాటిస్తున్నారు. ఇంకా SCERT వారు ముద్రించిన పాఠ్య పుస్తకాలను బోధించలేము? ఎందుకనగా మా ప్రైవేట్ పాఠశాలలో 1వ తరగతి విద్యార్థి, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థి కంటే ముందే 2 సం॥ల కె.జి. విద్యను పూర్తి చేస్తున్నారు కాబట్టి మా పిల్లల స్థాయి ఎక్కువ అని కోర్టును ఆశ్రయించిన ప్రైవేట్ యాజమాన్యాలు సమాజాన్ని ఎలా చీలుస్తున్నాయో గమనించాలి. గురుకులాల్లో తల్లిదండ్రుల విద్యార్హతలు

అడగకపోవచ్చు కానీ అందరు పిల్లల నుండి తెలివైన వారిని ఎంపిక చేస్తేనే విద్యా ప్రమాణాలు వస్తాయని అంగీకరించినట్లు ఒప్పుకోవాలి.

7 లక్షలమంది 5 నుండి 12 తరగతి వరకు గురుకులాల్లో చదువుకుంటే మిగతా 63 లక్షలమంది పిల్లల్లో 56 లక్షల మంది సంగతి ఏమిటి అని ప్రశ్నిస్తున్నాం? ఈ 63 లక్షల్లో ప్రభుత్వ, ప్రైవేట్‌లో సగం చొప్పున విద్యార్థులు ఉన్న విషయాన్ని గుర్తు చేస్తూ, ఇప్పుడున్న ప్రభుత్వ పాఠశాలలను మూసివేసి ప్రైవేటుకు పంపించే అవకాశాలు ఏర్పడనున్న విషయాన్ని ప్రభుత్వ పోకడలు తెలుపుతున్నవి. ఈ ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నట్లు, అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం సామాన్యులని, అధికారి, మంత్రుల పిల్లవాడు ప్రభుత్వ పాఠశాలకే వెళ్ళాలి అంటే మీరు ఏర్పాటు చేసే గురుకులాల సంఖ్య 1190లో 7 లక్షల మంది అంటే 63 లక్షలకు 9 రెట్లు పాఠశాలలు 10,710 పాఠశాలలు కావాలి. కానీ 1190తో సరిపెట్టుకొంటాము అనడం సరైంది కాదని ఈ PRTU కౌన్సిల్ పక్షాన వ్యతిరేకిస్తున్నాం. మీ వైఖరి మారకపోతే పిల్లలు ప్రైవేట్‌కు వెళ్ళడమా! విద్యకు దూరం కావడమో జరుగుతుంది. ఇప్పటికే ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నామన్న సంతోషంలో తెలంగాణ ఉద్యమంలో పోరాటంలో మీరు ముందు ఉన్నందున ఈ తెలంగాణ ప్రజలు మీకు పట్టం కట్టారు కానీ విద్యావకాశాలు కొందరికే కల్పిస్తామన్న నిర్ణయం ఉపసంహరించు కొని ఇప్పుడు ఉన్న ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి తప్ప, విద్య మీద పెట్టుబడి పెట్టడం నిరర్థకం అని భావిస్తే 29వ రాష్ట్రంలో అక్షరాస్యతలో 26వ స్థానంలో ఉన్న మన బంగారు తెలంగాణ స్వప్నం విద్యలో మొదటి స్థానానికి పోటీ పడాలి కానీచివరి స్థానం కొరకు కాదు.

ఆంగ్ల మాధ్యమంపై మోజు ఎక్కువ కనబడుతున్న సందర్భంలో కె.జి. నుండి 4వ తరగతి వరకు మాతృభాషలోనే విద్య అంటే ఎల్.కె.జి. యు.కె.జి లేని 1 నుండి 5వ తరగతిలో పాఠశాలల్లో విద్యార్థులు ఇప్పటికే చేరడం లేదు. నిజంగా విద్యాహక్కు చట్టంను ప్రభుత్వం అమలు చేయాలి కానీ, ప్రభుత్వ పాఠశాలల్లోనే అమలు చేస్తాం. ప్రైవేట్‌లో చేయం వారు ఈ దేశ, రాష్ట్ర ప్రజలేనన్న విషయాన్ని మర్చిపోకుండా అన్ని పాఠశాలల్లో ఒకే విధానం తెలుగు లేదా ఇంగ్లీషు మీడియం ఉండాలని, ఇలా అమలు చేయడానికి ఇబ్బందిగా ఉన్న చట్టాలను మార్పు చేసుకోవాలని కోరుతున్నాం.

## ఉపాధ్యాయుల్లారా వర్తమాన, భూత, భవిష్యత్తులను గమనిస్తున్నారా!!!

అర్హులైన, నైపుణ్యం (క్వాలిటీ) గలవారిని DSC ల ద్వారా ఎంపిక చేస్తున్న ప్రభుత్వాలు క్వాలిటీ విద్యను ఎందుకు అందించలేదు అని మేధావులు వేదికపై ఉపన్యాసాలు ఇస్తుంటే విద్యాప్రమాణాలు దెబ్బతినడానికి ఉపాధ్యాయుడే కారణమంటూ, విద్యార్థులు తగ్గి, ప్రభుత్వ పాఠశాలలు మూత పడితే DSCలు ఉండవు, యువతకు అన్యాయం చేస్తున్నవారు మీరు కాదని చిలుక పలుకులు పలికేవారి మాటలను చెవికెక్కించుకొండి అని కోరుతున్నాం. వాట్సప్, ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో మెసేజ్‌లకే పరిమితమౌతున్నారన్న విమర్శలకు దూరంగా ఉండాలని విజ్ఞప్తి. మనలో ఏమైనా లోపాలుంటే వాటిని సరి చేసుకోవాలని కోరుతున్నాం. కొన్ని ఆవాసాల్లో ఉన్న పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలలకే వెళ్ళేలా కృషి చేస్తూ, అంకితభావంతో పనిచేస్తున్న ఉపాధ్యాయులు గల పాఠశాలల వలెనే మనం మన పాఠశాలలను మార్చలేమా? ప్రైవేట్ పాఠశాలల్లో నో అడ్మిషన్ అనే బోర్డు చూస్తున్నాం. మచ్చుకు వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలో ప్రాథమిక పాఠశాలలో నో అడ్మిషన్ బోర్డు పెట్టి, ఎమ్మెల్యే, విద్యాధికారి

రికమెండ్ చేసినా సీటు ఇవ్వని పరిస్థితి ఉంది. దీనికి కారణం అక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమిష్టి కృషి అన్న విషయాన్ని గమనించాలి.

ఉపాధ్యాయులు పాఠశాలలకు వెళ్ళుతున్నాం పిల్లలు రావడం లేదు మేము ఏమి చేయాలి అనేదానికన్నా ఆ గ్రామంలోని ప్రజలతో, తల్లిదండ్రులతో సమావేశాలు ఏర్పాటు చేసి గ్రామాల నుండి 20 కి.మీ. పై దూరాల నుండి విద్యార్థులను ఉదయాన్నే 7 గం॥లకే పసుపు పచ్చ బస్సుల్లో, ఆటోల్లో పట్టణ కేంద్రాల్లోని పాఠశాలలకు తరలించి, మళ్ళీ సాయంత్రం 7 గం॥లకు ఇంటివద్ద వదిలితే సంతోషిస్తున్న తల్లిదండ్రులకు అసలు విషయాన్ని తెలియజేయాలి. ప్రైవేట్ పాఠశాలలకున్న ఒకటి, రెండు బస్సులు ఇవి కూడా RTA వారి నిబంధనల ప్రకారం కండిషన్‌లో లేని వాటిల్లో మొదటి దఫా ఉదయాన్నే పల్లెల నుండి పిల్లలను వారి పాఠశాలకు తీసుకొని వచ్చి అక్కడ ఒక ఆయాకు అప్పగించి, రెండవ ట్రిప్పులో ఆ పట్టణ కేంద్రంలోని పిల్లలను ఉదయం 9 గం॥లకు తీసుకొని వచ్చి అసెంబ్లీ జరిగి పాఠశాల ప్రారంభమౌతుంది. సాయంత్రం పాఠశాల వదిలిన తరువాత కూడా మొదట లోకల్ పిల్లలను ఇండ్లలో సాయంత్రం 5 గం॥లకు వదిలిన తరువాత, పల్లెల నుండి వచ్చిన పిల్లలను రాత్రి 7 గం॥లకు ఇళ్ళకు చేర్చుతున్నారు. గ్రామాల్లోని పిల్లల తల్లిదండ్రులు ఏమనుకుంటున్నారంటే మా ఊళ్ళో సార్లు ఉదయం 9 గం॥లకు వస్తారు. మా పిల్లలు ఉదయమే వెళ్ళతారు మేము ప్రైవేట్ పాఠశాలలకే పంపుతామని అంటున్న సందర్భాలు చాలా చోట్ల ఎదురవుతున్నాయి. కానీ ప్రైవేట్ పాఠశాలలకు వెళ్ళే గ్రామాల పిల్లలు పొద్దున 2 గంటలు, సాయంత్రం 2 గంటలు మొత్తం 4 గంటలు ప్రయాణానికి కొంత సమయం పోగా, మిగతా సమయం లోకల్ విద్యార్థులు వచ్చేవరకు వేచి ఉండాల్సిందే తప్ప విద్యాబోధన జరగదు అన్న విషయాన్ని గ్రామాల ప్రజలకు అర్థమయ్యే విధంగా చెప్పాలని ఉపాధ్యాయ మిత్రులందరిని కోరుతున్నాం.

ఇంకా ప్రైవేట్ పాఠశాలల్లో అర్హులైన ఉపాధ్యాయులు ఉండరని, పత్రికల్లో, కూడళ్ళలో ప్రచార ఆర్భాటాలే తప్ప అక్కడ జరిగే తంతు అంతా మేడిపండు చందాన జరుగుతుందని, ఇటీవల కేశవరెడ్డి విద్యాసంస్థల బండారం బట్టబయలు కావడం, ఆ సంస్థ విద్యాబోధనకు ప్యాకేజీ ప్రకటించి, లక్షల రూపాయల డిపాజిట్‌లు విద్యార్థుల తల్లిదండ్రుల నుండి సేకరించి వడ్డీ చెల్లించడం, విద్యార్థికి వడ్డీ క్రింద ఉచితంగా చదువు అందిస్తామని నమ్మించి కోట్లాది రూపాయలు సేకరించి డిపాజిట్‌దార్లకు కుచ్చుటోపీ పెట్టిన ఉదంతాలు ఎన్నెన్నో కలవు. ప్రభుత్వ పాఠశాలలకు వారి పిల్లలను పంపించే విధంగా వారు కోరుకునే విద్యను అందిస్తామనే హామీ ఇవ్వడంతో పాటు సమాజాన్ని భాగస్వామ్యులుగా చేసినట్లయితే ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల నమోదు తప్పకుండా పెరుగుతుంది. చాలా జిల్లాల్లో చాలా ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల చొరవ కారణంగా విద్యార్థుల నమోదుతో వర్థిల్లుతున్నట్లు తెలుపుతున్నాము.

గతంలో కొందరికి విద్య అన్నప్పుడు అన్ని ప్రభుత్వ పాఠశాలలే, అందరికీ విద్య అన్నప్పుడు ప్రభుత్వ పాఠశాలలకు సమాంతరంగా ప్రైవేట్ పాఠశాలలకు రావడం, క్యాలిటీ విద్య పేరిట ఈ రోజుల్లో ప్రైవేట్ పాఠశాలలు వెలిగిపోతుంటే, ప్రభుత్వ పాఠశాలల భవిష్యత్తు అంధకారంలోకి నెట్టివేయబడుతున్నది.

రిలయన్స్ ఫ్రెష్‌లలో అమ్మే కూరగాయలు కొనే వినియోగదారున్ని అక్కడ కోల్డ్ స్టోరేజి చేసినవే తప్ప ఆ కూరగాయలు తాజావి కావని, వాటిని ముందే కూరగాయలు అమ్మే రైతులును, చిరువ్యాపారులను చూసైనా ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఆర్టీసీ, ప్రైవేట్ జోరును తగ్గించడానికి, వారు వీడియోకోచ్‌లు, ఎఫ్.ఎం. రేడియోలు,

హిట్ సాంగ్స్ వినిపిస్తూ ప్రయాణీకులు చేయి చాపితే బస్సు ఆపి ఎక్కించుకుంటున్న తీరు, ప్రయాణీకుడు కోరుకునే చోట దించుతున్న తీరు, బస్సు స్టాండ్, బస్సు షెల్టర్ వద్ద ప్రైవేట్ వాహనాలను అడ్డుకునే తీరును మనం ఆదర్శంగా తీసుకోవాలి. ప్రభుత్వ ఉపాధ్యాయులందరం గ్రామ ప్రజలకు దగ్గరవుదాం, 5 కి.మీ. లోపు అనుమతి పొందిన ప్రైవేట్ పాఠశాలలను మూతపడేలా చేద్దాం. 5 కి.మీ. పై దూరం నుండి వచ్చే పచ్చ బస్సులను అడ్డుకుందాం. మన దేశ మనిషి సగటు ఆయుర్దాయము 65 సం॥లు. మన ప్రభుత్వ బడి వయస్సు స్వాతంత్ర్యము వచ్చిన నాటినుండి లెక్కిస్తే 68 సం॥లు, మానవ జీవితం ముగింపుకు వయస్సుకు కానీ, 65 సం॥ల క్రింద చదువు నేర్పిన ప్రభుత్వ పాఠశాలలకు కాదని వాటిని కాపాడుకుందామని పిలుపునిద్దాం.

స్టీలు పాత్రల్లో, ప్రెషర్ కుక్కర్లో వంట కన్నా మట్టితో చేసిన పాత్రల్లో వంట వండితే మంచిదని, ఫాస్ట్‌ఫుడ్ కంటే, పాత తరాల వారు త్రాగిన అంబలి, తిన్న జొన్నరొట్టెలు మంచివని, విషతుల్యమైన మందులు, కృత్రిమ రసాయనాలతో పండించిన ఆహార పదార్థాల కంటే, సహజ సిద్ధమైన ఎరువులతో పండించిన ఆర్గానిక్ ఫుడ్స్ వైపు ప్రజలు మళ్ళుతున్నట్లు ప్రభుత్వ పాఠశాలల్లోనే మన పిల్లలందరినీ చదివిద్దామనే పాత రోజులు వచ్చేలా మనమందరం కృషి చేద్దామని శపథం చేద్దాం.

## స్వచ్ఛ పాఠశాలలు

నేటి బాలలే రేపటి భావి భారత పౌరులు. ఈ బాలలు విద్య నేర్చుకొనేది పాఠశాలల్లోనే. పాఠశాలల్లో విద్యార్థులకు స్వచ్ఛత గూర్చి నేర్పితే వారు స్వచ్ఛ భారత్ లక్ష్యాన్ని పూర్తి చేయగలుగుతారు. WASH ద్వారా (Water and Sanitation, Hygine) అని, అందులో భాగంగా పిల్లలు పరిశుభ్రంగా ఉంటేటట్లు చూడడం కార్యక్రమ ఉద్దేశ్యం. పిల్లలందరికీ మంచి అలవాట్లు నేర్పే బాధ్యత మన ఉపాధ్యాయులదే అని తెలుపుతూ, స్వచ్ఛత మాటల్లో కాకుండా మన పాఠశాల పరిసరాల్లో కనిపించే విధంగా ఉండాలని, పాఠశాలల్లోని గడ్డిపొదలను, పిచ్చిచెట్లను ఉపాధ్యాయులు, పిల్లలందరూ కలిసి తొలగించి స్వచ్ఛత మన అందరి బాధ్యత అనే భావం కల్పించాలి.

స్వచ్ఛ భారత్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఆగష్టు 2015 నాటికి అన్ని పాఠశాలల్లో బాల బాలికలకు వేరువేరుగా టాయిలెట్ల నిర్మాణం చేసింది. నిర్వహణలో నిర్లక్ష్యం కనబడుతుంది. నీటి వసతిని, స్కావెంజర్‌ను నియమించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నప్పటికీ నిధుల కొరతతో నియామకం చేయడంలేదు. టాయిలెట్లను శుభ్రంగా ఉంచుకొనే విధంగా జాగ్రత్తలు తీసుకొని స్వచ్ఛభారత్ స్ఫూర్తితో ముందుకు సాగాలని కోరుకుంటున్నాం.

## సంఘ నిర్మాణం

ఒక సంఘం బలంగా ఉంటే అందులోని సభ్యులు, ఆ వ్యవస్థ బాగుంటుంది. ఆ సంఘం బలహీనమైతే వ్యవస్థ విచ్ఛిన్నమై సభ్యులు చెల్లాచెదురై ఆదుకొనేవారే లేక నానా అవస్థలు పడాల్సివస్తుంది. ఇవాళ తెలంగాణ జిల్లాల్లో PRTU సంఘం బలమైన సంఘం. అందుకే ఉపాధ్యాయులు హాయిగా తన వృత్తి ధర్మాన్ని నిర్వర్తించుకుంటూ, చక్కని జీవితాన్ని గడుపుతున్నారు. విద్యారంగంలో కూడా గత నాలుగు దశాబ్దాలుగా PRTU సంఘం ఏదంటే అది సాధించి పెట్టింది. కానీ ప్రస్తుతం ప్రభుత్వ విద్యారంగం ఆటుపోటులకు గురవుతున్న విషయాన్ని ముఖ్యంగా ఉపాధ్యాయలోకం గమనించాలని కోరుతున్నాం. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వ విద్యారంగం మనుగడకు, ప్రభుత్వ ఉపాధ్యాయుల ఉనికి ప్రమాదానికి లోను కానున్నది. ఇలాంటి పరిస్థితుల్లో బలమైన సంఘం ఇంకా

బలపడి ప్రభుత్వాన్ని ఒప్పించడం ద్వారా కానీ, అవసరమైతే ఉద్యమించి ప్రభుత్వాన్ని ఎదిరించి విద్యారంగాన్ని కాపాడుకోగలుగుతాం. ఒకవేళ సంఘం ఉపాధ్యాయునికి ఆత్మస్థైర్యం కలిగించనట్లయితే ఉపాధ్యాయలోకమంతా చెల్లాచెదురై గల్లంతు అవుతారన్న సత్యాన్ని గమనించాలని కోరుతున్నాం. కాబట్టి రాబోవు రోజుల్లో జరుగనున్న పెను మార్పులను ఎదిరించడానికి కలిసికట్టుగా ఉపాధ్యాయులందరూ PRTU సంఘంపై నమ్మకముంచినందున PRTU సిద్ధంగా ఉందని తెలియజేస్తున్నాము.

తెలంగాణ ప్రాంతంలో ఆనాడు 1971 సంగలో పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు జరుగుతున్న అన్యాయాలను, ప్రభుత్వ ఉపాధ్యాయులతో పోల్చినప్పుడు ఎన్నో వివక్షలకు గురవుతున్న సందర్భంలో పంచాయతీరాజ్ ఉపాధ్యాయులమనే సెంటిమెంట్‌ను పునాదిగా చేసుకొని అవతరించిన పంచాయతీరాజ్ ఉపాధ్యాయ సంఘం (PRTU), ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఉన్న సౌకర్యాలన్నింటిని సాధించి, కొత్త సౌకర్యాలను అందరు ఉపాధ్యాయులకు సాధించిపెట్టి, పంచాయతీరాజ్ ఉపాధ్యాయులను ప్రభుత్వ ఉపాధ్యాయులుగా మార్చాలనే లక్ష్యంతో ఉమ్మడి సర్వీస్ రూల్స్ సాధించి 1998లో సంగలో సంఘం యొక్క పేరును ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ (PRTU)గా మార్చుకొన్న చరిత్ర గల సంఘం. PRTU సాధించినవి మచ్చుకు కొన్ని 010 హెడ్ క్రింద పి.ఆర్. ఉపాధ్యాయులు వేతనాలు పొందడం, ప్రభుత్వ ఉపాధ్యాయులకు లేని విధానాన్ని పెన్షన్‌లో చివరి వేతనంలో సగం పెన్షన్‌గా పి.ఆర్. ఉపాధ్యాయులతోపాటుగా అందరు ఉపాధ్యాయులకు సాధించడం, ఉద్యోగులకు లేని మన మహిళాఉపాధ్యాయులు పొందుతున్న 5రోజుల అదనపు క్యాజువల్ లీవ్‌లు మొదలుగున్నవి. ఉమ్మడి రాష్ట్రంలో బలమైన సంఘంగా వ్యాప్తి చెంది, తెలంగాణ రాష్ట్ర విభజన తరువాత తెలంగాణ రాష్ట్రంలో PRTU 75% సభ్యత్వం కలిగిన సంఘంగా విరాజిల్లుతున్నది.

తెలంగాణ ప్రాంతంలో పుట్టిన సంఘంగా తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తరువాత జరుగుతున్న ఈ కౌన్సిల్ సమావేశం సందర్భంగా నూతనంగా 2015-17 రెండు సంవత్సరాలకు గానూ ఎన్నికైన 10 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు, కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నాం. 10 జిల్లాలలోని అన్ని మండలశాఖల ఎన్నికలను పూర్తిచేసుకొని, జిల్లా ఎన్నికలను కూడా ప్రశాంతంగా పూర్తిచేసినందుకు జిల్లాల, మండలాల పాత కార్యవర్గాలను, కార్యకర్తలను అభినందిస్తున్నాం. జనవరి 2015న ప్రారంభమైన మండల ఎన్నికల ప్రక్రియ, ఏప్రిల్ 25న వరంగల్ జిల్లాశాఖకు ఎన్నిక జరగడం, ఏప్రిల్ 27న ఖమ్మం జిల్లా ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగినవి. వేసవి సెలవులు, జూన్, జులై నెలల్లో బదిలీలు, కౌన్సిలింగ్ తరువాత ఆగష్టు 23న నిజామాబాద్ జిల్లాశాఖ ఎన్నికలు జరిగినవి. సెప్టెంబర్ 8న హైదరాబాద్ జిల్లాశాఖ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగినవి. సెప్టెంబర్ 11న ఆదిలాబాద్ జిల్లాశాఖ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగినవి. సెప్టెంబర్ 20న రంగారెడ్డి, నల్గొండ జిల్లాశాఖల ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగినవి. సెప్టెంబర్ 25న కరీంనగర్ జిల్లాశాఖకు ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగాయి. సెప్టెంబర్ 27న మహబూబ్‌నగర్ జిల్లాశాఖ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగినవి. చివరగా అక్టోబర్ 11న మెదక్ జిల్లాశాఖ ఎన్నికలు జరిగినవి. 10 జిల్లాల 20 మంది ప్రధాన బాధ్యుల్లో 17 మంది పాతవారితో ముగ్గురు కొత్తవారితో జిల్లాకు 35 మంది చొప్పున 350మంది రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎన్నిక కావడం జరిగింది. మొత్తం మీద నూతన తెలంగాణ రాష్ట్రంలో ఇతర సంఘాలు అంతంత మాత్రంగా ఉంటూ, మానసిక నిర్వేదంలో కనిపిస్తున్న సమయంలో ఉపాధ్యాయులు మన సంఘంపై నమ్మకాన్ని ఉంచి గత సభ్యత్వం

65,692 కంటే, 73,439 సభ్యత్వ నమోదుతో 7,747 సభ్యత్వం పెరిగింది. పంచాయతీరాజ్, ప్రభుత్వ, సంక్షేమ పాఠశాలల్లోని అన్ని యాజమాన్యాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సంఖ్య సుమారు 1లక్ష 26 వేలు. వీటిలో 25వేల ఖాళీలను తీసివేస్తే సభ్యత్వంలో పెరుగుదల రాష్ట్రంలో ఏకపక్షంగా ఉన్నదనే విషయాన్ని గమనించాలి.

## జిల్లాల వారీగా సభ్యత్వవివరాలు

| క్ర.సంఖ్య | జిల్లాపేరు | మండలాల సంఖ్య | 2010-12 | 2012-15 | తేడా |
|---|---|---|---|---|---|
| 1. | మహబూబ్‌నగర్ | 64+3 (అర్బన్) | 9100 | 10051 | 951 |
| 2. | నల్గొండ | 60+2 (అర్బన్) | 9012 | 10008 | 996 |
| 3. | నిజామాబాద్ | 36+4 (అర్బన్) | 7000 | 8143 | 1143 |
| 4. | ఆదిలాబాద్ | 52+5 (అర్బన్) | 6246 | 8001 | 1755 |
| 5. | వరంగల్ | 50+2 (అర్బన్) | 7850 | 7854 | 4 |
| 6. | కరీంనగర్ | 57+3 (అర్బన్) | 6630 | 7821 | 1191 |
| 7. | మెదక్ | 46+5 (అర్బన్) | 7053 | 7817 | 764 |
| 8. | రంగారెడ్డి | 37+2 (అర్బన్) | 7271 | 7812 | 541 |
| 9. | ఖమ్మం | 41+2 (అర్బన్) | 4530 | 4532 | 2 |
| 10. | హైదరాబాద్ | 16 | 1000 | 1400 | 400 |
| | **మొత్తం** | | **65692** | **73439** | **7747** |

ఉపాధ్యాయలోకం ఇంత నమ్మకాన్ని మనమీద ఉంచినందుకు మనము ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న క్షేత్రస్థాయి సమస్యలను పరిష్కరించి సంఘం మీకు అండగా ఉందనే ధైర్యాన్ని కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నదని తెలియజేస్తున్నాం. అందుకే సంఘ నియమావళి మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో ఖచ్చితంగా అమలు జరిగేటట్లు చర్యలు చేపట్టాలి. మండల, జిల్లా, రాష్ట్ర కార్యవర్గాలు ప్రతి నెలకొకమారు కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించడం, 4 నెలలు పూర్తికాకముందే అన్ని స్థాయిల్లో కార్య నిర్వాహక వర్గ సమావేశము జరుపడం, సంవత్సరం పూర్తికాగానే 2016 సం॥ సభ్యత్వ నమోదు పూర్తిచేసి అన్ని స్థాయిల్లో సర్వ సభ్య సమావేశాలు జరుగునట్లు చూడాలి. వీటితో పాటు విద్యా సంబంధమైన గోష్ఠులు, విద్యాసదస్సులు నిర్వహించాలి. క్షేత్రస్థాయి సమస్యలను, కావలసిన మార్పులను తీర్మానాలు చేసి మండలం నుండి జిల్లాకు, జిల్లా నుండి రాష్ట్రానికి ఎప్పటికప్పుడు పంపించాలి.

నూతన జిల్లా కార్యవర్గాలు వరంగల్ ఆగష్టు 30న, ఖమ్మం ఆగష్టు 23న, ప్రథమ కార్యవర్గ సమావేశాలు నిర్వహించినందుకు అభినందనలు తెలియజేస్తున్నాము. ఈ రెండు జిల్లాల్లో మండల కార్య నిర్వాహక వర్గ సమావేశాలు జరిగేటట్లు జిల్లా బాధ్యులు చొరవ తీసుకోవాలని, మాస పత్రికకు వస్తున్న వార్తా సమాచారాన్ని బట్టి కొన్ని మండలశాఖలు మాత్రమే కార్య నిర్వాహక వర్గ సమావేశాలు జరిపినట్లు తెలుస్తున్నది. మిగతా జిల్లాలు కూడా 4 నెలల లోపు ప్రథమ కార్య నిర్వాహక వర్గ సమావేశాలు జరపాలని, ఆలోపు ఆయా జిల్లాలు మండల శాఖలు ప్రథమ కార్య నిర్వాహక వర్గ సమావేశాలు జరుపునట్లు చూడాలని కోరుతున్నాము. సంఘ

నియమావళి ప్రకారం ఏయే సమావేశాలు నిర్వహించాలనే విషయాన్ని నివేదిక చివరిలో పొందుపరచడం జరిగింది. ఆ విధంగా అన్ని స్థాయిల్లో సమావేశాలు జరపాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

ఈ మూడు సంవత్సరాల టర్మ్‌లో రాష్ట్ర కార్య నిర్వాహక వర్గ సమావేశాలకు, సర్వ సభ్య సమావేశాలకు తేది. 24-11-2013న గన్‌రాక్ ఫంక్షన్ హాల్ సికింద్రాబాద్‌లో జరుపుటకు ఆతిథ్యం ఇచ్చిన హైదరాబాద్ జిల్లాశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీ కె. మధుసూధన్ రెడ్డి, శ్రీ తిరుపతి రెడ్డి, ఎమ్మెల్సీ శ్రీ కె. జనార్థన్ రెడ్డి గారలకు, తేది. 15-3-2014న యాదగిరి గుట్టలో జరుపుటకు ఆతిథ్యం ఇచ్చిన నల్లగొండ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీ కోమటి రెడ్డి నర్సింహా రెడ్డి, శ్రీ సుంకరి భిక్షం గౌడ్, ఎమ్మెల్సీ శ్రీ పూల రవీందర్ గారలకు, తేది. 25-11-2014న వేములవాడలో జరుపుటకు ఆతిథ్యం ఇచ్చిన కరీంనగర్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీ జాలి మహేందర్ రెడ్డి, శ్రీ నరహరి లక్ష్మారెడ్డి గారలకు, తేది. 14-2-2015న నిజామాబాద్ జిల్లాలో జరుపుటకు ఆతిథ్యం ఇచ్చిన జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీ బీరెల్లి కమలాకర్ రావు, శ్రీ ఇత్తెపు శంకర్ గారలకు, శ్రీ బి. మోహన్ రెడ్డి మాజీ ఎమ్మెల్సీ గారికి, తేది. 21-6-2015న వరంగల్ జిల్లాలో ఆతిథ్యం ఇచ్చిన జిల్లా బాధ్యులు శ్రీ పి. శ్రీపాల్ రెడ్డి, శ్రీ టి. శ్రీనివాస్ గారలకు, రెండు రోజుల కౌన్సిల్ సమావేశానికి ఈరోజు, రేపు ఆతిథ్యాన్ని ఇస్తున్న కరీంనగర్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీ జాలి మహేందర్ రెడ్డి, శ్రీ నరహరి లక్ష్మారెడ్డి గారలకు కృతజ్ఞతాభివందనములు తెలియజేస్తున్నాం.

డివిజన్ సమావేశాలను ఏర్పాటు చేయాలని కోరగా కొన్ని డివిజన్లలో సమావేశాలు ఏర్పాటు చేసిన జిల్లా బాధ్యులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావాన్ని పురస్కరించుకొని జడ్చర్లలో నాలుగువేల మంది ఉపాధ్యాయులతో సభను, శ్రీ డి. సత్యనారాయణ జిల్లా అధ్యక్షులు మహబూబ్‌నగర్ గారి ఉద్యోగ విరమణ సభను వేలాదిమందితో నిర్వహించిన మహబూబ్‌నగర్ జిల్లాశాఖను, 3వేల మంది ఉపాధ్యాయులతో 19-3-2015న ఆత్మీయ సమ్మేళనాన్ని వరంగల్‌లో నిర్వహించిన వరంగల్ జిల్లా బాధ్యులకు కృతజ్ఞతలు.

రాష్ట్ర, జిల్లా బాధ్యులము, సంఘ సీనియర్ కార్యకర్తల ఉద్యోగ విరమణ సన్మానసభకు హాజరవుతున్నాం. ఈ సమావేశాలు జరుగుతున్న తీరు, అచ్చట అన్ని వర్గాల వారు హాజరవుతున్న సందర్భంలో మనం విద్యారంగ, వృత్తిపరమైన సమస్యలను చర్చించుకోగలుగుతున్నామా! ఆలోచించాల్సిందిగా కోరుతున్నాం. ఇలాంటి సమావేశాలు కాదనలేము గానీ, ఆ కార్యకర్త సంఘానికి చేసిన సేవను బట్టి జిల్లా నుండి రాష్ట్రం నుండి ప్రధాన బాధ్యులను, సంఘ ఎమ్మెల్సీలను పిలవడం జరగాలి. ఈ పదవీ విరమణకు జిల్లా బాధ్యుడు ఒకరు లేదా రాష్ట్ర బాధ్యుడు ఒకరు లేదా ఎమ్మెల్సీ ఒకరు హాజరు అయితే సరిపోతుంది. కానీ పట్టుబట్టి 4గురు లేదా 5గురిని రాష్ట్రం నుండి పిలవడం వల్ల సమావేశ నిర్వహణకు ఇబ్బంది కలిగించిన వాళ్ళం అవుతూ, ఎలాంటి సందేశాన్ని ఇవ్వకుండా పొడి పొడి మాటలతో ప్రేక్షకపాత్ర వహించాల్సి వస్తుంది. సోదర సంఘాలు పెళ్ళిళ్ళకు, పేరంటాలకు చందాలు సేకరిస్తుంటే, మనం పదవీ విరమణకు హాజరవుతూ వాహన ఖర్చులు, హితవరుల చందాలు సేకరించకుండా సంఘంపై, జిల్లా, రాష్ట్రస్థాయిల్లో భారం మోపడం జరుగుతున్నది. ఈ విషయం ఆలోచించి ఎలాగైతే బాగుంటుందో నిర్ణయించాల్సిందిగా కోరుతున్నాం.

సమావేశాలు సమయానికి ప్రారంభమగునట్లు, నిర్దేశించిన సభ్యులందరూ పాల్గొని, చర్చలో పాల్గొనేలా చూడాలి. ఈ సమావేశాలకు మంత్రులు, ఎమ్మెల్యేలను పిలవడం వల్ల సమస్యలపై చర్చ జరగక అందరం

ప్రేక్షకపాత్ర వహించాల్సివస్తున్నది. ఇతరులను సదస్సులు, గ్రాంటుల నిర్వహణ సందర్భంలో మాత్రమే ఆహ్వానించవలసిందిగా కోరుతున్నాం. అన్ని స్థాయిల్లోని అన్ని సమావేశాల తీర్మానాలను రాష్ట్రశాఖకు, పత్రికకు వెనువెంటనే పంపించాలి. వార్తాపత్రికల్లో, ఎలక్ట్రానిక్ మీడియాల్లో సమావేశ వార్తలు ప్రచురణలు, ప్రసారము అయ్యేటట్లు చూడాలి.

జిల్లా బాధ్యులు మండల బాధ్యులను ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండేటట్లు చూస్తూ, మండల సభ్యులను ఎప్పటికప్పుడు కలవడం, ముఖ్యమైన మెసేజ్‌లు పంపడం చేస్తుండాలి. మనం నిర్లిప్తంగా ఉంటే, ఇతర సంఘాలు ద్వంద్వ సభ్యత్వాన్ని ప్రోత్సహించే ప్రమాదం ఉంటుంది కాబట్టి దాన్ని నివారించాలి. మెసేజ్‌లు, వాట్సప్, ఫేస్‌బుక్‌ల ద్వారా, ఫోన్ కాల్స్ ద్వారా ప్రతి సభ్యులకు వివిధ స్థాయిల్లోని బాధ్యులతో, నేరుగా అనుసంధానము అవుతున్నాడు. ఈ సంస్కృతిని తగ్గించి, మండల ప్రాథమిక సభ్యుడు ఏ స్థాయిలో పరిష్కరించే సమస్యనైనా మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు చేరవేయాలి. ఆ సమస్య మండలంలో పరిష్కారమయ్యేది అయితే వారే పరిష్కరించాలి. ఒకవేళ జిల్లాస్థాయి లేదా రాష్ట్రస్థాయి సమస్య అయితే అది జిల్లా బాధ్యులకు, మండల బాధ్యులు చేరవేయాలి. జిల్లాలో పరిష్కరించాల్సింది అయితే జిల్లాశాఖ పరిష్కరిస్తుంది. రాష్ట్ర సమస్య అయినప్పుడు జిల్లాశాఖ ద్వారా రాష్ట్రశాఖకు చేర్చితే నిర్మాణ క్రమము బాగా ఉండి అన్ని స్థాయిల్లోని కార్యకర్తలు క్రియాశీలకంగా ఉండే అవకాశం ఉంటుంది. ఈ విషయంలో మండల, జిల్లా ప్రధాన బాధ్యులు ప్రత్యేక దృష్టి సారించి మనం బాధ్యతలు తీసుకున్న రోజున సభ్యుల సమక్షంలో చేసిన ప్రమాణాన్ని, ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం సభ్యులకు మేము ఉన్నామనే భరోసాను కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

## సంఘ భవనము

రాష్ట్ర సంఘ భవనం నిర్మాణం అయ్యి 25 సంవత్సరాలు పూర్తి కావస్తున్నది. సుందరంగా తీర్చిదిద్దిన కార్యాలయ గదిని చెదలు పురుగులు తీవ్రంగా నష్టపరిచినవి. చాలా ఫైళ్ళు, ఫోటోలు దెబ్బతినడం జరిగింది. కర్ర, కార్డుబోర్డుతో తయారు చేసిన నిర్మాణాన్ని తొలగించి, POP తో తిరిగి నిర్మాణం చేయడం జరిగింది. రాష్ట్ర విభజన తరువాత సంఘ భవనానికి ఉపాధ్యాయుల రాక బాగా తగ్గింది. దీంతో ఆదాయం తక్కువ, వ్యయం ఎక్కువ అవుతున్న విషయాన్ని గమనించాలి. సంఘ భవనము ప్రక్క ఇతరులు నిర్మించిన భవనాల నుండి వెళ్ళే నీరు ఏనాడో నిర్మించిన డ్రైనేజిలో ఇబ్బందులు ఏర్పడడంతో దుర్వాసనలు వెలువడడం వలన చాలా ఇబ్బందులు ఎదుర్కొనవలసి వస్తుంది. పార్కింగ్ స్థలం లేకపోవడం వల్ల జిల్లాల నుండి ఒకటి, రెండు కార్లు వచ్చినప్పుడు ప్రక్కవాళ్ళతో గొడవలు జరుగుతున్నాయి.

పై విషయాలను దృషిలో ఉంచుకొని సంఘ భవనంలో మార్పులు చేస్తే బాగుంటుందని భావిస్తున్నాం. ఈ విషయంలో మీయొక్క సూచనలను కోరుతున్నాం.

## జనరల్ ఫండ్

జనరల్ ఫండ్ వసూలు విషమంలో ఖమ్మం జిల్లాను మనమందరం ఆదర్శంగా తీసుకోవాలి. వారు మొన్న కౌన్సిల్ సందర్భంలో ప్రతి సభ్యుడు ఒక నెల TG ఇంక్రిమెంట్‌ను జనరల్ ఫండ్‌గా చెల్లించాలని కోరడం హర్షదాయకం. దీన్ని స్ఫూర్తిగా తీసుకొని సంఘ నియమావళిలో తెలిపిన ప్రకారం జనరల్ ఫండ్ సేకరించాలని

మే నెలలో జరిగిన అత్యవసర కమిటీ (జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు) సమావేశంలో నిర్ణయించినట్లు ప్రతి జిల్లా 2.5 లక్షలకు తగ్గకుండా జనరల్ ఫండ్ సేకరించి రాష్ట్రశాఖకు చెల్లించాలని నిర్ణయించడం జరిగింది. ఈ నిర్ణయం ప్రకారం అన్ని జిల్లాలకు 10 లక్షలకు సరిపడా రూ. 500/-, రూ. 1000/- స్లిప్స్ గల జనరల్ ఫండ్ పుస్తకాలు అందించడం జరిగింది. సేకరించిన ఫండ్ 50% మండలానికి, 25% జిల్లాకు, 25% రాష్ట్రశాఖకు చెందాల్సి వుంది. వివిధ మండలాల్లో సేకరణ కార్యక్రమం చేపట్టినప్పుడు మంచి స్పందన వచ్చిన సమాచారం ఉంది. మన సంఘ సభ్యత్వ లెక్కలు తెలిసిన తరువాత ఇతర సంఘాల సభ్యత్వము ఎంతో తెలిసిపోయింది. కానీ ఆ సంఘాలు విద్యా సదస్సుల పేర అదేరోజు వారి సంఘ ఎన్నికలు జరుపుకొంటూ, జిల్లాకు 10 లక్షలకు తక్కువ కాకుండా జనరల్ ఫండ్ వసూలు చేసిన విషయాన్ని రాష్ట్ర సదస్సు, ఎన్నికలు నిర్వహించుకొన్న ఆజిల్లాలో సుమారు 50 లక్షలు వసూలు చేయడం, టి.వి.ఛానల్‌కు లక్షల్లో చందాలు వసూలు చేసిన విషయాన్ని గమనించగలరు. మనం వెళ్ళకుంటే మనవాళ్ళు ఇతర సంఘాలకు అంత పెద్ద మొత్తాలను అందించడాన్ని అరికట్టలేము. కావున మేమిచ్చిన కోటాలను పూర్తి చేసి చెల్లింపులు చేస్తూ, ఓచర్లను అందజేయాలని కోరుతున్నాం. ఇప్పటి వరకు నల్గొండ జిల్లా ఒక లక్ష, రంగారెడ్డి, నిజామాబాద్ 90 వేలు చెల్లించినవి.

## సంఘ నియమావళిలో సవరణలు

**మనం ఇటీవల రూపొందించిన నియమావళిలో రాష్ట్ర బాధ్యుల పోస్టులను 51గా నిర్ణయించడం జరిగింది. జిల్లా బాధ్యుల నిర్ణయం మేరకు ఈ పోస్టుల సంఖ్యను 51 నుండి 201కు పెంచుతూ, రాష్ట్ర అసోసియేట్ పోస్టులను 80, ఇందులో 8 మహిళలకు, రాష్ట్ర ఉపాధ్యక్ష పోస్టులను 60 ఇందులో 6 మహిళలకు, రాష్ట్ర కార్యదర్శి పోస్టులు 59 ఇందులో 6 మహిళలకు కేటాయిస్తూ తీర్మానించాల్సిందిగా కోరుతున్నాము. ఈ మార్పు ఈ రాష్ట్ర కార్యవర్గ ఎన్నికల్లో అమలు కానుంది.**

## సభ్యత్వ రుసుం పెంపు

**గత 10 సంవత్సరాలుగా సంఘ సభ్యత్వం రూ. 100/-లో మార్పు లేదు. ఈ మధ్య కాలంలో 2 PRCలు పొందడం జరిగింది. మన వేతనాల్లో పెరుగుదల జరిగినందున, సంఘ నిర్వహణ ఖర్చులు, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పెరిగినందున సభ్యత్వ రుసుం పెంపును ఎంత పెంచాలో నిర్ణయించాలని కోరుతున్నాం.**

## రాష్ట్ర అధ్యక్షులు శ్రీ పి. వెంకట్ రెడ్డి గారి ఉద్యోగ విరమణ సన్మానసభ

ఈనెలలో ఉద్యోగ విరమణ చేయబోతున్న రాష్ట్ర సంఘ అధ్యక్షులు శ్రీ పేరి వెంకట్ రెడ్డి గారి సన్మాన సభ రాష్ట్ర సంఘ పక్షాన పింగళి వెంకట్రామి రెడ్డి హాల్, హైదరాబాద్ నందు తేది. 14-10-2015న మధ్యాహ్నం 2:00గంటలకు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఉప ముఖ్యమంత్రి, విద్యాశాఖామాత్యులు శ్రీ కడియం శ్రీహరి గారు, విశిష్ట అతిథులుగా హోంశాఖామాత్యులు శ్రీ నాయిని నర్సింహారెడ్డి గారు, వైద్య, ఆరోగ్య శాఖమాత్యులు శ్రీ సి. లక్ష్మారెడ్డి గారు, మహబూబ్‌నగర్ శాసనసభ్యులు శ్రీ వి. శ్రీనివాస్ గౌడ్ గారు, పాఠశాల విద్యాసంచాలకులు శ్రీ టి. చిరంజీవులు గారు హాజరు కావడం జరిగింది. శ్రీ పి. వెంకట్ రెడ్డి గారు మ్యాండేట్ ఇచ్చి గెలిపించిన PRTU ఎమ్మెల్సీలు శ్రీ కె. జనార్ధన్ రెడ్డి, శ్రీ పూల రవీందర్, శ్రీ గాదె

శ్రీనివాసులు నాయుడు, డా॥ బచ్చల పుల్లయ్య గారలతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర PRTU అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీ ఎం. కమలాకర్ రావు, శ్రీ బి. అప్పారావు, ఇరు రాష్ట్రాల పత్రిక ప్రధాన సంపాదకులు శ్రీ నరహరి లక్ష్మారెడ్డి, శ్రీ వి. కరుణానిధి మూర్తి గారలు పాల్గొనడం జరిగింది. మాజీ ఎమ్మెల్సీ, AITO ఛైర్మన్ శ్రీ బి. మోహన్ రెడ్డి గారు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ పి. సరోత్తం రెడ్డి వ్యవహరించడం జరిగింది.

శ్రీ పి. వెంకట్ రెడ్డి గారి సన్మానసభ రంగరంగ వైభోగంగా జరిగింది. వారి 9 సంవత్సరాల రాష్ట్ర అధ్యక్ష పదవీకాలంలో ఉమ్మడి రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించడం వల్ల తెలంగాణ 10 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, తెలంగాణ జిల్లా నుండి వేలాదిమంది సంఘ సభ్యులను, కార్యకర్తలను కదిలించడం, ఆంధ్ర 13 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో పాటు సీనియర్ కార్యకర్తలు హాజరై వారిని ఘనంగా సన్మానించడం జరిగింది. సంఘ ఆహ్వానం మేరకు పాల్గొన్న ప్రతి సభ్యునికి, 23 జిల్లాల బాధ్యులకు, మంత్రివర్యులకు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు, అధికారులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

## మహాధర్నా

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత సంవత్సరం గడుస్తున్న విద్యారంగం పట్ల నిర్లక్ష్యవైఖరిని నిరసిస్తూ, సమస్యలను పరిష్కరిండానికి జూన్ 9, 2015న ఇందిరాపార్క్, హైదరాబాద్ నందు ఉదయం 11:00 నుండి సాయంత్రం 4:00 గంటల వరకు మహాధర్నా నిర్వహించడం జరిగింది. ఈ ధర్నాకు 25వేల మంది వేసవి సెలవుల్లో కదలివచ్చి విజయవంతం చేయడం జరిగింది. రాష్ట్ర సంఘ అధ్యక్షులు శ్రీ పి. వెంకట్ రెడ్డి గారి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మన ఎమ్మెల్సీలు శ్రీ కె. జనార్థన్ రెడ్డి, శ్రీ పూల రవీందర్, మాజీ ఎమ్మెల్సీ, AITO ఛైర్మన్ శ్రీ బి. మోహన్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ పి. సరోత్తం రెడ్డి, 10 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, సోదర సంఘాల బాధ్యులు ప్రభుత్వ నిర్లక్ష్యవైఖరిని నిరసించడం జరిగింది. మహాధర్నాను విజయవంతం చేయడానికి ఉపాధ్యాయులను కదలించడానికి వేసవి సెలవుల్లో అన్ని జిల్లా కేంద్రాల్లో సన్నాహక సమావేశాలు నిర్వహించడానికి, తదుపరి డివిజన్ కేంద్రాల్లో సమావేశాలు నిర్వహించిన జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల కృషి అమోఘమైనదని తెలియజేస్తూ కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

## గర్జన సభ

తేది. 02-10-2013న ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి PRTU "గర్జన సభ"ను నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి తెలంగాణ జిల్లాలనుండి 30వేల మంది PRTU ఉపాధ్యాయులు హాజరై తమ తెలంగాణ రాష్ట్ర సాధన ఆకాంక్షను తెలియజేశారు. ఈ సమావేశానికి అన్ని రాజకీయ పక్షాల ప్రతినిధులు హాజరుకావడం జరిగింది. TRS నుండి శ్రీ కేశవరావు పార్లమెంట్ సభ్యులు, కాంగ్రెస్ నుండి శ్రీ శ్రీధర్‌బాబు, శ్రీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, BJP నుండి శ్రీ బండారు దత్తాత్రేయ, CPI నుండి శ్రీ చాడ వెంకట్ రెడ్డి గారలు హాజరై ప్రసంగించారు. రాష్ట్ర సంఘ అధ్యక్షులు శ్రీ పి. వెంకట్ రెడ్డి గారి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మన ఎమ్మెల్సీలు శ్రీ కె. జనార్థన్ రెడ్డి, శ్రీ పూల రవీందర్, మాజీ ఎమ్మెల్సీ, AITO ఛైర్మన్ శ్రీ బి. మోహన్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ పి. సరోత్తం రెడ్డి

గారలు ప్రసంగించారు. ఈ గర్జన సభ నిర్వహణకు సౌజన్యాన్ని అందించిన శ్రీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారికి, ఎమ్మెల్సీ శ్రీ పూల రవీందర్ గారికి, భోజన ప్యాకెట్లు, నీటి సరఫరా చేసిన రంగారెడ్డి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీ శివకుమార్, శ్రీ చెన్నకేశవ రెడ్డి, ఎమ్మెల్సీ శ్రీ కె. జనార్ధన్ రెడ్డి గారలకు కృతజ్ఞతలు. వేలాదిగా ఉపాధ్యాయులను తరలించిన 10 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు తెలంగాణ ఉద్యమ అభినందనలు తెలియజేస్తున్నాం.

## JACTO నిరసన దీక్ష

ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని జూన్ 11, 2014న అన్ని ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో JACTO పక్షాన ఒకరోజు నిరసన దీక్ష కార్యక్రమం ఏర్పాటు చేయనైనది. మన సంఘ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ పి. వెంకట్ రెడ్డి గారి అధ్యక్షతన జరిగిన నిరసన దీక్ష కార్యక్రమానికి వేసవి సెలవులైనప్పటికీ ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరు కావడం జరిగింది. ఇందుకు కృషి చేసిన జిల్లా బాధ్యులకు కృతజ్ఞతలు.

## PRTU ఆవిర్భావ దినోత్సవము

1971వ సంవత్సరములో ఆవిర్భవించిన మన సంఘ ఆవిర్భావ దినోత్సవాన్ని ప్రతియేటా ఫిబ్రవరి 9న నిర్వహించుటకు నిర్ణయించనైనది. ఈ తేదిన ప్రతి సంవత్సరం రాష్ట్ర, అన్ని జిల్లా కేంద్రాలలో, మండల కేంద్రాలలో సంఘ పతాకావిష్కరణ చేసి, సమావేశం నిర్వహించి, సంఘం సాధించిన విజయాలను, సాధించిన సమస్యలను చర్చించి కార్యక్రమాలు నిర్వహించాలి. ప్రతి యేటా ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహిస్తున్న మహబూబ్‌నగర్ జిల్లాశాఖకు అభినందనలు తెలుపుతూ, మిగతా జిల్లాలు, మండల శాఖలు వీరిని ఆదర్శంగా తీసుకోవాలి. ఈ కార్యక్రమము గురించి పత్రికల్లో ప్రకటనలు ఇవ్వడంతో పాటు, మాసపత్రికకు వార్తను పంపాలని మనవి చేస్తున్నాము.

## ఉపాధ్యాయ సంఘాలకు గుర్తింపు ఎన్నికలు

మన PRTU సంఘం వృత్తిపరంగా ఉపాధ్యాయ సౌకర్యాలను మెరుగుపరుస్తూ, మారుతున్న కాలానికి అనుగుణంగా సర్వీసు పరమైన సౌకర్యాలు కల్పిస్తూ ఉపాధ్యాయ వృత్తిని ఉన్నతస్థానంలో ఉంచాలనే ఉద్దేశ్యంతో ఆవిర్భవించింది. యిజాల పేరుతో కొన్ని, రాజకీయ పార్టీలకు అనుబంధంగా కొన్ని, క్యాడర్ల వారీగా కొన్ని ఉపాధ్యాయ సంఘాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చి మన రాష్ట్రంలో 42కు పైగా సంఘాలు పనిచేస్తున్నాయి. ఈ సంఘాలు తమ ఉనికి కోసం పోరాడుతూ, వ్యక్తిగత ఆధిపత్య పోరుకు ప్రాధాన్యత ఇవ్వడం వల్ల ఉపాధ్యాయ ఉద్యమానికి ప్రతిబంధకంగా మారి ప్రభుత్వం వ్యతిరేక నిర్ణయాలు తీసుకోవడానికి అవకాశం కల్పిస్తున్నాయి. ఉపాధ్యాయ సంఘాలను ఏర్పాటు చేసుకోవడాన్ని వ్యతిరేకించడం లేదు గానీ, వాటిని పరిమితం చేయాలని కోరుతున్నాం. ఒక ఉపాధ్యాయ సంఘం గుర్తింపు పొందాలంటే 25% ఉపాధ్యాయుల ఆమోదం పొందిన 2 లేదా 3 సంఘాలు ఉండేవిధంగా సంఘాలకు ఎన్నికలు జరిపి నిర్ణయించాలి. మెజార్టీ సాధించిన ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి. ఈ ఎన్నికలు జరిగినప్పుడు ప్రాథమిక స్థాయిలో సంఘ బాధ్యతలను నిర్వహిస్తున్న మండల బాధ్యులకు అదనపు సెలవులు, కల్పించడంతో పాటు, జిల్లా బాధ్యులకు మరిన్ని సౌకర్యాలు లభిస్తాయి. ఉప ముఖ్యమంత్రి, విద్యాశాఖమంత్రి శ్రీ కడియం శ్రీహరి గారు తెలిపినట్లు, ముఖ్యమంత్రిగారిని ఒప్పించి తెలంగాణ రాష్ట్రంలో ఉపాధ్యాయ సంఘాలకు ఎన్నికలు జరిపించాలని కోరుతున్నాం.

# పంచాయతీరాజ్ ఉపాధ్యాయ

"ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఉపాధ్యాయ"గా నెల నెలా వెలువడుతున్న మాసపత్రికను తెలంగాణ ఎడిషన్ కొరకు కేంద్ర ప్రభుత్వ పత్రిక రిజిస్ట్రేషన్ శాఖకు పంపించి టైటిల్ పేరు "పంచాయతీరాజ్ ఉపాధ్యాయ తెలంగాణ స్టేట్"గా అనుమతి పొందడం రిఫరెన్స్ నెం.1268254 తేది: 19-03-2015 ద్వారా పొందడం జరిగింది. ఈ టైటిల్ పేరుతో జూన్ 21, 2015న వరంగల్‌లో జరిగిన రాష్ట్ర కార్యనిర్వాహక వర్గ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి శ్రీ కడియం శ్రీహరి గారి చేతుల మీదుగా మాస పత్రిక "పంచాయతీరాజ్ ఉపాధ్యాయ తెలంగాణ స్టేట్" ఎడిషన్ ఆవిష్కరించబడింది. ఈ టైటిల్ పేర డిక్లరేషన్ "పోలీస్ కమీషనర్ హైదరాబాద్" ద్వారా పొంది రిజిస్ట్రేషన్ పొందడానికి జూలై 3న ప్రతిపాదనలు పంపడం జరిగింది. అచ్చట నుండి అనుమతి కొరకు పలు సందర్భాలలో మెయిల్ ద్వారా, ఫోన్ ద్వారా సంప్రదించినప్పటికీ అనుమతి రావడం జరగలేదు. సెప్టెంబర్ 22 న సర్వీస్ రూల్స్ కొరకు మన సంఘ పక్షాన వెళ్ళిన ప్రతినిధి బృందం దరఖాస్తు చేసిన మరొక ప్రతిని తీసుకొని వెళ్ళి వారు ఢిల్లీలోని రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ప్రతిపాదనలు అందజేసి అదేరోజున టైటిల్‌కు అనుమతి పొందడం జరిగింది. దీనికి కృషి చేసిన రాష్ట్ర సంఘ అధ్యక్షులు శ్రీ పి. వెంకట్ రెడ్డి గారికి, ఎమ్మెల్సీ శ్రీ పూల రవీందర్ గారికి, మాజీ ఎమ్మెల్సీ AITO ఛైర్మన్ శ్రీ బి. మోహన్ రెడ్డి గారలకు, వెనువెంటనే స్పందించి అనుమతిచ్చిన కేంద్ర (I& PR) అధికారులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. ప్రస్తుతం పోస్టల్ డిపార్ట్‌మెంట్ నుండి 0.25 పైసల స్టాంప్‌తో పోస్ట్ చేయడానికి అనుమతి కొరకు పోస్టల్ డిపార్ట్‌మెంట్ వారికి దరఖాస్తు చేయడం జరిగింది. వారు మనం అందించిన 22వేల పైచిలుకు పత్రిక చందాదారుల నుండి 'ర్యాండమ్'గా కొందరి అభిప్రాయాలు సేకరించి తరువాత అనుమతించడం జరుగుతుంది. ఈ ప్రక్రియ వచ్చే నెల నాటికి పూర్తికానున్నది. ఒకవేళ అనుమతి లేకుండా కొత్త టైటిల్‌తో పోస్టింగ్ చేసినచో రూ. 5/- స్టాంప్ అతికించవలసి ఉన్నందున ఆర్థిక భారాన్ని దృష్టిలో ఉంచుకొని PRTU AP టైటిల్ పేరుతో పంపిస్తున్న ఈ విషయాన్ని గమనించి సహకరించవలసిందిగా కోరుతున్నాం. పత్రిక అనుమతి కొరకు పొందిన పత్రాలను నివేదిక చివరలో ప్రచురించినాము. గమనించగలరు.

చందాదారులకు పత్రిక అందడము విషయంలో ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. 'పత్రిక' అందడంలేదు అనే మాట చందాదారులను చేర్పించే క్యాంపెయిన్ ఆలోచనకు అడ్డు వస్తుంది'. అన్నమాట జిల్లా కౌన్సిల్ సమావేశాల సందర్భంలో రావడం జరిగింది. ఈ నివేదికలో పొందుపరిచిన అంశం విషయంలో వివరణ. ప్రతినెల 22 వేల పత్రికలను పోస్టింగ్ చేయడం జరుగుతున్నది. సుమారు 2500 పత్రికలు తిరిగి సంఘ కార్యాలయానికి వస్తున్నాయి. ఇట్టి విషయాన్ని జిల్లా బాధ్యులకు తెలియజేయడంతో పాటు ఆయా జిల్లాల పత్రికలను వేరుచేసి జిల్లా బాధ్యులకు అందజేయడం జరుగుతున్నది. ఒక నెలలో తిరిగి వచ్చిన పత్రిక పైన ఉన్న అడ్రస్‌లు, ఉపాధ్యాయుల పేర్లను జిల్లాల వారీగా పత్రికలో ముద్రించడం జరిగింది. దీనికి అడ్డుకట్ట వేయడానికి ఏమైనా ఇతర చర్యలు ఉంటే తెలియజేయాలని కోరుతున్నాం.

ఉపాధ్యాయులకు సంఘ సమాచారం, విద్యారంగ, వృత్తిపరమైన సమస్యలు, సాధించిన ఉత్తర్వులను అందించుటకు "ఆయువుపట్టు" పత్రిక. సంఘ సభ్యత్వం సంఖ్య 73వేలు, పత్రిక చందాదారుల సంఖ్య 22 వేలు అంటే 30% మంది సభ్యులు మాత్రమే చందాదారులు. చందాదారులను చేర్పించడంలో ప్రగతి లేదు. పత్రిక నిర్వహణ ఆర్థిక భారము అవుతున్నది. జిల్లాల నుండి నెలకు రూ. 1.5 లక్షల ప్రకటనలు సేకరించి

తోడ్పాటునందించాలంటే ఆదిలాబాద్, వరంగల్, కరీంనగర్ జిల్లాలు మాత్రమే స్పందించినాయి. ప్రభుత్వ ప్రకటనలు కూడా అందడం లేదు. ప్రభుత్వ ప్రకటనలు పొందడానికి ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్సీ గార్ల ద్వారా కృషి చేస్తున్నాము. గత నెల, ఈ నెల ప్రభుత్వ ప్రకటన ఇవ్వడం జరిగింది. జీవిత చందా అంటే పదవీ విరమణ వరకు (58 సం॥) కొనసాగుతుంది. పదవీ విరమణ పొందిన వారి పేర్లను జిల్లా బాధ్యులు తొలగించాలని కోరుతున్నాం. పదవీ విరమణ పొందినవారికి పత్రిక ఆపితే వారు ఎందుకు రావడం లేదు అని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయాన్ని జిల్లా బాధ్యులు వారికి పదవీ విరమణ వరకే జీవిత చందా అని తెలియజెప్పాలి. జీవిత చందా చేసిన వ్యక్తికి పదవీ విరమణ వరకు అందించుటకు ఆర్థిక భారం అవుతున్నందున ఈ కౌన్సిల్ సమావేశంలో ఈ విధానానికి ముగింపు పలికి, 5 సం॥ల చందాకు రూ. 600/- చొప్పున కొత్త చందాలను సేకరించాలనే విషయాన్ని తేది. 14-2-2015న నిజామాబాద్ జిల్లాలో జరిగిన రాష్ట్ర కార్య నిర్వాహక వర్గ సమావేశంలో కోరడం జరిగింది. ఈ మార్పును అంగీకరించి తమరందరు ఆమోదించాలని కోరుతున్నాము. 22 వేల జీవిత చందాదారులు పోగా, మిగిలిన 51 వేల మంది సభ్యుల్లో కనీసం సగం 25 వేల మందిని సభ్యులుగా చేర్పించే కార్యక్రమాన్ని యుద్ధప్రాతిపదికన చేపట్టి జిల్లాకు 2500 మందిని సభ్యులుగా చేర్పించాలని కోరుతున్నాం.

మాసపత్రికకు వార్తల సేకరణ కూడా ఇబ్బందిగా మారుతున్నది. కొన్ని జిల్లాలు వార్తలు పంపడంలో ఆసక్తి చూపడం లేదు. ఈ విషయంలో జిల్లాల తీరులో మార్పురావాలని కోరుతూ, మీరు నిర్వహించే, హాజరయ్యే సమావేశాల వార్తలు మరియు గేయాలు, కథలు, విద్యారంగ సమస్యలు, వ్యాసాలను ప్రతినెలా 5వ తేది లోగా రాష్ట్ర కార్యాలయానికి పంపినట్లయితే ముద్రణ సులభతరం అవుతుంది. ఇప్పటివరకు ఉన్న జిల్లాల వారీ చందా వివరాలను ఈ క్రింద పట్టిక రూపంలో తెలియజేస్తున్నాము.

## జిల్లాల వారీగా పత్రిక జీవిత చందాదారుల వివరాలు

| S.NO. | DISTRICT NAME | 13-10-2012 వరకు | ఈ 3 సంవత్సరాలలో 31-10-2015 వరకు | TOTAL |
|---|---|---|---|---|
| 1. | WARANGAL | 3537 | 159 | 3696 |
| 2. | MAHABUBNAGAR | 2872 | 758 | 3630 |
| 3. | NIZAMABAD | 3123 | 176 | 3299 |
| 4. | R.R & HYD Dists. | 2802 | 236 | 3038 |
| 5. | ADILABAD | 2471 | 128 | 2599 |
| 6. | MEDAK | 1957 | 166 | 2123 |
| 7. | NALGONDA | 1305 | 85 | 1390 |
| 8. | KARIMNAGAR | 1217 | 236 | 1453 |
| 9. | KHAMMAM | 985 | 8 | 993 |
| | **TOTAL** | **20269** | **1952** | **22221** |

పత్రిక జీవిత చందా సేకరణలో మొదటి స్థానములో నిలిపిన వరంగల్ జిల్లా శాఖ అధ్యక్షులు శ్రీ పింగిళి శ్రీపాల్ రెడ్డి గారికి, ప్రధాన కార్యదర్శి శ్రీ తిరునగరి శ్రీనివాస్ గారికి ధన్యవాదములు తెలుపుతున్నాము.

## ఎమ్మెల్సీ ఎన్నికలు

ఈ కార్యవర్గ పదవీకాలంలో ఉమ్మడి రాష్ట్రంలో ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికలు 3 స్థానాలలో జరగడం, మన సంఘ పక్షాన 3 చోట్ల అభ్యర్థులను నిలపగా, శ్రీ గాదె శ్రీనివాసులు నాయుడు, ఉత్తరాంధ్ర నియోజక వర్గం నుండి 2వ సారి విజయం సాధించడం జరిగింది. శ్రీ పూల రవీందర్ గారు నల్గొండ, వరంగల్, ఖమ్మం నుండి ఏనాడు ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికల్లో ఎన్నడూ లేనివిధంగా రాజకీయపార్టీ బి-ఫాం ఇచ్చిన అభ్యర్థిని ఓడించి PRTU యొక్క స్థాయిని పెంచడం జరిగింది. శ్రీ బి. మోహన్ రెడ్డి గారు కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ నియోజకవర్గం నుండి పోటీ చేయగా, వారికి వ్యతిరేకంగా టి.ఆర్.ఎస్. బి-ఫాం ఇచ్చి అభ్యర్థిని నిలిపి తెలంగాణ సెంటిమెంట్‌ను ఉపయోగించి, ఎమ్మెల్యేలతో ప్రచారం చేసి, సంఘం బలంగా ఉన్నప్పటికీ వారిని ఓడించడం జరిగింది.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత పట్టభద్రుల స్థానాలకు రెండింటికి ఎన్నికలు జరగడం, మన సంఘం అభ్యర్థులను పోటీకి దింపకుండా, అధికార పార్టి టి.ఆర్.ఎస్.కు చెందిన అభ్యర్థి శ్రీ దేవీప్రసాద్ టిఎన్జీవోల అధ్యక్షులుగారికి, శ్రీ పల్లా రాజేశ్వర్ రెడ్డి గారికి మద్దతు ఇవ్వడం జరిగింది. శ్రీ పల్లా రాజేశ్వర్ రెడ్డి గారు నల్లగొండ, వరంగల్, ఖమ్మం నుండి విజయం సాధించడం మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు గారు "No TRS Victory without PRTU" అని వ్యాఖ్యానించడం మన ప్రాధాన్యత ఏమిటో తెలుస్తున్నది. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో శ్రీ దేవీ ప్రసాద్ గారు విజయం సాధించనప్పటికినీ, 6 జిల్లాల్లో సంఘ పిలుపు మేరకు కృషి చేసిన జిల్లా బాధ్యులకు ధన్యవాదాలు తెలుపుతున్నాం.

## 10వ PRC

1. మన సంఘ పక్షాన పట్టుబట్టి సాధించిన 43% ఫిట్‌మెంట్‌కు సంబంధించి G.O.Ms.No. 25, తేది. 18-3-2015 ద్వారా ఇచ్చారు. ఈ ప్రధాన ఉత్తర్వులో ఫిట్‌మెంట్‌తో పాటు మాస్టర్ స్కేలు 1-7-2013కు కానీ, 30-6-2014లోపు పొందిన ఇంక్రిమెంట్‌కు కానీ 6 నెలల లోపు ఆప్షన్ ఇచ్చే సౌకర్యం కల్పించారు. 32 గ్రేడులను కొనసాగిస్తూ కనీస పే రూ. 13,000/-గా, గరిష్ఠ పే రూ. 1,10,850/-గా ఇచ్చారు. ఒక టైం స్కేలులో గరిష్ట పే దాటిన వారికి 5 స్టాగ్నేషన్ ఇంక్రిమెంట్లను అనుమతించారు. కేటగిరి వారీగా ఇచ్చిన స్కేలులో SGT/LP/PET లకు 21,230-63,010గా, స్కూల్ అసిస్టెంట్‌లకు 28,940-78,910గా, MEO పోస్టు స్కేలును 1 గ్రేడ్ పెంచుతూ GHM -II తో సమాన స్కేలు 35,120-87,130గా, గత PRCలో GHM -IIతో సమానంగా ఉన్న Dy.EO స్కేలును 2 గ్రేడులు పెంచుతూ 40,270-93,780గా ఇచ్చారు. కొత్త వేతనాలు 1-7-2013 నుండి అమలులోకి వస్తూ, ఆర్థిక లబ్ది తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన రోజు నుండి ఇస్తూ తేది. 2-6-2014 నుండి 28-2-2015 వరకు బకాయిల కోసం ప్రత్యేక ఉత్తర్వుల ద్వారా ఇస్తామని తేది. 1-3-2015 నుండి నగదుగా ఇస్తామని తెలిపారు.

2. G.O.Ms.No.6, తేది. 18-6-2015 ప్రకారం HRA ను కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చే ప్రతి 1%కు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగలకు 0.524%ను ఇవ్వమని PRC సిఫారసు చేసిన విధంగా

అనుమతించింది. కానీ కేంద్ర ప్రభుత్వ వేతన స్థిరీకరణ 1-1-2016కు జరిగిన పిదప వారికి ఇచ్చే కరువుభత్యంపై ప్రతి 1%కు మనకు ఎంత శాతం పెంచాలో గణించి ప్రభుత్వానికి ప్రాతినిధ్యం చేయవలసి ఉన్నది.

3. ఇంటి అద్దె అలవెన్స్ కొరకు G.O.Ms.No. 27, తేది. 18-3-2015 ప్రకారం 30% HRA పొందుతున్న ఉద్యోగులకు గరిష్ఠ పరిమితిని రూ. 12,000/- నుండి రూ. 20,000/-లకు మిగతా ప్రాంతాలకు రూ. 8,000/- నుండి 15,000/-కు పెంచడం జరిగింది. మహబూబ్‌నగర్ పట్టణానికి HRA 14.5% నుండి 20%కు పెంచారు. మన రాష్ట్రశాఖ ప్రాతినిధ్యం చేసి కోదాడ, జనగాం పట్టణానికి 14.5% HRAను G.O.Ms.No. 88, తేది. 10-6-2015 ప్రకారం ఇప్పించనైనది.

4. CCAని G.O.Ms.No. 28, తేది. 18-3-2015 ప్రకారం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి మరియు ఇతర మున్సిపల్ కార్పొరేషన్లు అయిన కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్, రామగుండం, వరంగల్ నగరాలకు చెందిన ఉపాధ్యాయులకు వివిధ బేసిక్ పేలకు అనుగుణంగా 200 నుండి 1000 రూపాయలు వరకు చెల్లిస్తారు.

5. RPS విధానపరమైన సూచనల కోసం Memo No. 68/1/HRM.IV/2014, తేది. 4-4-2015లో ఏవిధంగా ఆప్షన్‌లు ఇవ్వాలో ఉదాహరణలతో వివరిస్తూ వేతన స్థిరీకరణకు అవసరమైన ఫాంలను ఇవ్వడం జరిగింది.

6. పెన్షనర్లకు సంబంధించిన పెన్షన్ స్థిరీకరణ ఉత్తర్వులను G.O.Ms. No.33, తేది. 7-4-2015లో బేసిక్ పెన్షన్‌పై 43% ఫిట్‌మెంట్‌ను స్థిరీకరణ అనంతరం పెన్షన్ పెరుగుదలను పట్టికల ద్వారా తెలిపారు. కనీస పెన్షన్‌ను రూ. 6500/-గా నిర్ణయించారు.

7. అప్రయత్న పదోన్నతి అమలు కోసం G.O.Ms. No.38, తేది. 15-4-2015 ప్రకారం ఇంతకుముందు ఉన్నవిధంగానే పదోన్నతి స్థిరీకరణలో SG లేదా SPP-IA మరియు SPP-IB పొందిన వారికి FR22-B ని కొనసాగించారు. సీనియర్ వేతనం జూనియర్ వేతనం కన్నా తక్కువ ఉంటే G.O.Ms. No.297, తేది. 25-10-1983లో ఉన్న షరతులకు లోబడి జూనియర్‌తో స్టెప్‌అప్ చేసుకునే అవకాశం కొనసాగించారు.

సర్వీసు రూల్స్‌లో ప్రమోషన్ అర్హతలలో మినహాయింపు ఉన్నట్లయితే అప్రయత్న పదోన్నతి అయిన SPP-IA/SPP-II కి వరిస్తుందని ఉంది. కానీ ఇదేవిధంగా RPS- 2010కి సంబంధించిన G.O.Ms. No.93 లో కూడా ఈ మినహాయింపుల గురించి ఉన్నా ఆర్థికశాఖవారు Memo No. 034408/248/PC.II/2011 ద్వారా 50 సం॥లు వయస్సు నిండినవారికి డిపార్ట్‌మెంటల్ పరీక్షలు పాస్ అవ్వాలనే నిబంధన నుండి మినహాయింపును అనుమతించలేదు.

8. అడ్వాన్స్‌లు, అప్పులకు సంబంధించిన G.O.Ms. No.39 తేది. 15-4-2015 ద్వారా జారీ చేశారు కానీ మనకు పండగ అప్పు మాత్రమే ఇస్తున్నారు. పండగ అప్పు రూ. 26,600-77,030 స్కేలులోపు ఉన్నవారికి 7500 ఇస్తారు. దీనిని తిరిగి 10 నెలల్లో సమాన వాయిదాలలో చెల్లించాలి. ఆప్కో నుండి బట్టల కొనుగోలుకు స్పెషల్ ఫెస్టివల్ అడ్వాన్స్‌కు అవకాశం కల్పించారు.

9. G.O.Ms. No.56 తేది. 2-5-2015 లో హెడ్‌మాస్టర్ అలవెన్స్‌లు మరియు హైస్కూల్ తరగతులు బోధించే SGT/LP Gr.II లకు ఇచ్చే అలవెన్స్‌లను పెంచుతూ మానిటరీ బెనిఫిట్‌ను 1-5-2015 నుండి అనుమతించారు.

10. లీవ్ ట్రావెల్ కన్సేషన్‌కు సంబంధించిన G.O.Ms. No.76 తేది. 13-5-2015 ప్రకారం సర్వీసులో ఒకసారి అత్యధికంగా 3500 కి.మీ. దేశంలో ఎక్కడికయినా వెళ్ళడానికి అవకాశాన్ని కొనసాగిస్తూ అత్యధిక చెల్లించే పరిమితిని రూ. 12,000/-నుండి 18,750/-కు పెంచారు.

11. G.O.Ms. No.99 తేది. 21-7-2015 ద్వారా రిటైర్‌మెంట్ గ్రాట్యుటీ పరిమితిని 8 లక్షల నుండి 12 లక్షలకు పెంచారు. మన రాష్ట్రశాఖ ప్రాతినిధ్యం చేసి గ్రాట్యుటీకి DA కలిపి గణించుకునేలా Memo No.9026-A/1882/A2/HRM.V/2015 తేది. 24-7-2015 ద్వారా ఇప్పించనైనది. రివైజ్డ్ గ్రాట్యుటీని తేది. 1-3-2014 నుండి 28-2-2015 మధ్యకాలపు ఎరియర్స్‌కి సంబంధించిన ఉత్తర్వులు ప్రత్యేకంగా జారీచేస్తారు.

12. G.O.Ms. No.100 తేది. 21-7-2015 ద్వారా పెన్షనర్‌లకు చెల్లించే నెలవారీ మెడికల్ అలవెన్స్‌ను రూ. 200/- నుండి రూ. 350/-కు పెంచారు. కానీ అడిషనల్ క్వాంటం పెన్షన్ ఇంతకుముందు ఉన్న విధానాన్ని కొనసాగించాలని చెప్పారు.

13. సర్వీస్ పెన్షనర్, ఫ్యామిలీ పెన్షనర్ చనిపోయిన సందర్భంలో ఇచ్చే రిలీఫ్‌ను G.O.Ms. No.101 తేది. 21-7-2015 ప్రకారం రూ. 20,000/-లకు పెంచడం జరిగింది. సర్వీసులో ఉన్నవారు చనిపోతే ఈ పెరిగిన రిలీఫ్‌కు సంబంధించిన ఉత్తర్వులు వెలువడాల్సి ఉన్నది.

14. అంధ మరియు శారీరక అంగవైకల్యం కలవారికి ఇచ్చే కన్వేయన్స్ అలవెన్స్ తేది. 1-7-2015 నుండి గరిష్టంగా రూ. 200/-కు G.O.Ms. No.103 తేది. 24-7-2015 ప్రకారం పెంచారు.

15. నాన్ గెజిటెడ్ ఉద్యోగుల పిల్లల ఫీజు రీయంబర్స్‌మెంట్‌ను G.O.Ms. No.27 తేది. 24-9-2015 ద్వారా రూ. 2500/-కు పెంచారు కానీ ఈ పెరుగుదల వర్తింపు 2015-16 అకడమిక్ సంవత్సరం నుండి వరిస్తుంది.

## ఇంకా విడుదల కావలసిన ఉత్తర్వులు

1. ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేసే ఉపాధ్యాయులకు కూడా AHRA వర్తించే విధంగా అనుబంధ ఉత్తర్వులు వెలువడాల్సివుంది. ఈ ప్రతిపాదనలు ఆర్థికశాఖ నుండి ముఖ్యమంత్రి వద్దకు వెళ్ళాయి. వారి ఆమోదం కొరకై 3నెలలుగా ఫైలు వారి కార్యాలయంలో కలదు.

2. సర్వీసులో ఉన్న ఉద్యోగులు చనిపోయిన సందర్భంలో ఇచ్చే డెత్ రిలీఫ్‌ను రూ. 20,000/-కు పెంచే ఉత్తర్వులు విడుదల కావలసి ఉన్నది.

3. అంధులైన ఉద్యోగులకు ఇచ్చే రీడర్ అలవెన్స్ ఉత్తర్వులు వెలువడాలి.

4. CPS ఉద్యోగులకు 10% మినహాయింపులో తేడాను సరిచేయాలి.

## GO లకు నోచుకోని PRC ప్రతిపాదనలు

1. పూర్తి పెన్షన్ పొందడానికి 33 సంవత్సరాల సర్వీసుకు తక్కువగా ఉన్నప్పుడు గత PRCలో మాదిరిగా 5 సంవత్సరాల వెయిటేజి ఇస్తున్నారు. దీన్ని PRC ప్రతిపాదించినట్లు 8 సంవత్సరాల వెయిటేజి వర్తించే ఉత్తర్వులు ఇవ్వాలి.
2. రిటైర్డ్ అయిన పెన్షనర్లు అడిషనల్ క్యాంటం పెన్షన్ పాత పద్ధతిన కాకుండా, PRC ప్రతిపాదించిన విధంగా ఇవ్వాలి.
3. కేంద్ర ప్రభుత్వం మహిళా ఉద్యోగులకు ఇస్తున్న 2 సంవత్సరాల చైల్డ్‌కేర్ సెలవులను, 10వ PRC ప్రతిపాదించినందున మన రాష్ట్ర మహిళా ఉద్యోగులకు వర్తించే ఉత్తర్వులు ఇవ్వాలి.

## PRC నివేదికలో పొందుపరచని అంశాలలో మనం కోరుతున్నది.

1. రిటైర్‌మెంట్ గ్రాట్యుటీ పరిమితిని 12 లక్షల నుండి 15 లక్షలు పెంచడం.
2. 9వ PRCలో సీనియర్‌లకు వేతన పెరుగుదలలో లబ్ది చేకూరనందున వెయిటేజి ఇంక్రిమెంట్లు మంజూరి.
3. 9వ, 10వ PRCలలోని అనామలీస్‌ను సరిచేయుటకు ఒక కమిటీని ఏర్పాటు చేయుట.

## PRC గూర్చి మాట్లాడుతున్న ఈ సందర్భంలో కొన్ని విషయాలను మీ ముందుంచుతున్నాము

ఈ మధ్యకాలంలో సమావేశాల్లో, గ్రామ సభల్లో ప్రజాప్రతినిధులు ఉపాధ్యాయులకు వేతనాలు ఎక్కువ అని మాట్లాడుతున్న సందర్భాలు ఎక్కువగా వినబడుతున్నవి. గౌరవ పెద్దలకు తెలియజేయునది ఏమనగా ఉపాధ్యాయులకైనా, ఉద్యోగులకైనా 5 సంత్సరాలకు ఒక్కసారి ఒక కమిటీని నియమించి పెరిగిన ధరల ప్రకారం నిర్ణయించే కరువుభత్యంను బట్టి వేతనాల పెంపు ప్రతిపాదనలు రూపొందిస్తారు. కానీ గ్రామాల్లో ఉపాధ్యాయులతో పాటు విలేజి సెక్రటరీలు ఉంటారు వారికి ఈ వేతన స్కేళ్ళు, ఈ జీతాలే వర్తిస్తాయి. నూతనంగా ఉద్యోగం పొందిన ఉపాధ్యాయుడు పొందే వేతనం రూ. 25 వేలు అన్న విషయాన్ని గుర్తించాలని కోరుతున్నాం. 32 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసిన వ్యక్తి వేతనం రూ. 80 వేలు ఉండదని, కలెక్టర్ వేతనం కూడా ఇంతలేదని ఉపాధ్యాయులకు ఇంత వేతనాలా! ఒక్కరి వేతనంతో 6గురు వ్యక్తులను నియమించవచ్చుననే మాటలు మాట్లాడి ఉపాధ్యాయులను అగౌరవ పరచడం చాలా విచారకరం, భావి భారత పౌరులను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే అని సమాజంలో సమస్యలు తలెత్తినప్పుడు మాట్లాడే నేతలు, విదేశాల్లో ప్రాథమిక స్థాయిలో పనిచేసే ఉపాధ్యాయుల వేతనాలు అందరి ఉద్యోగుల కంటే ఎక్కువ ఇచ్చి చక్కటి సమాజాన్ని తయారు చేయడానికి ప్రోత్సహిస్తారు. కానీ ఉపాధ్యాయులను నిందించి, అగౌరవ పర్చి, వారి విలువను తగ్గించడం వల్ల అనైతిక సమాజం నిర్మించబడుతుందనే విషయాన్ని మరవద్దు.

ఇదే సందర్భంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ జరగకముందు తెలంగాణ ప్రాంత ఉద్యోగి రూ. 150/– వేతనం పొందితే, ఆంధ్ర ఉద్యోగి రూ. 100/– వేతనం పొందేవాడు. ఆంధ్రప్రదేశ్ అవతరణ తరువాత ఇద్దరికి

సమాన వేతనంగా రూ. 100/- చెల్లించారు. నూతనంగా సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో వేతనాలు ఆంధ్రవారికంటే ఒకటిన్నర రెట్లు పెరుగుతుందని అనుకున్నాం. కానీ, ఇలాంటి ఈసడింపులకు గురికావడం దురదృష్టకరం. ఈ 10వ PRC అమలు సందర్భంగా గౌరవ ముఖ్యమంత్రి కె.సి.ఆర్. గారు అన్న మాటలను గుర్తు చేసుకుందాం. ఇది "ఎంప్లాయి ఫ్రెండ్లీ ప్రభుత్వం" అని మా టి.ఆర్.ఎస్. ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టినట్లు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమాన వేతనాలు ఇస్తాను కానీ ఆంధ్రోళ్ళ PRC మనకు అవసరమా? అన్నమాట నిజం చేస్తారని, చేయాలని కోరుతున్నాం. "అందుకే కేంద్ర ప్రభుత్వం జనవరి 2016 నుండి కేంద్ర ఉద్యోగులకు నూతన స్కేళ్లను వర్తింపచేయబోతున్నదని వారు పొందే వేతనాలకు సమానమైన వేతనాలు ఇవ్వాలని మిమ్మల్ని మా సంఘం కోరనున్నదని ఈ సమావేశ పక్షాన తెలియజేస్తున్నాం".

## PRTU వెబ్ సైట్

మన వెబ్‌సైట్ www.prtuts.org ద్వారా ఎప్పటికప్పుడు ప్రభుత్వ ఉత్తర్వులను, సర్కులర్ మెమోలతో పాటు, GPF, TSGLI వివరాలను అప్లికేషన్‌ఫాంలను అందుబాటులో ఉంచుతున్నాము. CPS గురించిన పూర్తి సమాచారంతో పాటు వారికి లాగిన్‌లో ఎదురవుతున్న సమస్యల పరిష్కారాలను వివరించాము. ఇందులో సందేహాలు-సమాధానాలు అనే సౌకర్యాన్ని కల్పించాము. ఏరోజుకారోజు సమాధానాలు శ్రీ యం. మోహన్ రెడ్డి గారు చెప్తున్నారు. వీరికి ప్రత్యేక కృతజ్ఞతలు. ఈ వెబ్‌సైట్ నిర్వహణను సాంకేతిక విభాగం ఛైర్మన్ శ్రీ పుట్ట శ్రీనివాస్ రెడ్డి చూస్తున్నారు. వీరు వేతన స్థిరీకరణకు ట్రెజరీవారు ఏర్పాటు చేసిన సాఫ్ట్‌వేర్‌లో కలుగుతున్న ఇబ్బందులు, పరిష్కారాలను తెలియజేయగానే మేము ప్రాతినిధ్యం చేసి ఉద్యోగ, ఉపాధ్యాయులకు సౌకర్యవంతంగా చేయడం జరిగింది.

## సుప్రీంకోర్టు తీర్పు - సర్వీస్ రూల్స్

సెప్టెంబర్ 16, 17, 23 తేదీలలో వాదనలు జరిగి పంచాయతీరాజ్ ఉపాధ్యాయ పక్షాన చారిత్రాత్మకమైన తీర్పు సెప్టెంబర్ 30న సుప్రీంకోర్టు వెలువరించింది. తుది తీర్పులోని అంశాలు 1. గతంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ ప్రభుత్వం వేసిన స్పెషల్ లీవ్ పిటీషన్‌ను కొట్టివేయడం జరిగింది. 2. మండల, జిల్లా పరిషత్‌లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ప్రభుత్వ ఉపాధ్యాయులే. 3. హైకోర్టు పంచాయతీరాజ్ ఉపాధ్యాయ పోస్టులు లోకల్ క్యాడర్‌గా ఆర్గనైజ్ చేయనందున కామన్ సర్వీస్ రూల్స్ రూపొందించుకోరాదు అన్నందున, కేంద్ర ప్రభుత్వాన్ని ఈ పోస్టును లోకల్ క్యాడర్‌గా ఆర్గనైజ్ చేస్తూ రాష్ట్రపతి ఉత్తర్వులు త్వరగా ఇవ్వాలని కోరింది.

ఈ తీర్పులో మొదటి అంశాన్ని ప్రభుత్వ ఉపాధ్యాయులు తమ విజయంగా చెప్పుకున్నారు. కానీ తదుపరి 2 అంశాలు పంచాయతీరాజ్ టీచర్ల గురించి అన్న విషయాన్ని మరిచి తప్పుడు ప్రచారం చేస్తున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రాష్ట్రపతి ఉత్తర్వులు పొందాలన్న అవసరాన్ని అత్యున్నత ధర్మాసనం తెలిపింది.

సుప్రీంకోర్టులో వాదనలు జరుగుతున్న సందర్భంలో మన సంఘ పక్షాన రాష్ట్ర అధ్యక్షులు శ్రీ పి. వెంకట్ రెడ్డి గారు, ఎమ్మెల్సీ శ్రీ పూల రవీందర్, మాజీ ఎమ్మెల్సీ, AITO ఛైర్మన్ శ్రీ బి. మోహన్ రెడ్డి గారు ఢిల్లీ

వెళ్ళడం జరిగింది. తేది. 22-9-2015న కేంద్ర మంత్రి శ్రీ ఎం. వెంకయ్య నాయుడు గారిని కలిసి సంఘ పక్షాన పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు ఏకీకృత సర్వీసు రూల్స్ రూపొందించాలని కోరుతూ ప్రాతినిధ్యం చేయడం జరిగింది. తేది. 23-9-2015న సుప్రీం కోర్టులో ఏకీకృత సర్వీస్ రూల్స్ పై వాదనలు జరుగుతున్న సందర్భంలో మన సంఘ ప్రతినిధుల బృందం హాజరు కావడం జరిగింది.

తెలంగాణ రాష్ట్రం నూతన రాష్ట్రం కాబట్టి మన రాష్ట్రానికి వర్తిస్తున్న 371-డి ప్రకారం కొత్త సర్వీసు రూల్స్ రూపొందించుకొను అవకాశం కలదు. ఈ అవకాశం మేరకు జూన్ 02, 2014న ఏర్పడిన మన రాష్ట్రం, మన ప్రభుత్వం, మన ముఖ్యమంత్రి శ్రీ కె.సి.ఆర్. గారిని జూన్ 26, 2014న ఉపాధ్యాయ సంఘాల పక్షాన కలిసి సర్వీస్ రూల్స్ రూపొందించాలని కోరగా, ఒక పేజీలో తీసుకోండి, వ్యతిరేకిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులతో మాట్లాడుతానని తెలిపిన విషయాన్ని గుర్తుచేస్తున్నాం. సంఘం ఒత్తిడి మేరకు ఒక కమిటీని వేసి ఫైలు సిద్ధం చేసి, న్యాయ నిపుణుల సలహా తీసుకొని, సర్వీస్ రూల్స్ రూపొందించుటకు అభ్యంతరాలు లేవన్న సందర్భంలో ముఖ్యమంత్రి గారి వద్దకు పంపడం జరిగింది. సుప్రీంకోర్టు తీర్పు వస్తున్న సందర్భంలో అసెంబ్లీ శీతాకాల సమావేశాలు జరుగుతుండడం మన ఎమ్మెల్సీలు, మన సంఘ పక్షాన అసెంబ్లీలో తీర్మానము చేయాలని విద్యాశాఖామంత్రి, శాసనసభా వ్యవహారాల మంత్రిని కోరడం, శాసనమండలిలో విద్యాశాఖామంత్రి సర్వీస్ రూల్స్ రూపొందిస్తామని చెప్పడం జరిగింది. సుప్రీంకోర్టులో వాదనలు జరుగుతున్న సందర్భంలో శ్రీమతి రంజీవ్ ఆచార్య గారిని మన రాష్ట్ర సంఘ పక్షాన అడ్వకేట్‌ను నియమించాలని కోరగా పి.పి. రావుగారికి తోడుగా, పి. వెంకట్ రెడ్డి గారిని నియమించడం జరిగింది. తీర్పు వెలువడిన తరువాత ఒక కమిటీని నియమించాలని కోరడం, ఎమ్మెల్సీల సహకారంతో విద్యామంత్రి గారిని పలుమార్లు కలవడంతో అక్టోబర్ 14న రాష్ట్ర అధ్యక్షులు వెంకట్ రెడ్డి గారి సన్మాన సభలో శ్రీ కడియం శ్రీహరిగారు సర్వీసు రూల్స్ రూపొందిస్తానని హామీ ఇవ్వడం కొంత సంతోషాన్నిచ్చింది.

ఒక ప్రత్యేక కమిటీని నియమించుకొని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇప్పటికే అసెంబ్లీలో తీర్మానం చేసి, ఫైలు కేంద్ర హోంశాఖకు పంపడం, వీలైనంత త్వరగా సర్వీస్ రూల్స్ రూపొందించడానికి సన్నాహాలు జరుగుతున్నవి.

సర్వీస్ రూల్స్ రూపొందించి పర్యవేక్షణాధికారుల పోస్టులు MEO, Dy.EO లతోపాటు DIET, JL పోస్టుల భర్తీ చేయమని కోరితే మన సర్కారు MEOకు బదులు SIతో Dy.EOకు బదులు CIతో పర్యవేక్షణ చేయించాలనే నిర్ణయం దురదృష్టకరం. గత నివేదికలో విద్య యొక్క ప్రాధాన్యతను తెలుపుతూ, ప్రపంచ జనాభాలో 2వ స్థానాన్ని ఆక్రమించిన మనదేశాన్ని నియంత్రించగలిగేది మొదటిది విద్యని, 2వది విభిన్న మతాలు, భాషలతో కూడిన భక్తి సంస్కృతి అని, 3వది పై రెండింటికీ అతీతులైన వ్యక్తులను నియంత్రించేది హోంశాఖ (పోలీసులు). కానీ పోలీసులను పాఠశాలలపై నిఘా ఉంచే దుస్థితి రావడం విచారకరం.

## పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు అర్థవేతన సెలవులను నగదుగా పొందు ఉత్తర్వులు

స్థానిక సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులం అనే నెపంతో డిసెంబర్ 2012లో విద్యాశాఖ కార్యదర్శి గారు ఒక మెమోను ఇచ్చి పంచాయతీరాజ్, ఎయిడెడ్ ఉపాధ్యాయులు పదవీ విరమణ అనంతరం 300 రోజుల అర్థవేతన సెలవులను నగదుగా మార్చుకొను అవకాశం లేదని ఉత్తర్వులు ఇవ్వడం జరిగింది. ఇది అన్యాయమని ఆనాటి ఉమ్మడి ప్రభుత్వాన్ని, ఈనాటి తెలంగాణ ప్రభుత్వాన్ని కోరగా పంచాయతీరాజ్, ఎయిడెడ్ ఉపాధ్యాయులకు ఈ సౌకర్యాన్ని పునరుద్ధరిస్తూ జి.వో. 109 తేది. 29-07-2015 విడుదల చేయడం జరిగింది. 10వ PRCకి

సంబంధించిన ఈ ఉత్తర్వులో PR ఉపాధ్యాయులకు 9వ PRCలో అమలు తేది. 1-9-2010 నుండి ఇవ్వడం జరిగింది. దీనితో సంవత్సరానికి 6 ELs పొందే ఉపాధ్యాయ వర్గం సుమారు 4 లక్షల మొత్తాన్ని పదవీ విరమణ సందర్భంలో పొందగలుగుతున్నాం.

## పాఠశాలల పనివేళల మార్పు

తెలంగాణ రాష్ట్రంలో విద్యాపరంగా అభివృద్ధి అనేది ఉపాధ్యాయులను ఎక్కువ పనిచేయిస్తే సాధ్యమవుతుందనే ఉద్దేశ్యంతో గత విద్యాసంవత్సరం పాఠశాలల పనివేళలను ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4:30 వరకు మార్పు చేయడం జరిగింది. మన సంఘ పక్షాన దీన్ని వ్యతిరేకించడం, కొన్ని సంఘాలు ప్రైవేట్ పాఠశాలలకు ఉదయం 7 గంటలకు వెళ్ళగా ఇంకా ముందుగా ప్రారంభించండి అల్పాహారము, పాలు, బిస్కెట్లు ఇవ్వండి అని కోరడం జరిగింది. ప్రైవేట్ పాఠశాలలకు ఉదయాన్నే వెళ్ళి ఏం చేస్తున్నారో అన్న అంశాన్ని చర్చించాం. మధ్యాహ్న భోజనంలో నాణ్యత, పోషకాలతో కూడిన ఆహారం అందించబడుతున్నదా? ఇక అల్పాహారము, పాలు అందించగలుగుతామా ఒకసారి ఆలోచించండి.

మార్చిన పనివేళలతో విద్యార్థుల హాజరు ప్రార్థనా సమయంలో తగ్గడం, దీనిని మార్పు చేయాలని మంత్రి, అధికారులను కోరగా ఉదయం 9:30 నుండి సాయంత్రం 5:00 గంటల వరకు ఉన్నత, ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4:30 వరకు ప్రాథమికోన్నత, ఉదయం 9:00 నుండి సాయంత్రం 4:00 గంటల వరకు ప్రాథమిక పాఠశాలల పనివేళలు మార్చడం జరిగింది. భోజన విరామంలో 1 గంటలో 10 నిమిషాలు, ప్రార్థన 15 నిమిషాల సమయంలో 5 నిమిషాల చొప్పున తగ్గించి సాయంత్రం 15 నిమిషాల తగ్గింపుకు మంత్రి, అధికారులను ఒప్పించడం జరిగింది. త్వరలో ఉత్తర్వులు వెలువడనున్నాయి. హైదరాబాద్ గ్రేటర్ మున్సిపాలిటీ పరిధిలో గల రంగారెడ్డి జిల్లాలో పాఠశాలల పనివేళలు మార్చిన విధంగా కాకుండా పాత పనివేళలు కొనసాగించేలా ఉత్తర్వులు ఇప్పించుటకు కృషి చేసిన ఎమ్మెల్సీ శ్రీ కె. జనార్ధన్ రెడ్డి గారికి కృతజ్ఞతలు.

## రేషనలైజేషన్ - బదిలీలు, పదోన్నతులు

మహాధర్నా ఫలితంగా ఏశాఖలో చేపట్టని బదిలీలు, పదోన్నతులు మన విద్యాశాఖలో చేపట్టుటకు నిర్ణయించడం జరిగింది. ఈ ప్రభుత్వం ఏర్పడిన మొదటి నుండి ఉపాధ్యాయుల సంఖ్య ఎక్కువగా నున్నది. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్నది. DSCల అవసరమే లేదంటూ, రేషనలైజేషన్ చేయుటకు జి.వో.నెం. 6ను తేది.27-9-2015న విడుదల చేయడం జరిగింది. విద్యా సంవత్సరం మధ్యలో వద్దని జి.వోలో సవరణలు కావాలని మన సంఘం TTJAC పక్షాన ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంతో తాత్కాలికంగా నిలిపివేసి, జూన్ నెలలో పాఠశాలలు ప్రారంభమైన తరువాత రేషనలైజేషన్ జి.వో. 11ను తేది. 15-6-2015ను, జి.వో. నెం. 6కు కొన్ని మార్పులతో విడుదల చేసి, జి.వో.12 తేది. 16-6-2015 ప్రకారం బదిలీలు, పదోన్నతులు జూన్, జులై నెలలో జరుపుటకు షెడ్యూల్ విడుదల చేయడం జరిగింది. జి.వో. 11, 12లను సవరించాలని మంత్రిగారిని, విద్యాశాఖ అధికారులను కోరగా జి.వో. 11లో 0-30కి ఒక ఉపాధ్యాయుడు ఉండటాన్ని సవరించి 0-19కు ఒకరు, 20-60కు ఇద్దరు ఉండునట్లు జి.వో. 17 తేది.27-06-2015ను, జి.వో.12లో పదోతరగతి ఫలితాలు 25%లోపు ఉన్నవారిని తప్పనిసరిగా బదిలీ ఉపసంహరింపజేసి, జి.వో.16 తేది 27-06-2015ను సాధించి కౌన్సిలింగ్ ప్రక్రియ ప్రారంభించడం జరిగింది. స్పౌజ్ కేటగిరి విషయంలో మార్పు, ఖాళీలను నిర్ణయించడం సరిగా జరుగక పూటకో మార్పు ఉత్తర్వు ఇవ్వడంతో గందరగోళ పరిస్థితులు ఏర్పడి ప్రక్రియ విమర్శలకు

దారితీసింది.

అవకతవకలు జరగడంతో వరంగల్, మెదక్ DEOలను సస్పెండ్ చేయడం జరిగింది. రేషనలైజేషన్ తరువాత కూడా మిగులు ఉపాధ్యాయులు ఉన్నారని చెప్తూ వచ్చిన ప్రభుత్వం రేషనలైజేషన్ తదుపరి ఉపాధ్యాయుల అవసరం ఉండడంతో మళ్ళీ జి.వో.6 ప్రకారము వర్క్ అడ్జెస్ట్‌మెంట్ అమెండ్‌మెంట్‌కు సిద్ధం కావడం, మహబూబ్‌నగర్ జిల్లా గట్టు మండల విద్యార్థులు హైకోర్టు న్యాయమూర్తికి లేఖలు వ్రాయడంతో హైకోర్టు జోక్యం చేసుకొని అధికారులను మందలిస్తే 8 వేల మంది అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించడం జరిగింది.

మొత్తం మీద పిల్లలు లేరనే సాకుతో ఉపాధ్యాయుల సంఖ్య తగ్గించే శ్రద్ధ, పిల్లలున్న పాఠశాలలకు ఉపాధ్యాయులను ఇవ్వడంలో దృష్టి సారించలేదు. ఇంగ్లీషు మీడియం ప్రారంభించాలని కోరుతూ ఉంటే రాష్ట్రవ్యాప్తంగా సుమారు 700 ఆంగ్ల మాధ్యమ సెక్షన్లను ఉన్నత పాఠశాలల్లో మూసివేయడం జరిగింది. 151కు పైన ఉంటేనే LFL HM లను ఉంచుతామని, ఖాళీగా ఉన్న పోస్టులకు పదోన్నతులు లేవని ఉత్తర్వులు ఇవ్వగా అధికారులతో మాట్లాడి పిల్లల సంఖ్యతో నిమిత్తం లేకుండా ఖాళీగా నున్న LFL HM పోస్టులు అన్నింటికి పదోన్నతులు ఇప్పించడం జరిగింది.

## 2013-15లో బదిలీ పొందిన ఉపాధ్యాయుల రిలీవింగ్

2013లో బదిలీ పొంది గత 2 సం॥లుగా పాత పాఠశాలలో పనిచేస్తున్నవారిని రిలీవ్ చేయాలని జి.వో.12లో అవకాశము కల్పించినప్పటికీ, మళ్ళీ పాత పాఠశాలల్లో పనిచేయాలని కోరడం, వారిని రిలీవ్ చేయాలని ఎన్నో ఒత్తిళ్లు చేయగా C&DSE లేఖ నెం.1848 తేది. 8-10-2015 ప్రకారం ఉత్తర్వు ఇచ్చినప్పటికి అందులో స్పష్టత లేని కారణంగా 2013, 2015లో బదిలీ పొందిన ఉపాధ్యాయులు ఇంకా కొంతమంది ఉపాధ్యాయులు రిలీవ్ కాకుండా ఉన్నారని, ఈ విషయంలో స్పష్టమైన ఉత్తర్వులు ఇవ్వాలని డైరెక్టర్ గారిని కోరడం జరిగింది. అందరినీ రిలీవ్ చేయిస్తామని హామీ ఇస్తున్నాం.

## పాస్‌పోర్ట్ పొందుటకు NOC జారీ అధికారాలు DEOలకు

గతంలో ఉపాధ్యాయులు పాస్‌పోర్ట్ పొందాలంటే 'నో అబ్జెక్షన్ సర్టిఫికెట్' C& DSE నుండి పొందాల్సివచ్చేది. ఈ విధానం DEO, DSE కార్యాలయాల్లో జాప్యం, అవినీతికి కారణమవుతున్నాయని గమనించి NOC జారీ అధికారం GHM లకు RJD, ఇతర ఉపాధ్యాయులకు DEO ఇచ్చునట్లు C&DSE Proc.Rc. No. 212/1తేది. 26-2-2015 ప్రకారము ఇప్పించనైనది.

విదేశాలకు (Abroad) వెళ్ళేటప్పుడు మాత్రం అనుమతి 3 నెలల వరకు DSE, 6 నెలల వరకు అయితే ప్రభుత్వం నుండి పొందాల్సివుండేది. ఈ విధానాన్ని మార్పు చేయిస్తూ 6 నెలల వరకు DSE ఇచ్చునట్లు ప్రభుత్వ మెమో నెం.4013 తేది.30-12-2014 ఇప్పించనైనది.

## GPF మంజూరి అధికారాలు MEO, GHM లకు

జి.వో. 447 తేది.28-11-2015 ప్రకారం GPF అడ్వాన్స్‌లు, పార్ట్‌ఫైనల్, ఫైనల్ పేమెంట్ మంజూరి అధికారాలను MEO/GHM లకు ఇవ్వడం జరిగింది. జి.వో.నెం. 40 ప్రకారం MEO/GHM లకు పెన్షన్ మంజూరు చేసే అధికారాలు కల్గియున్నప్పుడు మనం పోదుపు చేసుకొన్న GPF క్లెయిం అధికారాలు జడ్పీ నుండి తొలగించాలని మన రాష్ట్ర సంఘ అధ్యక్షులు శ్రీ పి. వెంకట్ రెడ్డి గారు పట్టు పట్టడంతో ఈ ఉత్తర్వులు వెలువడినవి.

ఈ ఉత్తర్వులు అమలు కావాలంటే GPF ఖాతాలను ఆన్‌లైన్ ఉంచి నిర్వహణ ట్రెజరీలలోకి మార్చాలి. GPF ఖాతాల ఆన్‌లైన్‌లో గత రెండు సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్రంలోని 10 జిల్లాల్లో సగం జిల్లాల్లో మాత్రమే ఈ ప్రక్రియ పూర్తికాకపోవడంలో జడ్పీ సిబ్బంది నిర్లక్ష్యాన్ని తెలుపుతుంది. ఆయా జిల్లాశాఖలు జడ్పీ CEOలతో తక్షణమే సమావేశమై ఆన్‌లైన్ కార్యక్రమాన్ని 3 నెలల్లో పూర్తి చేయుటకు కృషి చేయాలని కోరుతున్నాం. పూర్తయిన జిల్లాల్లో 2 రోజుల్లో అడ్వాన్స్‌లు, పార్ట్‌ఫైనల్, పదవీ విరమణ రోజున ఫైనల్ పేమెంట్ పొందుచున్న విషయాన్ని గుర్తు చేస్తూ, వీలైనంత త్వరగా ట్రెజరీలకు మార్చడానికి కృషి చేసి జి.వో అమలుకు ప్రయత్నిద్దాం. నిజామాబాద్ జిల్లాశాఖ ఉపాధ్యాయుల GPF ఖాతాదారులకు ప్రభుత్వం చెల్లించాల్సిన వడ్డీ గత కొన్ని సంవత్సరాలుగా జమ చేయక బకాయిపడ్డ రూ. 85 కోట్ల మొత్తాన్ని జమ చేయుటకు CEO నుండి పంచాయతీరాజ్ విభాగానికి పంపించిన వివరాలతో రాష్ట్ర సంఘం ప్రాతినిధ్యం చేయడం జరిగింది. ఈ మొత్తాన్ని జమ చేయుటకు ఎమ్మెల్సీలు శ్రీ కె. జనార్ధన్ రెడ్డి, శ్రీ పూల రవీందర్, మాజీ ఎమ్మెల్సీ శ్రీ బి. మోహన్ రెడ్డి, AITO ఛైర్మన్ గారల సహకారంతో కృషి చేస్తున్నాం.

## అన్ని ఉన్నత పాఠశాలలకు SA తెలుగు, హిందీ, PD పోస్టులు మంజూరు చేయాలి

గత దశాబ్దకాలంగా ఒకే పని, ఒకే పోస్టు అని, ఉన్నత పాఠశాలల్లో Gr.II తెలుగు, హిందీ, PETలతో వెట్టిచాకిరీ చేయిస్తున్న విధానానికి స్వస్తిపలకాలని కోరడం జరుగుతున్నది. ఈ డిమాండ్‌ను అనుసరించి పాఠశాల విద్యాశాఖ మొత్తం Gr.II తెలుగు, హిందీ, PETల వివరాలను సేకరించడం జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం 8730 Gr.II పోస్టుల్లో, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 1868 పోగా ఉన్నత పాఠశాలలకు 6862 SA తెలుగు, హిందీ 2253 PD పోస్టులను మంజూరి చేయాల్సివున్నది. మంత్రిగారు అధికారుల హామీ మేరకు త్వరలో SA తెలుగు, హిందీ, PD పోస్టుల మంజూరి జరుగుతుందనే విశ్వాసాన్ని ప్రకటిస్తున్నాం. పదోన్నతుల జి.వో. 11,12 లలో మార్పు విషయంలో డిగ్రీలో కంటెంట్ తప్పనిసరి అనేవిధంగా సవరణలు తీసుకొని వచ్చి

## స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్లు

వివిధ DSCల ద్వారా 1984 నుండి నియామకమైన స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని ఆనాటి, ఈనాటి ప్రభుత్వాలను కోరడం జరుగుతున్నది. ఈ విషయంలో విద్యాశాఖ తెప్పించిన వివరాల ప్రకారం రూ. 398/- 1 సం॥లోపు రెగ్యులర్ స్కేలు పొందిన 1447 గురు, 2 సంవత్సరాలలోపు వారు 4537 గురు, 3 సంవత్సరాల వారు 2915 గురు, 4 సంవత్సరాల లోపువారు 1080, 5 సంవత్సరాల లోపు వారు 840 మందితో కలిపి తెలంగాణ రాష్ట్రంలో మొత్తం స్పెషల్ టీచర్ల సంఖ్య 11363గా తేలింది. వీరిలో 5 సంవత్సరాల వరకు పనిచేసినవారిలో పండిట్, PET లు ఎక్కువగా కలరు. నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరి చేస్తామన్న హామీ గౌరవ ముఖ్యమంత్రి కె.సి.ఆర్.గారు మాట ఇచ్చినందున త్వరలో మంజూరికి కృషి చేస్తున్నాం.

## 2003 DSC ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపు

2003లో DSC జరిగి, నియామకాలు 1-9-2004లో తరువాత జరగడం వల్ల, వీరందరికీ కొత్త పెన్షన్ విధానం CPS వర్తిస్తున్నది. నోటిఫికేషన్ విడుదల చేసిననాడు CPS విధాన ప్రస్తావన లేదు. కాబట్టి, న్యాయపరంగా ఈ DSC ద్వారా నియామకమైన సుమారు 6 వేల మంది ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం వర్తింపచేయాలని కోరుతున్నాం. అధికారులు "మహాధర్నా" సందర్భంగా తెలిపినట్లు ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించే విధంగా కృషి చేస్తున్నాం.

## CPS విధానాన్ని రద్దు చేయాలి

1-9-2004 తరువాత అమలవుతున్న CPS విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరడం జరిగింది. రద్దు కోసమై సంఘ పక్షాన కృషి చేస్తామని తెలియజేస్తున్నాము.

## CPS ఖాతాల నిర్వహణ

కాంట్రిబ్యూటరీ పెన్షన్ పొందుతున్న ఉద్యోగుల DA, PRC, నోషనల్ ఇంక్రిమెంట్లు, ఎరియర్స్ CSS ఖాతాలో జమ చేయడం జరిగింది. ఈ మొత్తాల నుండి 10% CPS ఖాతాలను జమ చేస్తూ మిగిలిన 90% బకాయిలను నగదుగా చెల్లించునట్లు జి.వో. నెం. 22, తేది. 22-1-2013ను విడుదల చేయించనైనది. CPS ఖాతాలకు ప్రతి నెలా ఉద్యోగి నుండి మినహాయించుతున్న 10% మొత్తాలను, దానికి సరిపడా మొత్తాలను ప్రభుత్వం జమ చేసే విధంగా కృషి చేయుట జరిగింది. CPS ఖాతాలనుండి అడ్వాన్సులు పొందుటకు అవకాశం కల్పించనైనది.

10 PRCలో కొత్త పెన్షన్ వారికి CPS డిడక్షన్‌ని తప్పుగా చేస్తున్నందున ఏవిధంగా చేయాలో ఉదాహరణల ద్వారా వివరిస్తూ అందించిన సమాచారంతో ట్రెజరీవారిని ఒప్పించి ఆర్థికశాఖకు లేఖ వ్రాయించి ఆర్థికశాఖ అధికారులను ఒప్పించి, లేఖ నెం. 509, తేది. 3 -6 -2015 ప్రకారం రూ. 70 కోట్లు CPS ఖాతాలలో 9 నెలల ఎరియర్స్ చెల్లించే సందర్భంలో జమ చేయుటకు నిర్ణయించనైనది.

1-9-2004కు ముందు నియామకమైనప్పటికీ CPS విధానంలో కొనసాగుతున్న ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం వర్తింపచేస్తూ , GPF ఖాతాలను తెరచి వారి CPS, CSS ఖాతాలలోని మొత్తాలను జి.వో.నెం. 336, తేది. 20-12-2012 ప్రకారం GPF ఖాతాలలో జమ చేయించనైనది.

## హెల్త్‌కార్డులు

ఉమ్మడి రాష్ట్రంలో విడుదలైన విధి విధానాలు జి.వోలు. 175, 176, 177లకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గత నవంబర్ 1న ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్లకు జారీ చేయడం జరిగింది. కానీ, ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులలో చికిత్సలు జరగకపోవడం, ఆసుపత్రుల యాజమాన్యాలు ప్యాకేజీ రేట్లను మార్చాలని కోరడం, ప్రభుత్వంతో అంగీకారం కుదరకపోవడం, అయినప్పటికీ ప్రభుత్వం ఓ.పి. సేవలను ప్రారంభిస్తున్నట్లు ఉద్యోగులతో దాగుడుమూతలు ఆడుతున్నది. రాష్ట్ర రాజధాని లో 12 కార్పొరేట్ హాస్పిటల్స్‌లో చికిత్సలు జరపడం లేదు. ప్రభుత్వం ఆర్థిక భారానికి ఇబ్బంది పడుతున్న సందర్భంలో నెల నెలా ప్రీమియం లేని ఉచిత కార్డులు వద్దు, ఉపాధ్యాయుల పక్షాన గెజిటెడ్ రూ. 200, నాన్ గెజిటెడ్ రూ. 150 చెల్లించడానికి సిద్ధంగా ఉన్నామని తెలియజేయడం జరిగింది. త్వరలో ప్రీమియం చెల్లింపుకు ప్రభుత్వాన్ని ఒప్పించి ఈ పథకాన్ని కార్పొరేట్ ఆస్పత్రులలో అమలు అగునట్లు కృషి చేయగలము.

## మెడికల్ రీయంబర్స్‌మెంట్

హెల్త్‌కార్డుల ద్వారా చికిత్సలు జరగని కారణంగా పాత రీయంబర్స్‌మెంట్ విధానాన్ని కొనసాగించాలని, ప్రతిసారీ ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేయగా ఈ డిసెంబర్ వరకు క్లెయిం పొందు అవకాశం కలదు. ఒకవేళ 12 కార్పొరేట్ హాస్పిటల్స్‌లో కార్డుల ద్వారా చికిత్సలు జరుపనట్లయితే ఈ విధానాన్ని ఇంకా కొనసాగించడానికి ప్రభుత్వాన్ని కోరాల్సి వస్తుంది. ఈ విధానంలో రూ. 50 వేల బిల్లులు జిల్లాలో, ఆపై బిల్లును DSE పంపించాలి. ఒకే వేళ GHM బిల్లు అయితే Dy.EO ద్వారా DSE కి పంపించాలి. కాని కొన్ని జిల్లాల్లో ఈ విధానాన్ని అర్థం

చేసుకోకుండా DEO కార్యాలయాల ద్వారా పంపుతున్నారు. ఇది అనవసరమైన జాప్యానికి కారణమవుతున్నది. జిల్లాల బాధ్యులు గమనించాల్సిందిగా కోరుతున్నాం. ప్రతి బిల్లుతో జన్యూనిటీ సర్టిఫికెట్ హాస్పిటల్ నుండి పొంది తప్పనిసరిగా జతచేయాలి.

DSE నుండి మెడికల్ బిల్లుల మంజూరి విషయంలో ప్రత్యేక దృష్టి సారించడం వల్ల గతంలో 1 సంవత్సరంనకు మంజూరి అయ్యే బిల్లులు 4 నెలల్లో మంజూరి అగునట్లు చర్యలు చేపట్టనైనది. DSEలో మెడికల్ విభాగానికి కావలసిన సిబ్బందిని పెంచుటకు మరియు DME ఉద్యోగుల కొరత ఉందని అక్కడి అధికారులు తెలుపగా మన DSE నుండి ఇద్దరు ఉద్యోగులను అచ్చటికి డిప్యుటేషన్‌పై పంపడంతో బిల్లుల మంజూరి వేగంగా జరుగుతున్నది.

## నూతన మూల్యాంకన విధానము

దేశంలో అన్ని రాష్ట్రాల కంటే ముందుగా CCE విధానం అమలు చేసిన రాష్ట్రం మన రాష్ట్రం అని అంటుంటే, ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో QIP, CLIP, CLAPS, LEP కార్యక్రమాలు తెచ్చి అక్షరాస్యతలో వెనుకుంచి, ప్రభుత్వ విద్యారంగాన్ని పతనం చేసినారు తప్ప సాధించింది ఏమీ లేదు. CCE విధానంతో ఏమి ఫలితాలు సాధిస్తామనేది కాలం నిర్ణయిస్తుంది. CCE అమలు జరగాలంటే పాఠశాలల్లో ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, ఇంటర్‌నెట్ సౌకర్యంతో కంప్యూటర్లు ఉండాలి. విద్యార్థులకు తల్లిదండ్రుల సహకారం ఉండాలి. మూల్యాంకనం విధానంలో మార్పు అని నాన్ డిటెన్షన్ విధానాన్ని కోరుకునే వారంతా 5, 10 వ తరగతి వార్షిక పత్రాలను దిద్దించినట్లు, పాఠశాల స్థాయిలో నిర్వహించే సమ్మేటివ్ టెస్ట్ 1 మరియు 2 పరీక్షల జవాబు పత్రాలు ప్రక్క పాఠశాలలో దిద్దించి ఏమి సాధిస్తారు. బోధించే ఉపాధ్యాయులచే ప్రశ్నా పత్రాన్ని రూపొందించి మూల్యాంకనం చేసి, పిల్లవాన్ని తీర్చిదిద్దడమే సరైంది తప్ప కొందరి ఆలోచనలను బలవంతంగా రుద్దడం సరైంది కాదని తెలుపుతున్నాం. కేంద్రంలో గల ప్రభుత్వం నియమించిన బక్కల్ కమిటీ CCE విధానంతో ప్రమాణాలు దెబ్బతింటున్నాయి అన్న విషయాన్ని గమనించాలని కోరుతూ, ఈ విధానం అమలులో ఉపాధ్యాయుడు నివేదికలను పూరించడానికే సమయం సరిపోతుంది.

ఉపాధ్యాయునిపై ఒత్తిడి పెంచి, ఎక్కువ సమయం పనిచేస్తేనే విద్యా ప్రమాణాలు పెరుగుతాయనే అధికారుల ధోరణి సరైంది కాదు. లెసన్ ప్లాన్స్, బోధనోపకరణాలు తయారు చేయిస్తే సరిపోదు. విద్యా ప్రమాణాలు సాధించలేకపోవడానికి సవాలక్ష కారణాలున్నాయి. వాటిపై దృష్టి సారించాలని కోరుతున్నాం.

ఉన్నత పాఠశాలల్లో 6 నుండి 10వ తరగతుల గణిత, భౌతిక శాస్త్రాల బోధన విషయంలో SA గణితం, ఫిజికల్ సైన్స్ టీచర్లకు పనిభార విభజన విషయంలో తలెత్తిన సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నాము.

## మధ్యాహ్న భోజన పథకము

పాఠశాలలో నిర్వహించబడుతున్న మధ్యాహ్న భోజన పథకంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు వర్ణణాతీతం. వంట ఏజెన్సీలపై అజమాయిషీ చేసే అధికారం లేకపోవడం, వారికి నెల నెల బిల్లులు అందకపోవడం వంటి కారణాలు, సన్నబియ్యం పంపిణీ జరుగుతున్నప్పటికీ వారానికి రెండు గుడ్లు తప్పనిసరి అన్నప్పుడు ఏజెన్సీలు గిట్టుబాటు కాదని చేతులెత్తేయడం జరుగుతున్నది. ఈ పథకము నుండి ప్రధానోపాధ్యాయులను, ఉపాధ్యాయులను మినహాయించాలని కోరుతున్నాము.

## ఆదాయపు పన్ను

కేంద్రప్రభుత్వం 2015-16 బడ్జెట్‌లో ఆదాయపు పన్ను పరిమితిని 2.5 లక్షలను యధావిధిగా కొనసాగించడం వల్ల ప్రతి ఉపాధ్యాయుడు ఇన్‌కంటాక్స్ రిటర్న్ సబ్మిట్ చేయవలసి వస్తున్నది. ఎక్కువ సర్వీసు ఉన్న ప్రతి ఉద్యోగి టాక్స్ పరిధిలోకి వచ్చి కనీసం ఒక నెల వేతనం టాక్స్ చెల్లించాల్సి వస్తున్నది. ఆదాయపు పన్ను పరిమితిలో మధ్యశ్రేణి ఉద్యోగులకు ఊరట ఇచ్చేవిధంగా ఆదాయపు పన్ను విధానంలో మార్పు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాం.

ఇన్‌కంటాక్స్‌కి సంబంధించి ఫిబ్రవరి నెలలో ఉపాధ్యాయుల ఇన్‌కం టాక్స్ డిడక్ట్ చేస్తూ DDO లు ఫాం -16 ను ట్రెజరీలో సమర్పిస్తున్నారు. కానీ చాలామంది DDOలు తదుపరి ఇ-ఫిల్లింగ్ చేయట్లేదు. ఇలా సమర్పించని DDOలకు జరిమానా విధిస్తూ ఇన్‌కం టాక్స్ డిపార్ట్‌మెంట్ వారు లెటర్స్ పంపిస్తున్నారు. కొత్త పెన్షన్ విధానం వారు కాని ఎవరైనా సేవింగ్స్ రూ. 1,50,000/- లేనివారు ఒకసారి వార్షిక ఆదాయాన్ని లెక్కించుకొని, సేవింగ్స్ పెంచుకోవలసివున్నది.

## ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యలు

ఎయిడెడ్ ఉపాధ్యాయులకు వేతనాలకు బడ్జెట్ 3 నెలలకు ఒకసారి విడుదల చేస్తూ, విడుదలైన బడ్జెట్‌ను DEO కార్యాలయాల నుండి ఆయా సంస్థలకు కేటాయింపు జరగునప్పుడు పలు సమస్యలు ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్నారు. వీరందరికి 010 హెడ్ క్రింద వేతనాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని పలుమార్లు కోరడం, మంత్రిగారు C&DSE నుండి ప్రతిపాదనలు పంపాలని తెలిపినారు. అన్ ఎయిడెడ్ సర్వీసు లెక్కింపు, 37/2005 చట్టం రద్దు చేయుట, హెల్త్‌కార్డుల వర్తింపు వంటి సమస్యల పరిష్కారానికి కృషి చేయుచున్నాము.

## మోడల్ స్కూల్స్, ఉపాధ్యాయుల సమస్యలు

3 సంవత్సరాల క్రితం ప్రారంభమైన మోడల్ స్కూల్స్ ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్ రూపొందించడానికి, 010 హెడ్ క్రింద జీతాల మంజూరి కి, 10వ PRC అమలుకు, హెల్త్‌కార్డుల జారీకి సంఘ పరంగా కృషి చేస్తున్నాం. DA, IR వర్తింపు, 22 CLs వాడుకొను అవకాశం, మహిళలకు 5 అదనపు సెలవులు, మెటర్నిటీ తదితర సెలవులు పొందుటకు ఉత్తర్వులు ఇప్పించనైనది. బాలికల హాస్టల్స్ వార్డెన్ బాధ్యతలు మహిళా ఉపాధ్యాయినులే చూసుకొనాలనే ఉత్తర్వులను ఉపసంహరింపచేయిస్తామనే హామీని వారికి ఇస్తూ, వీరంతా సంఘ సభ్యులుగా సభ్యత్వం స్వీకరించి మన సంఘం, మన ఎమ్మెల్సీలపై ఉంచిన నమ్మకాన్ని వారి సమస్యలు సాధించి నిజం చేస్తామని తెలుపుతున్నాం.

## KGBV ఉపాధ్యాయులు, CRP, MIS కో-ఆర్డినేటర్ల, కంప్యూటర్ ఆపరేటర్ల సమస్యలు

కాంట్రాక్ట్ ఉద్యోగులైన కస్తూర్బా పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయినులు, క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ (CRP) మండల సమాచార సమన్వయకులు (MIS), కంప్యూటర్ ఆపరేటర్లు వీరంతా కాంట్రాక్ట్ బేసిక్ మీద నియమాకమైన ఉద్యోగులు, వీరి వేతనాలను పెంపుదల చేయించడం జరిగింది. కానీ వీరిని రెగ్యులర్ చేయాలనే విషయంలో గౌరవ ముఖ్యమంత్రి కె.సి.ఆర్ గారు మాట ఇవ్వడం జరిగింది. ప్రభుత్వం ముగ్గురు సభ్యుల కమిటీని వేయడం వారు ఇచ్చిన నివేదిక ప్రకారం జూన్ 02, 2014కు ముందు 5 సంవత్సరాల సర్వీసు ఉండి, రోస్టర్ కం మెరిట్ ప్రకారం నియామకాలు అయితే రెగ్యులర్ చేయవచ్చునని తెలిపినారు. పైన తెలిపిన వారి

నియామకాలు కమిటీ తెలిపిన విధంగా జరిగినట్లయితే అవకాశం కలదు. అలా లేనివారి విషయంలో ప్రభుత్వం సడలింపు ఇవ్వాలని కోరుతున్నాం.

## స్వీపర్ల వేతనాలు పెంపు

రూ. 1637/– వేతనంతో సుమారు 6 వేల మంది స్వీపర్లు తెలంగాణ రాష్ట్రంలో 30 సంవత్సరాల నుండి పనిచేస్తున్నారు. వీరి వేతనాలు పెంచాలని, ప్రారంభ వేతనాలు రూ. 14 వేలు చెల్లించాలని కోరుతున్నామని, ప్రభుత్వం సానుకూలంగా ఉన్నప్పటికీ ఉత్తర్వులు విడుదలలో జాప్యం జరుగుతున్నది. వెంటనే వీరి వేతనాలు పెంచాలని కోరుతున్నాం.

## DSC నిర్వహించాలి

ఉపాధ్యాయుల నియామకము ఉమ్మడి రాష్ట్రంలో 2 సంవత్సరాలుగా, నూతన తెలంగాణ రాష్ట్రంలో ఒకటిన్నర సంవత్సర కాలంగా జరగలేదు. ఉపాధ్యాయ ఉద్యోగ ప్రకటన కొరకు నిరుద్యోగ ఉపాధ్యాయ శిక్షణార్థులు ఎదురు చూస్తున్నారు. కాబట్టి ఖాళీగానున్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి DSCని వెంటనే నిర్వహించాలని కోరుతున్నాం. ఈ విషయంలో సుప్రీంకోర్టు కూడా రాష్ట్ర ప్రభుత్వాన్ని వెంటనే DSC నిర్వహించాలని ఆదేశించింది.

## సాధించాల్సిన సమస్యలు

1. ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్ వెంటనే రూపొందించి Dy.EO/MEO/DIET/JL పదోన్నతులు చేపట్టాలి.
2. PRC 2015 యొక్క 9 నెలల బకాయిలను నగదు రూపంలో చెల్లించాలి.
3. సీనియర్ ఉపాధ్యాయులకు 9వ PRCలో ఏర్పడిన నష్టాన్ని తొలగించడానికి 10వ PRC లో వెయిటేజి ఇంక్రిమెంట్లు మంజూరి చేయాలి.
4. హెల్త్‌కార్డులతో చికిత్సలు అన్ని కార్పొరేట్ ఆసుపత్రులలో అందించాలి. ప్రీమియం చెల్లింపుకు అంగీకరించాలి.
5. రూ. 398/– వేతనంతో పనిచేసిన స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలి.
6. అన్ని ఉన్నత పాఠశాలల్లో SA తెలుగు, హిందీ, PD పోస్టులను మంజూరి చేయాలి.
7. DSC 2003 ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానమును వర్తింపజేస్తూ, CPS విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలి.
8. ఏజెన్సీ ప్రాంతంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఇతర ఉద్యోగుల వలే AHRA వర్తింపచేసి ఉత్తర్వులు విడుదల చేయాలి.
9. 10వ PRCలో ప్రతిపాదించిన విధంగా మహిళా ఉద్యోగులకు 2 సం॥ల చైల్డ్‌కేర్ లీవ్ మంజూరు చేయాలి.
10. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల, ఉపాధ్యాయుల పదవీ విరమణ వయస్సును 60 సం॥లకు పెంచాలి.

11. తెలంగాణ ఇంక్రిమెంట్‌ను 10వ PRC లోని ఇంక్రిమెంట్ రేట్లకు అనుగుణంగా మార్పు చేస్తూ, పెన్షనర్లకు కూడా మంజూరు చేయాలి.

12. సకల జనుల సమ్మెను ఆన్‌డ్యూటీగా ప్రకటించాలి. విద్యార్థులు నష్టపోకుండా సెలవు దినాల్లో ఉపాధ్యాయులు పనిచేసిన 16 రోజులకు 16 EL.s మంజూరు చేయాలి.

13. ప్రతి పాఠశాలకు కంప్యూటర్ విద్యను బోధించడానికి S.A (Comp.) పోస్టును సహ పాఠ్యాంశాల బోధనకు డ్రాయింగ్ / క్రాఫ్ట్ పోస్టులను మంజూరి చేయాలి.

14. ప్రాథమిక పాఠశాలకు ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేవిధంగా 5 గురు ఉపాధ్యాయులను నియమించాలి.

15. 6 నుండి 10వ తరగతి గణిత, భౌతిక, సాంఘిక శాస్త్రాల సిలబస్ దృష్టిలో ఉంచుకొని S.A (గణితం లేదా భౌతిక శాస్త్రం), S.A సాంఘిక శాస్త్ర పోస్టులను అదనంగా మంజూరు చేయాలి.

16. ఎయిడెడ్ ఉపాధ్యాయులకు హెల్త్‌కార్డులు జారీ చేయాలి. 010 హెడ్ క్రింద జీతాలు మంజూరు చేయాలి.

17. ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్ రూపొందించి 010 హెడ్ క్రింద జీతాలు ఇవ్వాలి.

18. జులై 2015 నుండి మంజూరి కావాల్సిన DAను వెంటనే ప్రకటించాలి.

19. 9వ PRCలో 6/12/18/24 సంవత్సరాల అప్రయత్న పదోన్నతి స్కేల్ 01-07-2008 నుండి వర్తింపచేయాలి.

20. 9వ, 10వ PRCలో సీనియర్, జూనియర్‌లకు ఉన్న అసమానతలు తొలగించాలి.

21. 2001, 2005 సంవత్సరాలలో పదోన్నతి పొందిన సీనియర్లకు DSC ద్వారా నియామకమైన వారికంటే ముందు నుండి సీనియారిటీ లెక్కించాలి.

22. DSC 1998, 2008, 2012లలో సెలెక్ట్ అయిన వారికి ఉద్యోగాలు ఇవ్వాలి.

23. రాష్ట్ర విభజన జరిగినందున తెలంగాణ రాష్ట్రంలో పనిచేస్తున్న ఆంధ్ర ప్రాంత ఉద్యోగులకు ఆప్షన్ సౌకర్యం కల్పించి బదిలీకై అవకాశము కల్పించాలి.

24. విద్యాహక్కు చట్టంలో పిల్లల ప్రవేశ వయస్సును 5 సంవత్సరాల నుండి 3 సంవత్సరాలకు మార్పు చేసి శిశు తరగతులను ప్రారంభించి, ఆంగ్ల మాధ్యమము ప్రవేశపెట్టాలి.

25. నూతన మూల్యాంకన విధానము CCE (Continuous Comprehensive Evaluation) సరళీకృతము చేయాలి. పాఠ్య పుస్తకాల సిలబస్ కాఠిన్యతను తగ్గించాలి.

26. పాఠశాలలకు మౌళిక సదుపాయాలు కల్పించాలి. ప్రతి పాఠశాలకు స్వీపర్, నైట్ వాచ్‌మెన్, అటెండర్ పోస్టులు మంజూరు చేయాలి.

## కృతజ్ఞతలు

ఉపాధ్యాయుల సమస్యల సాధనకు నిరంతరం శ్రమిస్తూ, నాకు సూచనలు ఇస్తూ ప్రోత్సహిస్తున్న రాష్ట్ర సంఘ అధ్యక్షులు శ్రీ పి. వెంకట్ రెడ్డి గారికి, శాసనమండలిలో PRTU వాణిని వినిపిస్తూ, సమస్యలను ప్రభుత్వానికి, అధికారులకు ప్రాతినిధ్యం చేస్తూ, సంఘ శ్రేయస్సుకు అహర్నిశలు పాటుపడుచున్న ఎమ్మెల్సీలు శ్రీ కె. జనార్ధన్ రెడ్డి, శ్రీ పూల రవీందర్, AITO ఛైర్మన్ శ్రీ బి. మోహన్ రెడ్డి Ex-MLC గారలకు, "పంచాయతీరాజ్ ఉపాధ్యాయ" మాసపత్రికను తీర్చిదిద్దుతున్న ప్రధాన సంపాదకులు శ్రీ నరహరి లక్ష్మారెడ్డి గారికి, మరియు సంపాదక వర్గ సభ్యులు, శ్రీ కొల్లు మధుసూధన్ రావు, శ్రీ సముద్రాల రాములు, శ్రీ అద్దంకి నాగేశ్వరరావు గారలకు, సందేహాలు సమాధానాలు శీర్షిక నిర్వహిస్తున్న శ్రీ యం. మోహన్ రెడ్డి గారికి, చక్కని సలహాలు, సూచనలతో సహకరిస్తున్న జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

సంఘ ప్రాతినిధ్యాలకు స్పందిస్తూ సమస్యలు పరిష్కరిస్తున్న ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారికి, ఉప ముఖ్యమంత్రి, విద్యాశాఖామంత్రివర్యులు శ్రీ కడియం శ్రీహరి గారికి, గత విద్యాశాఖ మంత్రి శ్రీ జి. జగదీశ్ రెడ్డి గారికి, పట్టభద్రుల ఎమ్మెల్సీ శ్రీ పల్లా రాజేశ్వర్ రెడ్డి గారికి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ రాజీవ్ శర్మ గారికి, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి శ్రీమతి రంజీవ్ ఆచార్య గారికి, శ్రీ రాజేశ్ తివారి గారికి, శ్రీ వికాస్ రాజ్ గారికి, డైరెక్టర్ శ్రీ చిరంజీవులు గారికి, శ్రీ శివశంకర్ గారికి, శ్రీమతి ఉషారాణి గారికి, శ్రీమతి వాణి మోహన్ గారికి, శ్రీ జగదీశ్ గారికి మరియు అధికారులకు, సంఘ పక్షాన మేము ఇస్తున్న వార్తలను రాష్ట్రవ్యాప్తంగా ప్రచురిస్తూ, ప్రసారము చేస్తూ విస్తృత ప్రచారాన్ని కల్పిస్తున్న ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు కృతజ్ఞతాభివందనములు.

## ముగింపు

ఈ నివేదిక కాలంలో చేపట్టిన కార్యక్రమాలను, చేసిన ప్రాతినిధ్యాలను, సాధించిన, సాధించాల్సిన సమస్యలను మీ ముందుంచుతున్నాను. సంఘ అభ్యున్నతికి అనునిత్యం కృషి చేస్తున్న మీరు ఈ నివేదికపై చర్చించి సద్విమర్శతో చక్కటి సూచనలు, సలహాలు ఇచ్చి నివేదికను ఆమోదించవలసిందిగా కోరుతున్నాను.

ఇట్లు

సదా సంఘసేవలో...

**(పి. సరోత్తం రెడ్డి)**

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి